SAPTHAGIRI
(TELUGU)
SPIRITUAL ILLUSTRATED
MONTHLY
Volume: 54, Issue: 2
JULY - 2023
Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక పుటలు-56
జూలై 2023 వెల రూ. 20/-



తిరుమలలో
శ్రీవారి
ఆణివరఆస్థానము
(17-07-2023)

## జమ్మూలోని మజీన్‌గ్రామంలో తావినది ఒడ్డున
## తి.తి.దే. నూతనంగా నిర్మించిన **శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయమహాసంప్రోక్షణ** దృశ్యాలు.

**2023, జూన్ 04 నుండి 08వ తేదీ వరకు** జరిగిన ఈ కార్యక్రమంలో జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కేంద్రమంత్రులు డా॥ జితేంద్రసింగ్, శ్రీ కిషన్ రెడ్డి, తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, పార్లమెంటుసభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శ్రీజుగల్ కిషోర్ శర్మ, జమ్మూకాశ్మీర్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శ్రీఅరుణ్‌కుమార్ మెహతా, ఢిల్లీ స్థానికసలహామండలి అధ్యక్షురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., తదితరులు పాల్గొన్నారు.
















## గీతాశ్లోకార్థసారం



**శ్లో : న చైతద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః ।**
**యానేవ హత్వా న జిజీవిషామ స్తేఽ వస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-06వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** నః= మనకు; కతరత్= ఏది; గరీయః= శ్రేష్టమో; ఏతత్ చ= దీన్ని కూడ; నవిద్మః= ఎఱుగం; జయేమ యద్వా= (మనం) జయించెదమో; (లేక) నః= మనలను; జయేయుః యదివా= (వారే) జయించెదరో?; యాన్= ఎవరిని; హత్వా= చంపి; న జిజీవిషామః= జీవింపగోరమో; తే ధార్తరాష్ట్రాః ఏవ= అట్టి ధృతరాష్ట్రుని సంబంధులైన భీష్మాదులే; ప్రముఖే= ఎదుట; అవస్థితాః= నిలిచియున్నారు.

**భావం:** పైగా ఈ యుద్ధంలో మనం గెలుస్తామో! లేక వారే గెలుస్తారో చెప్పలేం. ఈ రెండింటిలో మనకేది శ్రేష్ఠమో కూడా తెలీదు. ఎవరిని చంపి మనం జీవించగోరమో అట్టి భీష్మాదులు యుద్ధంలో మన యెదుట నిలిచియున్నారు.

---

### నీవే పరిపూర్ణుఁడవు

ఎవ్వరిఁగాదన్న నిది నిన్నుఁగాదంట
యెవ్వరిఁగొలిచిన నిది నీ కొలువు

అవయవములలో నది గా దిదిగా
దవిమే లివి మేలన నేలా
భువియుఁ బాతాళము దివియు నందలిజంతు
నివహ మింతయునూ నీదేహమేకాన

నీవులేనిచోటు నిజముగఁ దెలిసిన
ఆవల నది గా దన వచ్చును
శ్రీవేంకటగిరి శ్రీనాథ సకలము
భావింప నీవే పరిపూర్ణుఁడవు గాన

(సంపుటం- 01, సంకీర్తన-9)





*స్వామీ వేంకటగిరినాథా! ఎవరిని కాదన్నా అది నిన్ను కాదనడమే. ఎవరిని కొలిచినా అది నిన్ను సేవించడమే.*

*స్వామీ! అవయవాలలో అదికాదని ఇది, ఇది కాదని మరొకటి ఎంచరాదు. ఇదిమేలు కాదు అది మేలు అంటూ అభిప్రాయపడరాదు. ఈ భూమి, పాతాళం, ఆకాశం, అక్కడ నివసించే జంతుసమూహం అంతా నీ దేహమే కాబట్టి- ఇందులో ఒకటి మేలైందనీ, మరొకటి మేలుకానిదనీ భావించరాదు. సర్వజగత్తు నీ స్వరూపమే.*

*నీవులేని చోటు నిజంగా ఎక్కడైనా ఉన్నట్లు తెలిస్తే అప్పుడు దాన్నికాదన వచ్చు. శ్రీవేంకటగిరిమీది లక్ష్మీనాథుడా! ఈ సకలమూ భావించి చూస్తే నీవే- నీవే పరిపూర్ణుడవు అని సర్వదేవతా స్వరూపుడైన శ్రీనివాసుణ్ణి అన్నమయ్య పై సంకీర్తనలో స్తుతించాడు.*

# తస్మాత్ జాగ్రత్త!!

తిరుమల దివ్యక్షేత్రాన్ని, శ్రీవారిని దర్శించాలనే పవిత్రభావంతో ఎంతోమంది భక్తులు దర్శన టిక్కెట్లు, గదుల బుక్కింగ్, ఇతర ఆర్జితసేవల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్‌సైట్ / యాప్‌ను సంప్రదిస్తుంటారు.

అయితే, కొంతమంది సైబర్ నేరస్థులు తి.తి.దేవస్థానం పేరుతో చిన్న చిన్న మార్పులు చేసి అనేక నకిలీ వెబ్‌సైట్లు / యాప్‌లను రూపొందించి, భక్తులను పక్కదారి పట్టిస్తున్నారు. ఈ నకిలీ వెబ్‌సైట్లను / యాప్‌లను గుర్తించి, వాటిపై తి.తి.దే. చర్యలు తీసుకుంది. ఈ నకిలీ వెబ్‌సైట్లను / యాప్‌లను నమ్మవద్దని ఇదివరకే భక్తులను హెచ్చరించింది.

తి.తి.దే. అధికారిక వెబ్‌సైట్ / యాప్‌లలో మాత్రమే శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టిక్కెట్లు, గదులు ముందస్తుగా పొందాలని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

భక్తులు ఇలాంటి సైబర్ మోసాలను దృష్టిలో పెట్టుకుని తిరుమలయాత్రలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారికి కావలసిన ఏర్పాట్ల కోసం తి.తి.దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ / అధికారిక యాప్‌ను మాత్రమే సంప్రదించాలి.

## తి.తి.దే. అధికారిక వెబ్‌సైట్

https://tirupatibalaji.ap.gov.in/

**ORIGINAL**




## నకిలీ వెబ్‌సైట్

https://tirupatibalaji-ap-gov.org/

**FAKE**






ఈ 'శ్రీ టీటీ దేవస్థానమ్స్' యాప్ ను ఈ క్రింది లింక్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

https://play. google.com/store/apps/details?id= com.ttdapp



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥


గౌరవ సంపాదకులు
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకులు
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సప్తగిరి మాస పత్రిక
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన
సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి
తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని
మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333



తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక


# సప్తగిరి


సంపుటి : 54 జూలై, 2023 సంచిక : 02


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| **ప్రత్యేకం!!** | | |
| తి.తి.దే. లక్ష్యం అందరూ బాగుండాలి | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 07 |
| సద్గురువుల ఉపదేశం వల్లే..! | డా॥ కుప్పా విశ్వనాథశాస్త్రి | 15 |
| ఒక్క వ్యాసమహర్షికే సాధ్యం! | శ్రీమతి పి.విజయలక్ష్మి | 20 |
| ఈశ్వరుడైనా తప్పించుకోలేడు..!! | శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి | 22 |
| శ్రీవిష్ణుస్వరూపం-అధికమాసం | డా॥ కప్పగంతు రామకృష్ణ | 36 |
| **ధారావాహికం** | | |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 12 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 13 |
| తిరుమల సమయాచారములు | కీ.శే.డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు | 19 |
| | కీ.శే.శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | |
| తిరుక్కణ్ణమంగై | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 26 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 33 |
| **బాలల ప్రపంచం** | | |
| పిల్లలూ.. ఈ బొమ్మల్లో తేడాలు గుర్తించండి! | | 16 |
| క్షమించే.. మనస్సుండాలి! (బాలనీతి) | శ్రీమతి నల్లాని రాజేశ్వరి | 43 |
| గురుదక్షిణ (చిత్రకథ) | కథ: డా॥ కంపల్లె రవిచంద్రన్ | 48 |
| | చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | |
| నలుపు నలుపే (వేమనశతకం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 50 |
| గొడవ మంచిది కాదు (భాస్కరశతకం) | డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు | 50 |
| బాలవినోదం | | 51 |
| క్విజ్ | | 52 |
| **యువలోకం** | | |
| మనిషి మనీషిగా ఎదగాలంటే.. | సారస్వత కళానిధి డా॥వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 24 |
| వేదగణితం | డా॥ ప్రఖ్య సత్యనారాయణశర్మ | 25 |
| విశ్వచైతన్యం పెరగాలంటే... | డా॥ ముంజులూరి నరసింహారావు | 31 |
| **వనితాలోకం** | | |
| గౌరీకరుణకు మార్గం | శ్రీ గరిమెళ్ల శరవణదీక్షితులు | 32 |
| ఆషాఢంలో.. అందాల గోరింట!! | శ్రీమతి నీరజ | 35 |
| **అందరికోసం..** | | |
| పద్మావతీసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, గోవా | శ్రీమతి రమా శాండిల్య | 34 |
| పరమ పవిత్ర గురువు | శ్రీ కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య | 38 |
| ఏడుకొండలవాడా! వేంకటరమణా! | శ్రీ ప్రతాప వెంకట సుబ్బారాయుడు | 40 |
| చిరుచిరుజల్లులు - చిన్ని చిన్ని జాగ్రత్తలు | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీవారి ఆణివర ఆస్థానం, తిరుమల
వెనుకచిత్రం : చిన్నారి గోద (చిత్రం: వి.సి.విష్ణుప్రభ, U.S.A.)




ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# సుందర తిరుమల - మనందరి బాధ్యత

పర్యావరణపరిరక్షణ జనసమ్మర్ద ప్రదేశాలకు మాత్రమే పరిమితం కాదు. యావత్ భూభాగానికి సంబంధించింది. ప్రత్యేకించి శ్రీవారి దివ్యక్షేత్రమైన తిరుమలలో స్వామివారి సందర్శనార్థం విచ్చేసే భక్తులది, ఆలయ యాజమాన్యానిది. ఈనాడు ప్రపంచాన్నంతా తనవైపు దృష్టి మరల్చుకునేలా 'తిరుమల' క్షేత్రం వర్ధిల్లుతోంది. ప్రతి రోజూ లక్షలాది భక్తులు తిరుమలకు వివిధమార్గాలద్వారా చేరు కుంటున్నారు. ఎక్కడైతే జనం చేరుతారో అక్కడ వారి వారి అలవాట్లను బట్టి పర్యావరణంలో మార్పు అనివార్యం. ఈ మార్పుతో రకరకాలసమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. దీని వల్ల ప్రకృతిశోభతో విరాజిల్లే తిరుమల దివ్యక్షేత్రం పర్యావరణ విచ్ఛిత్తికి గురయ్యే సమస్య కనబడుతోంది.

ఈ విపత్కరపరిస్థితిని నియంత్రించడానికి తి.తి.దే. యాజమాన్యం శతవిధాలా కృషి చేస్తోంది. 'నీరే ప్రాణాధారం'. ఆ నీరు స్వచ్ఛంగా త్రాగడానికి చాలా అవసరం. కనుక నీటి సంరక్షణ చాలా అవసరం. యాత్రికులు ప్లాస్టిక్ సీసాలతో నీళ్లు తెచ్చుకోవడం, నీళ్లు త్రాగాక ఎక్కడ పడితే అక్కడ వాటిని పారేయడం జరుగుతోంది. దీన్ని నివారించడానికి తి.తి.దే. వివిధ ప్రసారమాధ్యమాల ద్వారా విస్తృతప్రచారం చేస్తూ చాలావరకు నియంత్రిస్తోంది. అలాగే చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల అనారోగ్యం కలిగి వ్యాధులు పెరగడానికి కారణాలౌతున్నాయి. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి తి.తి.దేవస్థానం అహర్నిశలు ప్రయత్నిస్తోంది. భక్తులలో కూడా చెత్త ఎక్కడ పడితే అక్కడ పారేయకూడదనే అవగాహన రావాలి.

పర్యావరణాన్ని భంగపరిచే చర్యలవల్ల తిరుమలవనాలలోని అమూల్యమైన వృక్షసంపద, ఔషధ మొక్కలు నశించే అవకాశం ఉంది. దీనికి తోడు వాయుకాలుష్యం ఒకటి. ఈ పరిస్థితిని అధిగమించడానికి వృక్షసంపదలవల్ల లాభాల్ని తి.తి.దే. అనేక రకాల ప్రచారం చేస్తోంది. క్షేత్రపర్యావరణం కాపాడుకునేందుకు తి.తి.దే. నిషూపెంచింది. తిరుమల పుష్కరిణిని సైతం కాపాడుకోవడం మనందరి బాధ్యత. కోనేటిలో భక్తులు స్నానం చేస్తూ, బట్టలుతికితే ఆ జలం కలుషిత మౌతోంది. ఆ విపత్తు నివారణకోసం కోనేటిలో జలశుద్ధియంత్రాలు ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణకు- ఆరోగ్యసూత్రాలకు అవినాభావసంబంధముంది. తిరుమలకు కాలినడకన వచ్చేవారు పరిసరాలను అశుభ్రపరచకుండా తి.తి.దే. కనీస అవసరాలను ఎన్నింటినో కల్పించింది.

భగవంతుని సృష్టిలో 'పంచభూతాలు' ప్రధానమైనవి. వీటిని రక్షించడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుంది. చికిత్సకంటే వ్యాధినివారణ ఉత్తమోత్తమం. కనుక, తిరుమల దివ్యక్షేత్రంలోని పంచభూతాలరక్షణ ప్రతిభక్తునికి అవశ్యకర్తవ్యం. ఇదే 'సామూహికయాగం'. ఈ యాగం స్వయం నియంత్రణ వల్లే సత్ఫలితాలను ప్రసాదిస్తుంది.

భక్తులు క్రమక్రమంగా ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించుకోవాలి. వీటి వాడకాల వల్ల పర్యావరణానికి తీవ్రనష్టం సంభవిస్తోంది. కాబట్టి భక్తులు సహృదయంతో ప్లాస్టిక్ వస్తువుల్ని వెంట తీసుకురావడం మానేసి శ్రీవారి తిరుమలను **'సుందర తిరుమల'**గా తీర్చిదిద్దుకునే దిశగా అడుగులు వేయాలి!



# తి.తి.దే. లక్ష్యం
# అందరూ బాగుండాలి

- డా।। కంపల్లె రవిచంద్రన్, 98487 20478

సనాతనధర్మం సువిశాలమైంది. ఈ ధర్మానికి సర్వం సమానమే! అండపిండబ్రహ్మాండాలలోని చరాచరజీవ రాశి అంతా సమానమే! ఇలాంటి భూమిక మీద నిర్మితమైన ఆర్షధర్మం 'రాజాధిరాజులు సర్వప్రజారంజకంగా పాలించనీ' అంటూ ఆకాంక్షిస్తుంది. 'పాలకులు న్యాయమార్గంలో వర్తిల్లుదురుగాక' అని విశ్వాసం ప్రకటిస్తుంది. 'సమస్తలోకాలకు సుఖ శాంతులు అబ్బనీ' అని మనసారా దీవిస్తుంది.

అథర్వవేదోపనిషత్తులు 31. ప్రశ్నోపనిషత్ నుండి గరుడోపనిషత్తు దాక. ఈ ఉపనిషత్తుల శాంతిమంత్రం చాల మందికి ఎరుక.

భద్రం కర్ణేభి శ్రృణు యామ దేవాః
భద్రం పశ్యేమాక్షభిర్యజిత్రాః ।

స్వస్తిన ఇన్ద్రో వృద్ధశ్రవాః
స్వస్తినః పూషా విశ్వవేదాః
స్వస్తినస్తాత్ర్‌క్ష్యో అరిష్టనేమిః
స్వస్తినో బృహస్పతిర్దధాతు

ఓం నమో బ్రహ్మణే నమో అస్త్వగ్నయే
నమః పృథివ్యై నమః ఓషధీభ్యః ।
నమో వాచే నమో వాచస్పతయే
నమో విష్ణవే బృహతే కరోమి ।

**భావం:** ఓ దేవతలారా! మేము మా చెవులతో మంచి మంగళకరమైన విషయాలనే విందుము గాక! మా కళ్లతో మంగళకరమైన వాటినే చూతుము గాక! మీ దివ్యస్తోత్రాలను గానం చేస్తూ, మీరు ప్రసాదించిన ఆయుస్సును పరిపూర్ణమైన ఆరోగ్యంతో, బలంతో నింపుకొని, జీవింతుము గాక!

మాకు గొప్పకీర్తి గల్గిన ఇంద్రుడు శుభాల్ని ప్రసాదించుగాక! సర్వమూ తెలిసిన కర్మసాక్షి సూర్యుడు శుభాలను కల్గించుగాక! ఆపదలనుంచి రక్షించే గరుత్మంతుడు మాకు శుభాలు ప్రసాదించుగాక! బ్రహ్మజ్ఞానాన్ని రక్షించే బృహస్పతి మాకు సకలశుభాలూ అనుగ్రహించుగాక! మా అందరికీ సంపూర్ణమైన శాంతి లభించుగాక!

ఈ శాంతిమంత్రం ప్రతిరోజూ తప్పక భావంతో పఠించాల్సిన దివ్యశక్తిమంతమైంది. 'మన ఇంద్రియాలన్నీ మంచినే చూడాలి. మంచినే వినాలి. మంచినే భావించాలి. దివ్యస్తోత్రాలనే గానం చేయాలి. దేవతలందరూ మాకు సకల సుఖశాంతులూ అనుగ్రహించాలి'-అనే ప్రార్థన నేటి సమాజానికి ఎంతైనా ఆవశ్యకమైంది. ఇలాంటి ఉత్తమ మంగళకరభావాలు

లేనందుకే- మనిషి ప్రతిక్షణం అశాంతికి బలి అవుతున్నాడు. అట్టి అశాంతి శమించాలంటే భగవత్కృప కావాలి. అందుకై ఆయా దేవతల్ని ప్రార్థించి, వారి అనుగ్రహాన్ని పొందాలి.

ఇలాంటి ఆర్షధర్మం ఒకప్పుడు అవ్యక్తం. యుగాల మార్పులు కారణంగా పరిణామస్థితిలో ఆలయాల రూపంలో మార్గదర్శకంగా నేడు నిలిచి ఉంది. ఈ భావం సుదృఢం కావడంతో తమిళ వాఙ్మయం 'కోవెల లేని ఊరిలో నివసించ వద్దు' అని హెచ్చరించింది.

భారతీయులకు ప్రత్యేకించి హైందవులకు సర్వం 'ఆలయమే'. వర్ణవిభేదం లేక సేవించదగ్గ కేంద్రమది. నీచోన్నత వైవిధ్యారహితమైంది. స్వామిసేవలో అందరికీ భాగస్వామ్యం ఉంటుందని, ఉత్సవమూర్తుల ఊరేగింపు ద్వారా ప్రకటించేది. వ్యక్తులకైనా, కుటుంబాలకైనా చివరకు సామాజికజీవనానికైనా దశదిశ చూపేది ఆలయాలే! అలాంటి ఆలయాలలో తిరుమల ఆలయం కలియుగవాస్తవ్యులకు అరిష్టాలకాలంలో ఆదుకునే కరదీపిక.

'అరిష్ట' శబ్దానికి ఎన్నో అర్థాలున్నా ప్రధానమైన అర్థం 'కీడు'. ఇది చరాచరప్రపంచానికి సంబంధించింది. సామాన్య మానవుడు సిద్ధాంతి ద్వారా తన జాతకఫలాలను తెలుసుకుని కీడు కలిగించే గ్రహాలకు దోషపరిహారం చేసుకుంటాడు. దోష పరిహార వ్యవహారంలో సగటు మానవుడు ఆలయసేవనం, జపమంత్ర పూజావిధానాలకు ప్రాధాన్యమివ్వడం తెలిసిన విషయమే. కీడును రాష్ట్రానికి, దేశానికి, ప్రపంచానికి

## 2023, ఆగస్టు నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 09 | ఆడికృత్తిక |
| 15 | భారతస్వాతంత్ర్యదినోత్సవం |
| 20 | నాగచతుర్థి |
| 21 | గరుడపంచమి, మంగళగౌరీవ్రతం |
| 25 | శ్రీవరలక్ష్మీవ్రతం, తరిగొండవెంగమాంబ వర్ధంతి |
| 26-29 | తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం |
| 30 | శ్రావణపూర్ణిమ, శ్రీవిఖనస మహాముని జయంతి |
| 31 | శ్రీహయగ్రీవజయంతి, గాయత్రీ జపం |

అన్వయించుకుని వసుధైకకుటుంబ భావనలో గుర్తించడం ఆనాదికాలం నుండి ఉన్నదే. ప్రత్యేకించి సనాతనధర్మం విశాల దృష్టితో స్వస్తిమంత్రాలకు ప్రాధాన్యమిచ్చింది. **'ఓం లోకాస్స మస్తాస్సుఖినోభవన్తు'** అంది. ఈ వేదమే మరో అడుగు ముందుకు వేసి సూర్యాదిగ్రహాలకు శాంతిని విశదం చేసింది. అధర్వణవేదం (199)లో శాంతి సుక్తమనే పేరుతో ఒక సూక్తం ఉంది.

**పృథివీ శాన్తిరన్తరిక్షగ్ం శాన్తి, ర్ద్యౌశ్శాన్తి, ర్దిశ్రాశ్శాన్తి, రవాన్త రది శాశ్శాన్తి, రగ్నిశ్శాన్తి, ర్వాయుశ్శాన్తి రాదిత్యశ్శాన్తి, శ్చన్ద్రమా శ్శాన్తి, ర్నక్షత్రాణిశ్శాన్తి, రాపశ్శాన్తి, రోషధయశ్శాన్తి, ర్వనస్పతయ శ్శాన్తి, రౌశ్శాన్తి, రజాశ్శాన్తి, రశ్వశ్శాన్తిః, పురుషశ్శాన్తి, ర్బ్రహ్మశాన్తి, ర్బ్రాహ్మణ శ్శాన్తి, శ్శాన్తి రేవ శాన్తి, శ్శాన్తిర్మే అస్తు శాన్తిః**

ఈ సూక్తం ఆనాటి ప్రజల విశాల ఆదర్శభావాల్ని, శాంతికాముకత్వాన్ని సుస్పష్టం చేస్తుంది. ఆకాశంలో ప్రశాంతత నెలకొనుగాక! భూమిలో ప్రశాంతత ఏర్పడుగాక! విశాలమైన అంతరిక్షంలో ప్రశాంతత చోటుచేసుకొనుగాక! ప్రవహించే నదులలో ప్రశాంతత చేరివుండుగాక! చెట్లు చేమల్లో ప్రశాంతత నెలకొనుగాక!

ఈ రోజుల్లో నేలమీది సమరాలు, ఆకాశంలో భయోత్పాతం కలిగించే విన్యాసాలు, అలాగే నీటి కోసం జగడాలు చూస్తే వారికి పై సూక్తంలో ఆనాటి వారి భవిష్యదృష్టి గోచరమౌతుంది.

అలాగే గడచిన కాలంలోని జీవితం, రాగల కాలం లోని జీవితం ప్రశాంతంగా ఉండుగాక! సమస్తమూ మనకు ప్రశాంతతను ప్రసాదించుగాక అనడంలో ప్రాచీనులు శుభాశంసన సువ్యక్తం.

శాంతిప్రాప్తికి లోకంలో ఏఏ మార్గాలున్నాయో అవి సప్తర్షులకు చక్కగా తెలుసు. వాళ్లందరూ నాకు శాంతిని చేకూర్తురు గాక. ఈ శాంతిసూక్తం విశ్వశ్రేయస్సును కోరుతూ దేవతలను ఇంద్రియాలను ప్రార్థించింది. శాన్తిః శాన్తిః శాన్తిః అని చెప్పడానికి కారణం.

సామాన్యులు మంత్రాల చివర మూడుసార్లు శాన్తి చెప్పడం ఎందుకని ఒక ధర్మసందేహాన్ని తరచూ వెలిబుచ్చుతుంటారు. ఇందుకు సమాధానం- 'ఓం' పరమాత్మ

వాచకం. 'అ ఉ మ' ల కలయిక, మూడక్షరాలు కూడిక. అలాగే మూడువిధాలైన తాపాలనుండి విముక్తితో బాటు శాంతి ప్రసాదించమని అభ్యర్థించడం. ఆ తాపాలు ఆధిదైవికతా పాపం మన నిమిత్తం లేక కేవలం దైవనిమిత్తంగా కలిగిన ఉపద్రవాలు, అతివృష్టి, అనావృష్టి, మిడతల దండు, కరోనా లాంటి వ్యాధులు. ఆధ్యాత్మిక తాపం అంటే మన దేహ ఇంద్రియాల వల్లే కలిగే ఆధివ్యాధులు. మానసిక శారీరకవ్యాధులు. మూడవది ఆధి భౌతికతాపం– మనకంటే ఇతరులకైన భార్యాపుత్రాదులకు సంభవించే సర్పవృశ్చికాదుల వల్ల కలిగే బాధల నుండి కష్టాలు కాపాడమని కోరడం.

రాచరికపువ్యవస్థలో రాజులు రాజపురోహితులను గౌరవించేవారు. సంస్కృతంలోని ఒక శ్లోక తాత్పర్యం చమత్కారంగా– 'భార్య తప్పు చేస్తే భర్తది తప్పు. శిష్యుడు తప్పు చేస్తే, గురువుది తప్పు ప్రజలు తప్పు చేస్తే రాజుది తప్పు. రాజు తప్పు చేస్తే పురోహితునిది తప్పు అన్నారు. ఈ శ్లోకంలోని అంతరార్థం భర్త, గురువు, రాజు, ఇతరులు తప్పు దారి మళ్లకుండా చేయాలని సూచన. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో రాజ్యానికి అనుకోకుండా జరిగే విపత్కరాలను ఉటంకించి, జాగ్రత్తపడాల్సిన అంశాల్ని విశదంగా చెప్పాడు. రాజులకాలంలో అరిష్టసమయాల్లో ఆలయాలలో విశేషపూజలు జరిగేవి. మరి ప్రజాస్వామ్యంలో దేవాలయాలే అరిష్టనివారణకు, సహాయ సంపద్వినియోగానికి మార్గదర్శకాలు.

మనకు కలిగే కీడును తీర్చేస్వామి ఏడుకొండలస్వామి, నామాలసామి. నానావిధభక్తిమార్గాలలో పయనించి సేవిస్తే గుప్పెడువరాలు కుప్పించే గుడిలోని స్వామి. ఈ ఏడుకొండల ఏడుగడ మనల్ని ఎన్నో అరిష్టాల నుంచి కాపాడుతూనే ఉన్నాడు. 'శిశువు నేడిపింపక ముద్దు రాదన్నట్లు' మనల్ని జాగ్రత్తగా నడవమని, నడిపించమని హెచ్చరించడానికి ఈశ్వరసంకల్పంతో కొన్ని ఉపద్రవాలు కలిగినా వాటి నివారకుడు మాత్రం ఆనంద నిలయవాసుడైన శ్రీవేంకటనాథుడే! ఈ దృష్టితోనే తి.తి.దే. అరిష్టనివారణ కార్యక్రమాలను ఎన్నిటినో చేపట్టింది. వాటిల్లో అద్భుతశాంతియాగాలు ప్రధానమైనవి. ప్రకృతి వైపరీత్యాలు, అలజడులు, అశాంతి, సంప్రదాయిక ఆచార వ్యవహారలోపాలు, తెలిసీతెలియకచేసే పాపాలు, ఈ విధమైన అనేక దోషాల, పాపాలపరిహారంకోసం శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రంలో ప్రాయ



శ్చిత్త ప్రక్రియలు అనేకాలు ఉపదేశింపబడ్డాయి. ప్రాయశ్చిత్త ప్రక్రియలలో ప్రధానమైంది అద్భుతశాంతి. ఇది మానవుల దైనందినకార్యక్రమాలలో జరిగే లోటుపాట్లకు, పాపాలకు ప్రాయశ్చిత్తరూపమేకాక పరమాత్మునియొక్క ఆగ్రహాన్ని తగ్గించటానికి కూడా ఉద్దేశింపబడింది.

మానవుని యొక్క దుష్టప్రవర్తనలపై దేవతలు కోపగించుకుని ప్రకృతివైపరీత్యాలు కలుగజేస్తారని, మన ప్రవర్తన సవరించుకోనంతవరకు అవి తీవ్రప్రభావాన్ని చూపిస్తాయని మనవిశ్వాసం. ఈ శాంతియజ్ఞం మనలో మంచిమార్పును కలుగజేయటమేకాక ప్రకృతియొక్క దుష్ఫలితాలను అరికడుతుంది.

**ఉత్పాతేషు తు దుష్టేషు తత్క్షణే శాంతిమారభేత్।**
**కాలక్షేపో నకర్తవ్యః ఉత్పాతా ఘోరభీతిదాః॥**

**ఖిలాధికారః 40, 29.**

ఎప్పుడు ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయో ఆ క్షణం లోనే శాంతిప్రక్రియలు ఆరంభించాలి. ఆలస్యం జరిగితే తీవ్రపరిణామాలు సంభవిస్తాయని భృగువు ఉపదేశించాడు.

మరీచిమహర్షి శాంతి– సందర్భానుసారంగా ఐదు రకాలుగా నిర్ణయింపబడిందనీ, అది అద్భుతశాంతి, ప్రభూత శాంతి, మహాశాంతి, శాంతి, శుద్ధి, అని ఐదు రకాలు.

ఇందులో అద్భుతశాంతి చాలా ముఖ్యమైంది. ఎక్కడైనా అల జడులు, అశాంతి, కరవు, భూకంపాలు, అతివృష్టి, అనావృష్టి, వైపరీత్యాలు ఏర్పడితే వాటికి నివారణగా, మానవసంక్షేమానికి ఉద్దేశింపబడిందే ఈ **"అద్భుతశాంతి ప్రక్రియ"** అని విమా నార్చనాకల్పంలో ఉపదేశించాడు.

## అద్భుతశాంతి విధానం

ఈ అద్భుతశాంతిప్రక్రియ వైఖానస భగవచ్ఛాస్త్రోక్త రీత్యా యాగశాలలో ఆచరింపబడుతుంది. యాగశాలలో–

1)గార్హపత్యం 2)అన్వాహార్యం 3)ఆహవనీయం 4)అవ సథ్యం 5)సభ్యం 6)పౌండరీకం.

ఈ అగ్నులు నిర్మింపబడి, హోమాదులకు ఉద్దేశింప బడతాయి. ఈ అగ్నులు భగవంతుని షడ్గుణైశ్వర్యాలకు సంకేతం. ఈ వివిధరకాల అగ్నులను ఆరాధించటంలోనే శ్రీమహావిష్ణువుయొక్క రూపాన్నికూడా ఆరాధించటం జరుగు తుంది. విష్ణువేసర్వస్వం, శ్రీమహావిష్ణువే పరదైవం, శ్రీమహా విష్ణువే ఏడు వ్యాహృతులు అని భృగువుయొక్క అధికారవచనం.

అద్భుతశాంతి ప్రక్రియ శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రోక్తరీత్యా చతుర్వేదమంత్రాలతో, అష్టాక్షరీమంత్రసహితంగా సుదర్శన, నారసింహమంత్రాలతో దిక్ సూక్త మంత్రాలతో భృగుమహర్షి వచనానుసారం త్ర్యాహ్నికదీక్షతో ఆచరింపబడుతుంది.

త్ర్యాహ్నికదీక్షతో జరిగే ఈ అద్భుత శాంతి యజ్ఞంలో గజపూజ, గోపూజ, వృద్ధ దంపతీపూజ, కుంభపూజలతో యజ్ఞపురుషుడైన శ్రీమహావిష్ణువును అర్చించటం జరుగుతుంది.

సర్వాభ్యుదయసిద్ధికి, మానవాభ్యు దయానికి, ప్రశాంతతకు ఉద్దేశింపబడిన ఈ అద్భుతశాంతి యజ్ఞం తి.తి.దే. పలుమార్లు నిర్వ హించింది. ఈ పవిత్ర వైదికకార్యక్రమాలలో భక్తులందరూ పాల్గొని, శ్రీమహావిష్ణువు అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆశించింది.

అలాగే చరాచరప్రపంచం సస్యశ్యామలంగా ఉండా లంటే వరుణకటాక్షం తప్పనిసరి. త్రిలోకాధిపతి దేవేంద్రుని ఆన, అన్నిటికి మించి ఈ దేవతలకు స్వస్వామి అధికారమిచ్చిన 'శ్రీమహావిష్ణువు కటాక్షం' అవసరం. వర్షాభావ పరిస్థితులలో జీవరాశి త్రాగడానికి నీరు కూడా లేక తహతహలాడుతుంటే తన కరుణాప్రవాహంతో హర్షదాయకమైన వర్షం కురిపించే వాడే ఆ వృషాద్రినాథుడు. మానవులలోని సంకల్పాలకు మాధవుడే కారకుడు కనుక ఆలయరక్షకులు దైవవిశ్వాసం సడలరాదని లోకరక్షణ స్థిరతరపౌరుషంతో వర్షాలు కురవడం కోసం వరుణజపం, సుదర్శనహోమాదులు నిర్వహించి భక్తుల ఆస్తిక్యాన్ని నిలబెడుతోంది. తొలినుండి తిరుమల మీద చాలా సార్లు, తిరుపతి కపిలతీర్థం దగ్గర వరుణ జపాలు చేయించడం, వర్షాలు కురవడం మన అనుభవంలోని అంశాలు.

విపరీతమైన జననష్టానికి క్రిమికీటకాదుల వల్ల విస్తరించే రోగాలు ఒక హేతువు. రెండేళ్లక్రితం ప్రపంచదేశాలను గడగడలాడించిన 'కరోనా' సమయంలో మానవమేథస్సుతో మందులు కనుక్కుంటున్నా భారతీయప్రజానీకానికి కొండంత ధైర్యమిచ్చింది– తిరుమల నాదనీరాజనవేదిక మీది 'సుందర కాండ పారాయణం'. ఇది ఒక అరిష్టనివారకప్రయత్నంగా సాగింది. ఈ పారాయణం తిరుమలలో వివిధప్రదేశాలలో



వేదవిప్రులద్వారా, సామాన్యజనులద్వారా నిరంతరం కొన సాగుతూ ఉంది. నిర్భయత్వాన్ని, ఆరోగ్యత్వాన్ని హనుమ అనుగ్రహిస్తాడని ఈ పారాయణ పరమార్థం.

పూజావిధానాలలో అరిష్టనివారణకు కూడా తి.తి.దే. ఎన్నో ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రతి సంవత్సరం స్వామివారికి జరిగే కైంకర్యాలలో మంత్రహీనం, క్రియాహీనంలాంటివి

ప్రాయశ్చిత్తపూర్వకంగా 'పవిత్రోత్సవాలు', 'పుష్పయాగాదులు' తి.తి.దే. ఆలయాల అన్నిటా జరుపుతోంది. నీరాజనంలో మూడోసారి ఎత్తే పళ్లెంవెలుగు రాజ్యక్షేమార్థమే.

ఒక వ్యక్తికి అచ్చమైన శాంతినిచ్చేది ఆధ్యాత్మికజ్ఞానం. దైవభీతి, దైవంపై నమ్మకం మనిషికి కవచాలు. అలాగే సమస్యల నుండి బయటపడడానికి మంచి అభిరుచులు పెంచుకోవడం ఏకైక పరిష్కారం. ప్రత్యేకించి ఆధ్యాత్మిక ఉపన్యాసాలు వినడం, ఆలయాల సందర్శన, సంగీతాది కార్యక్రమాలలో భాగం పంచుకోవడం, సామాజికసేవ మనిషికి తప్పక శాంతిని ప్రసాదిస్తాయి. అలాగే సద్గ్రంథపఠనం. మహాత్మాగాంధీ తనకు గీతాధ్యయనంతో ఎన్నో సమస్యలకు పరిష్కారాలు తోచేవని చెప్పేవారు.

కాసంత సామాజికసేవ, కాసంత ఆధ్యాత్మికజ్ఞానం వ్యక్తులకు శాంతిని ప్రసాదించే వరాలు. భారతదేశం శాంతి కాముకత్వదేశం. ఇతరదేశాలలో ఉన్నంత అశాంతి భారత దేశంలో లేదు. కారణం భారతీయులు అలౌకికజీవనం, ముక్తి ఒక్కటే గమ్యమని భావించడం వల్ల. విద్యలలో ఆధ్యాత్మికవిద్య సర్వశ్రేష్ఠమన్నాడు గీతాకారుడు.

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు
ఓం సర్వేషాం శాన్తిర్భవతు।
ఓం సర్వేషాం పూర్ణం భవతు
ఓం లోకాస్సమస్తాస్సుఖినో భవన్తు॥

తాళ్లపాక చినతిరుమలాచార్యులు తన సంకీర్తనలలో జన్మశాంతి, గృహశాంతి, సర్వగ్రహశాంతి, నక్షత్రశాంతి, కాల శాంతులు చేయడంకంటే శ్రీహరి సంకీర్తనలు చేయడం వల్లనే 'శాంతి' అని కీర్తించాడు.

తి.తి.దే. ఆలయపాలన ధ్యేయం కూడా సర్వశాంతి స్థాపన, శాంతిసాధన మాత్రమేనని భక్తజనులు గ్రహించి ఆ మార్గంలో పయనించాలని ఆకాంక్ష!

సర్వేత్ర సుఖినస్సంతు సర్వే సంతు నిరామయాః,
సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖమాప్నుయాత్.



## ఆణివార ఆస్థానం

ప్రతి సంవత్సరం దక్షిణాయన పుణ్య కాలం, కర్కాటక సంక్రాంతి రోజు తిరుమలలో 'ఆణివార ఆస్థానం' జరుగుతుంది. తమిళుల ఆణిమాసం చివరిరోజున జరిగే ఆస్థానం కనుక దీన్ని "ఆణివార ఆస్థానం" అంటారు.

పూర్వం దేవస్థానంవారి ఆదాయ వ్యయాలు, నిల్వలు, మొదలైన సంవత్సర లెక్కలు ఈ ఆణివారఆస్థానం రోజున ప్రారంభమయ్యేవి.

ఆ రోజు బంగారువాకిలి ముందు సర్వ భూపాల వాహనంలో శ్రీదేవి, భూదేవులతో శ్రీమలయప్పస్వామివారిని వేంచేపు చేస్తారు. మరో పల్లకిపై విష్వక్సేనులవారిని వేంచేపు చేసిన పిదప ఘనంగా వస్త్రసమర్పణ, నివేదనలు జరుగుతాయి. తర్వాత అక్షతారోపణ జరిగిన తర్వాత తి.తి.దే. కార్యనిర్వహణాధికారికి దేవస్థానం తాళాల గుత్తిని తగిలించి హారతి, శఠారులను ఇస్తారు. ఆ తర్వాత ప్రసాదవితరణ జరుగుతుంది.

బంగారువాకిలి ముందు జరిగే ఆణివార ఆస్థానంలో అర్చకులు, జియ్యంగార్లు, అధికారులు, తి.తి.దే. ఉద్యోగులు మాత్రమే పాల్గొంటారు. ఆణివారఆస్థానం సందర్భంగా ఆ సాయంత్రం తిరుమల



పురవీధుల్లో దేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామికి పుష్పపల్లకిలో ఊరేగింపు జరుగుతుంది. *(ముఖచిత్ర కథనం)*



# సందేహాలు-సమాధానాలు

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

**ప్ర: సముద్ర స్నానానికి నియమాలు ఏమిటి?**

**జ:** సముద్రాన్ని ఎప్పుడుపడితే అప్పుడు తాకరాదు. వినోదార్థమో, విలాసార్థమో సముద్రంతో ఆడుకోవడం తగదు. మంగళ, శుక్ర వారాలలో సముద్రస్నానం చేయరాదు. పర్వదినాలలో మాత్రమే సముద్రస్నానం చేయాలి. వైశాఖ, ఆషాఢ, కార్తిక, మాఘ మాసాలలో సముద్రస్నానం మంచిది. సముద్రస్నానానికి వెళ్లే ముందుగానే చన్నీటిస్నానం చేసి వెళ్లాలి. స్నానానంతరం మళ్లీ చన్నీటి స్నానంచేయాలి. పదిహేనునిమిషాలు సముద్రంలో స్నానం చేయరాదు. సముద్రునికి ముందుగా నమస్కరించి సంకల్పం చెప్పుకుని, బయట మట్టిని లోపల వేసి, తరువాత స్నానం చేయాలి. స్నానం చేసేటప్పుడు మౌనాన్ని పాటించాలి. దైవస్మరణ చేయాలి.

**ప్ర: జన్మనక్షత్రంలో ఏం చేయాలి? ఏం చేయకూడదు?**

**జ:** జన్మనక్షత్రంలో యాగం, చౌలకర్మ, అన్నప్రాశన, వ్యవసాయం, ఉపనయనం, భూసంపాదన, అక్షరాభ్యాసం చేయవచ్చు. శుభకరం. సీమంతం, గర్భాధానం, క్షౌరకర్మ ఔషధసేవారంభం, ప్రయాణం చేయరాదు. అశుభం. స్త్రీలకు జన్మ నక్షత్రంలో వివాహం చేయడం మంచిదే. పురుషులకు జన్మ నక్షత్రంలో వివాహం పనికిరాదు.

**ప్ర: పీడకలలు రాకుండా ఉండాలంటే, వాటి ప్రభావం లేకుండా చేయాలంటే ఏం చేయాలి?**

**జ:** గోవిందనామస్మరణ చేసి, నిద్రపోతే పీడకలలు రావు. వచ్చినా వాటి ప్రభావం ఉండదు. గజేంద్రమోక్ష ఘట్టాన్ని, త్రిమూర్తులను తలచుకొని నిద్రించడం, తిరిగి లేస్తూనే వాటిని స్మరించడం చేస్తే దుస్స్వప్న ప్రభావం ఉండదు. ఉదయాన్నే దూర్వాలతో గణేశుని అర్చించినా మేలుకలుగుతుంది. నారాయణుడు దుస్స్వప్ననాశకుడు.

**ప్ర: ఉత్తరం వైపు తలపెట్టి పడుకోకూడదంటారు. నిజమేనా? నిద్రకు కూడా నియమాలున్నాయా?**

**జ.** ఎప్పుడూ ఉత్తరంవైపు తలపెట్టి పడుకోకూడదు. స్వగృహంలో తూర్పువైపు, మామగారి గృహంలో దక్షిణంవైపు, ప్రవాసంలో పడమరవైపు తలపెట్టుకోవాలి. తడి వస్త్రంతో నిద్రించరాదు. కాళ్లు కడుక్కుంటే, పొడిగా తుడుచుకొని నిద్రపోవాలి. తడి పాదాలతో నిద్రించరాదు. మోదుగ, మఱ్ఱి, నేరేడు, జువ్వి, రావి, మేడి ఈ వృక్షాల కఱ్ఱతో చేసిన మంచంపై నిద్రించరాదు. జలమధ్యంలో, శత్రుమధ్యంలో, ధాన్యంలో నిద్రించరాదు. గోవులు, దేవతామూర్తులు, గురువులు వీరికి ఉన్నతంగా ఉన్న స్థలంలో నిద్రించరాదు. ఏదైనా పదార్థాన్ని నోటిలో ఉంచుకొని నిద్రించరాదు.

**ప్ర: కొత్త తులసి మొక్కను పాతడానికిగానీ, మార్చడానికి గానీ మంచి రోజులు చూడాలా?**

**జ.** శాస్త్రరీత్యా ఆషాఢశుద్ధఏకాదశి నుండి, కార్తికశుద్ధఏకాదశి వరకు చాతుర్మాస్యాలంటారు. ఆ రోజుల్లో కొత్తగా తులసి మొక్కను మార్చి పాతడం కూడదు. ఏకాదశి, ద్వాదశి, పూర్ణిమ, అమావాస్య, శుక్రవారాలలో తులసిని కోయరాదు.

**ప్ర: పిల్లలకి పేరు పెట్టడంలో ఏవైనా శాస్త్రనియమాలున్నాయా? ఇష్టమొచ్చిన పేరు పెట్టుకోవచ్చా?**

**జ:** అది వారి అభిప్రాయాన్ని బట్టి ఉంటుంది. అయితే శాస్త్రంపై గౌరవం ఉన్నవారు కొన్ని నియమాలు పాటించడం మంచిది. నక్షత్రరీత్యా పేర్లు పెట్టడాన్ని కొందరు చెప్తారు. కానీ సంప్రదాయసిద్ధంగా ఉన్న నియమాల ప్రకారం –

1) మగపిల్లల పేరులోని అక్షరాలు సరి సంఖ్యలోనూ, ఆడపిల్లల పేరులోని అక్షరాలు బేసి సంఖ్యలోనూ ఉండాలి.

2) మహర్షుల పేర్లు, దేవతల పేర్లు, తమ వంశంలోని పూర్వీకులలో మహాత్ముల పేర్లు పిల్లలకి పెట్టినట్లయితే– శీఘ్రంగా సత్కీర్తినీ, ప్రఖ్యాతినీ, ఆయుర్దాయాన్నీ పొందుతారు.

3) కఠినంగా, ఎక్కువ ద్విత్వాక్షరాలతో కూడిన పేర్లను పెట్టరాదు.

4) నదులపేర్లు, చెట్లపేర్లు, అడవులపేర్లు పెట్టకపోవడం మంచిది.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



గత సంచిక తరువాయి...

ఆపై లక్ష్మీదేవి తన కళలను వైకుంఠం లోనే ఉంచి ఒక కళతో భూలోకం చేరు కొంది.

స్వామి క్రీడాద్రిని ఆ అద్రిపై నీళా దేవిని, శ్రీదేవిని దూరంనుండి చూశాడు. అంతేగాదు శ్రీదేవి పరివారాన్ని కూడా చూచి “ఇంకేం! నేను భూలోకంలో ఒక్కణ్ణే కాదు. వైకుంఠంలోని పరివారమంతా భూలోకం చేరడంతో నేను ప్రస్తుతం సంసారి నయ్యాను.” అంటూ మురిసి పోయాడు. తన స్వయంనిర్ణయంతో శ్రీదేవి రావడంతో సమస్యలకు అవకాశమే లేదని సంబరపడిపోయాడు. దిగి వచ్చిన గరుత్మంతుని స్వామి పుష్కరిణికి పడమటి భాగాన ఉంచమన్నాడు. వరాహరూపధారి అయిన స్వామిని దర్శించడానికి విచ్చేసిన దేవతలు భయవినయ సంభ్రమాలతో స్తుతి చేశారు.

“శ్రీమన్మహాశ్వేత సత్క్రోడరూపా! యనిర్లేప! బోధ ప్రదీపా! ప్రతాపోజ్జ్వలా! శ్రీప! భూపా! హిరణ్యాక్ష కాఠిణ్య దేహాద్రి దంభోళిధారా! సురాధార! ధాత్రీతలోద్ధార! భర్మాద్రి ధీరా! జగత్సార! చిత్సార భూతా! భవాంభోధి పోతా! సుమోక్షప్రదాతా! గుణాతీత! వేదార్థనిర్ణేత! పూతాత్మ! ధాతా! మహాపంచభూత ప్రభూత ప్రపంచాకరా! శ్రీకరా! సుప్రసన్నాత్మవై మమ్ము రక్షించు మీశా! రమాధీశ! నీ సత్త్వభావంబు లెన్నన్ సహస్రాననుండైనఁ దానోపునే! మాకు శక్యంబె? నీ యుగ్రదంష్ట్రాకరాళా స్యమున్ నీసటల్; వేడి చూడ్కుల్, మహాభీకరా కారమున్ చూడ మాకే య సాధ్యంబుగాఁ దోచె; లోకంబులో మానవవ్రాతముల్ చూచి భీతిల్లరే! తండ్రి! దేవ మమ్ముద్ధరిం పన్ సదా సౌమ్యరూపంబు వేఁ దాల్చి శ్రీభూమి నీళా సమేతుండవై దేవ తిర్య ఙ్మనుష్యాఖ్య జీవాళులం బ్రోచుచున్, సర్వనిత్యోత్సవంబుల్ మహాభక్త బృందంబు లర్పింపగా దివ్యలీలాప్రభావంబులం జూపుచున్ మీరు క్రీడాచలంబందు వేం చేసియుండుండహో! పూర్ణకామా! గుణ స్తోమ! దేవోత్తమా! దేవతాసార్వభౌమా! తరిగొండ ధామా! నృసింహా! హృతాంహా! వరాహావతారా! నమస్తే నమస్తే నమస్తే నమః” అని స్తుతిస్తే వరాహదేవుడు దేవేం ద్రాదులను సుప్రసన్నదృష్టితో వీక్షించాడు. దేవతల స్తుతులకు పరవశుడైన స్వామి దేవతలతో ఇలా అన్నాడు.

“చతుర్ముఖా! కైలాసవాస! హిరణ్యాక్ష సంహారం కోసం నేను వరాహావతారం ఎత్తవలసి వచ్చింది. లోకకంటకుడు నశించాడు. స్థావర జంగమాలు తిరంగా నిలబడడానికి వీలయింది. హిరణ్యాక్ష సంహారానికి ముందు మీరెలా ఉన్నారో అలాగే మీ మీ లోకాలలో ఉండండి. నేను భూదేవి శ్రీదేవులతో మీకు అందుబాటులో ఉంటాను. శ్రీలక్ష్మి నా వక్షఃస్థల నివాసిని గానే ఉంటుంది. లోకభయంకరమైన రూపంతో గాక రమ్యాకారంతో భూలోక నివాసుల్ని అనుగ్రహిస్తాను. నా భక్తులలో ఎవరెవరు ఏ ఏ కోరికలు కోరుతారో వాటినన్నిటిని వారు సంతృప్తి పడేలా చేస్తాను. అంతేకాదు, నన్ను శరణుజొచ్చే వారికి భవదుఃఖాదులు లేకుండా చేస్తా”నని భరోసా ఇచ్చాడు. తదనంతరం వరాహ దేవుడు దర్శనీయరూపుడయ్యాడు. శాంత చిత్తుడై దేవతలను కరుణార్ద్రదృష్టితో వీక్షించాడు.

హరి తన నివాసాన్ని తనకు తగినట్లు తీర్చిదిద్దుకొన్నాడు. పుష్కరిణి తీర్థం ఒకవైపు, భవ్యపుష్కరిణి మరోవైపు, వాయవ్యంలో చిత్రాతిచిత్రమైన భవనాలు. అలాగే దర్శనీయమైన మంటపాలు, వేయి



సూర్యుల కాంతులతో మెరసే గోపురాలు, ప్రాకారాలతో కూడిన 'మాయా నిగూఢ' విమానస్థుడయ్యాడు. క్షణమాత్రంలో ప్రకాశితమైన భవనాదుల్ని చూచి దేవతలు ఆశ్చర్యపరవశులవుతుండగా వరాహదేవుడు దేవేరులతో అంతర్ధానమయ్యాడు.

దేవతలందరు నిష్క్రమించాక శ్రీభూనీళాదేవులు వరాహస్వామికి మొక్కారు. అప్పుడు ఆ హరి "ఆదిలక్ష్మీ! నా ఘోరాకారాన్ని చూచి భయపడతావనుకొన్నాను. కానీ, నీవు నా కార్యాన్ని గుర్తించావు. నీళాదేవితో నా దగ్గరికి వచ్చావు. అంతే కాదు పరివారంతో రావడం నాకెంతో ఆనందం" అన్నాడు.

"స్వామీ! మీరెందుకు అలా భావించారు? మిమ్మల్ని వదలి ఒక నిమిషమైనా ఉండగలనా! నేనేదైనా తెలియక తప్పు చేసి ఉంటే క్షమించండి, అందరిని దయాదృష్టితో చూడండి" అని చేతులెత్తి మొక్కింది.

"భూమంతా గాలిస్తే ఈ స్థలమొక్కటే నా నివాసానికి అర్హంగా తోచింది. ఈ ప్రదేశం నాకు పరమతృప్తి కలిగించింది. ఆదిలక్ష్మీ! ఇదే మనకు వైకుంఠ"మన్నాడు హరి.

"మీరు సర్వజ్ఞులు. మీరున్న చోటే నా చోటు. ఈ ప్రదేశం నిజంగా రమణీయం, కమనీయం కూడా. పండ్లను ప్రసాదించే చెట్లు, రకరకాలైన పూలతీగెలు, పుణ్యతీర్థాలు, మున్యాశ్రమాలు, ఎత్తయిన కొండశిఖరాలు, మోక్షస్థలాలుగా కనిపించే ఈ ప్రదేశమంతా నాకూ చాలా ఇష్టం" అనడంతో వరాహదేవుడు ఆదిలక్ష్మిని వక్షఃస్థలాన నిల్పి దేవేరులను ఆదరిస్తూ గరుడానంత విష్వక్సేనాదులు సేవించగా నెలకొన్నాడని సూతుడు శ్వేతవరాహ వృత్తాంతాన్ని చెప్పగా–

మునులు "మీరు స్వామి పుష్కరిణి గురించి పదే పదే ప్రస్తావించారు. ఆ పేరే చిత్రంగా ఉంది. ఆ పుష్కరిణీ విశేషాలు వినాలని కుతూహలంగా ఉంది. చెప్పరా!" అని కోరారు. తప్పక చెబుతానని సూతుడన్నాడు.

*(ఇంకా ఉంది)*

## వైకుంఠపాళి
### :: 90 - సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఆ | | 2 తొ | లి | | 3 శ | య | నై | 4 కా | ద | శి |
| షా | | ల్క | | | | | | కి | | |
| ఢ | | రి | | | 5 గా | | | | 6 ము | |
| 7 మా | మ | | | 8 పూ | త | న | | | 9 లె | త |
| సం | | 10 గో | | | మి | | 11 కా | | గ | |
| | 12 గో | రిం | టా | కు | | 13 సు | మి | త్ర | | 14 చా |
| | | క | | | | | క | | | తు |
| 15 ఆ | డి | | | 16 యా | | 17 ఆ | | 18 వి | | ర్మా |
| షా | | 19 వి | యో | గం | | షా | | దు | | స్య |
| ఢం | | ది | | టి | | ఢం | | రు | | దీ |
| | 20 వా | య | సం | | | | | దు | | క్ష |



విద్యవల్ల వ్యక్తి తన కాళ్లమీద తాను నిలువగలుగుతాడు

# సద్గురువుల ఉపదేశం వల్లే..!

– డా।। కుప్పా విశ్వనాథశాస్త్రి

గురువుగారు శిష్యుణ్ణి పరీక్షించుకున్న తరువాత శిష్యుడి సాధనలో లోటుపాట్లు ఏవైనా ఉంటే సరిదిద్ది మహావాక్యాలని ఉపదేశిస్తారు.

మహావాక్యాలు అంటే ఆత్మస్వరూపాన్ని వివరించే వాక్యాలు. అందులోనూ ఆత్మ ఈ దేహం కాదు. ఈ దేహం లాగా పరిచ్ఛిన్నమైన రూపం ఆత్మకు లేదు. అపరిచ్ఛిన్నమైన సర్వత్రా వ్యాపించి ఉండే బ్రహ్మతత్త్వమే ఆత్మ స్వరూపం అని బోధించే వాక్యాలు మహావాక్యాలు.

ఇవి చాలా ఉపనిషత్తులలో చాలాచోట్ల చాలానే ఉన్నప్పటికీ ప్రధానంగా నాలుగు మహా వాక్యాలు ప్రసిద్ధంగా ఉన్నాయి. అవి– తత్ త్వం అసి, అహం బ్రహ్మ అస్మి, అయం ఆత్మా బ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ అని నాలుగు.

ఈ మహావాక్యాలు సాధకులకు కలిగే రకరకాల సందేహాలను నివృత్తి చేస్తూ ఉంటాయి. అయితే ఇంత చిన్న వాక్యం మనకున్న పెద్ద సందేహాలని తీర్చగలదా? అన్న ప్రశ్న పుదుతుంది.

దీనికి రెండు రకాల సమాధానాలు చెప్పుకోవాలి.

**(1)** ఈ వాక్యం వినటానికి ఇంత చిన్నదిగా ఉన్నా దీని అర్థం చాలా విస్తారంగా ఉంటుంది.

**(2)** ఈ వాక్యాన్ని విని ఊరుకోకుండా దీని తాత్పర్యం ఏంటి అని గురుముఖతః తెలుసుకుని, వాక్యార్థాన్ని భావన చేస్తే అప్పుడు ఈ వాక్యం వల్ల కలిగే జ్ఞానానికి బలం చేరి తప్పకుండా మన భ్రమలని లేదా సందేహాలని పోగొడుతుంది.

కాబట్టి మహావాక్యాల అర్థం, వాటి తాత్పర్యం బాగా తెలుసుకోవాలి. ఇలా తెలుసుకునే మార్గాన్ని శ్రీశంకరాచార్యుల వారు చాలా విస్తారంగా తెలిపారు. అయితే అన్ని మహావాక్యాల అర్థాలూ ఒకేసారి విచారించలేము కనక **తత్త్వమసి** అనే మహావాక్యానికి అర్థాన్ని కొంచెం సంక్షిప్తంగా తెలుసుకుందాం.

"జీవుడు వేరు బ్రహ్మవేరు. జీవుడు అంటే శరీరాన్ని అంటిపెట్టుకుని ఉండేవాడు. బ్రహ్మ అంటే పరమాత్మ వ్యాపకమైన స్వరూపం" అని భ్రమలు ఉన్నవాళ్లను ఉద్దేశించి ఈ మహావాక్యం వచ్చింది. దీనికి సామాన్య అర్థం జీవుడు, బ్రహ్మ వేరు కాదు ఒకరే. లేదా ఆత్మదేహం కాదు దేహం అల్పమైంది. ఆత్మ స్వరూపం వ్యాపకమైంది. కాబట్టి వ్యాపకమైందే ఆత్మస్వరూపం అని.

**త్వం** అనే పదానికి నువ్వు అని అర్థం. అంటే ఈ మాట విని అర్థం చేసుకునేవాడు అని అర్థం. ఇంకొంచెం లోపలికి వెళితే అర్థం చేసుకోవటం అంటే జ్ఞానం కనుక జ్ఞాన స్వరూపం అని అర్థం తేలుతుంది. ఈ జ్ఞాన స్వరూపం దేహాదులకంటే విలక్షణమైంది కనుక దేహాదులకంటే వేరైన చైతన్యమే **త్వం** అనే శబ్దానికి అర్థం అని తేలుతుంది. **త్వం** అనే పదానికి చైతన్యమే అర్థం అని శ్లోకానికి ఫలితార్థం.



**తత్** అనే పదానికి ప్రసిద్ధమైన వస్తువు అని అర్థం. సమస్తజగత్తుకీ కారణంగా ప్రసిద్ధమైన, వ్యాపకమైన వస్తువే ప్రస్తుతంలో తత్ అనే పదానికి అర్థం. ఇంకా లోపలికి వెళ్లి చూస్తే వ్యాపకమైన అపరిచ్ఛిన్నమైన వస్తువు తత్ అనే పదానికి తేలే అర్థం.

ఏరకమైన వస్తువులతోనూ లేదా దేహాదులతో సంబంధం లేనిదీ, ప్రపంచంలోని వస్తువులలోకి చేరనిదీ, అంటే వాటికంటే విలక్షణమైందీ, దోషాలు లేక శుద్ధమైందీ, అద్వితీయమైందీ, నాశంలేనిదీ, స్వానుభవంతో మాత్రమే తెలుసుకోదగిందీ అయిన చైతన్యమే తత్ అనే పదానికి అర్థం అని శ్లోకం యొక్క భావార్థం.

**అసి** అనే పదం వల్ల తత్ అనే పదానికి అర్థం అయిన వ్యాపకమైన చైతన్యానికీ త్వం అనే పదానికి అర్థం అయిన చైతన్యానికీ (శ్రోతకీ) భేదం లేదు అని తెలుస్తుంది. ఈ అర్థాన్ని ప్రసిద్ధమైన ఒక ఉదాహరణతో వివరణ చేసుకోవటానికి ప్రయత్నం చేసుకుందాం. ఆ పద్ధతి –

**స. అయం ద్విజః ఇతి వాక్యం**
**త్యక్త్వా ప్రత్యక్ పరోక్ష దేశాద్యమ్ ।**
**ద్విజమాత్ర లక్షకత్వాత్**
**కథయతి ఐక్యం పదార్థయోః ఉభయోః ॥**

అనే శ్లోకంలో ఆచార్య స్వామివారు ప్రదర్శించారు.

ఒక్కొక్క మహావాక్యానికీ విస్తారమైన అర్థం ఉండటం వల్ల ఈ అర్థాన్ని తవ్విన కొద్దీ కొత్త కొత్త అర్థాలు పుట్టుకు రావటం వల్ల ఎన్ని సందేహాలైనా తీర్చగలిగే సామర్థ్యం చిన్నవిగా కనబడే ఈ మహావాక్యాలకి ఉంటుంది.

దాదాపుగా **అహం బ్రహ్మాస్మి** అనే మహావాక్యానికీ **అయమాత్మాబ్రహ్మ** అనే మహావాక్యానికి ఇదే అర్థం చెప్పు కోవచ్చు. ప్రజ్ఞానం బ్రహ్మ అనే మహావాక్యం వ్యాపకమైన జ్ఞానమే లేదా చైతన్యమే ఆత్మస్వరూపం అని వాచ్యంగానే చెబుతూ ఉండటం ఇక్కడ గమనార్హం.

ఇక రెండవ అంశానికి వస్తే శ్రవణ, మనన, నిదిధ్యాస నాలు చేసినట్లైతే జ్ఞానం బలపడి భ్రమలు, సందేహాలు తొలగుతాయి.

గురుముఖతః మహావాక్యాలని విన్నంతనే కొంతమందికి ఆత్మసాక్షాత్కారం కలగవచ్చు. వీళ్లు మొదటికోవలోకి అలా కలగనివారు రెండవకోవలోకి చేరుతారు. వీళ్లు తత్త్వసాక్షాత్కారం



కలగాలి, అంటే శ్రవణం+మననం+ నిదిధ్యాసనం అనే మూడు సాధనాలను మళ్లీ మళ్లీ అభ్యాసం చేయాలి. ఇలా చేసినట్లయితే బుద్ధి సూక్ష్మవస్తువులని అర్థం చేసుకునేంత చురుకైంది అవుతుంది. అలా అయినప్పుడు ఆత్మతత్త్వం తెలిసివస్తుంది. అభ్యాసం వల్ల బాగా తెలిసి వస్తుంది. అప్పుడు ఆత్మతత్త్వజ్ఞానం కలుగుతుంది అని శ్లోకాల భావార్థం.



ఉపనిషద్వాక్యాలకి శుద్ధమైన చైతన్యాన్ని, పరబ్రహ్మని, ప్రతిపాదించటంలో తాత్పర్యం అంటే సామర్థ్యం ఉంది అని తెలుసుకోవటాన్నే శ్రవణం అంటారు.

ఈ రకంగా గురుముఖతః శ్రవణం చేసినట్లయితే ఉపనిషద్వాక్యాలు ఆత్మస్వరూపం గురించి చెప్పటం అనేది ఎంతవరకూ వీలౌతుంది అనే ప్రశ్నకి కూడా సమాధానం వస్తుంది. ఇలా అర్థనిర్ణయంతో చేసిన శ్రవణాన్ని అంటే వినటాన్నే శ్రవణం అని అంటారు. లోకంలో కూడా మాట విని అర్థం చేసుకుంటేనే విన్నట్టుగా అలా కాకపోతే ఫలతః విననట్లుగా వర్ణించటం మనకు అనుభవంలోని విషయమే కదా!

ఇలా అర్థనిర్ణయం కోసం శ్రవణం చేసినట్లయితే ఉపనిషద్వాక్యాలు అద్వితీయమైన, సత్యమైన, వ్యాపకమైన, చైతన్యరూపమైన ఆత్మతత్త్వాన్ని ప్రతిపాదిస్తున్నాయి అని తెలుస్తుంది. అలా తెలిసిన తర్వాత ఆత్మతత్త్వజ్ఞానం కలుగుతుంది. కానీ ఈ జ్ఞానం పరోక్షజ్ఞానం. అంటే కేవలం వినికిడి వల్ల వచ్చిన జ్ఞానం. దీనివల్ల అంతగా ఉపయోగం ఉండదు. అందువల్ల ఈ విషయాన్ని మననం చేయాలి. మననం అంటే శ్రవణంద్వారా తెలిసిన విషయాన్ని యుక్తులద్వారా అనుసంధానం చేసుకుంటూ ఉండటం. ఈ యుక్తులు ఉపనిషద్వాక్యాలకి అనుగుణంగా ఉండాలే తప్ప ప్రతికూలంగా ఉండరాదు. అలా ప్రతికూలంగా ఉంటే దీనివల్ల ఉపయోగం ఏమీ ఉండదు. ఈ అభిప్రాయంతోనే **"పండితః మేధావీ"** అనే రెండు పదాలని శ్రుతి ప్రయోగించింది. అంటే చెప్పినమాట అర్థం చేసుకోవాలి. అలా అర్థం చేసుకుని దానికి తగ్గట్టుగా ఆలోచించాలి అని.

ఇలా విచారించటానికే బ్రహ్మసూత్రాలను వేదవ్యాసుడు మనకు ఉపదేశం చేశారు. వీటిల్లో వేదాంతవాక్యాలకు తాత్పర్యాన్ని నిర్ణయించటమే కాకుండా యుక్తులని ప్రదర్శించటం వల్ల ఆ విషయాన్ని బలపరచుకోగల సామర్థ్యం మనసుకు వస్తుంది. ఈ విషయాన్ని భాష్యారంభంలో ఆచార్యులవారు సూచించారు. ఇలాంటి మననం ఇంతకుముందు శ్రవణంవల్ల జ్ఞానం (పరోక్ష జ్ఞానం) సాక్షాత్కారంగా మారటానికి సహకరిస్తుంది.

ఇలా సాక్షాత్కారం కలిగినా కూడా అది బలంగా లేకపోతే ఏమీ ఉపయోగం ఉండదు. ఎందుకంటే భ్రమలు రకరకాలుగా ఈ జన్మలోనూ, గత జన్మలలోనూ చాలా కలిగి ఉన్నాయి. వాటివల్ల కలిగిన సంస్కారాలతో బలపడి ఉన్నాయి. బలమైన ఈ భ్రమలను మరియు సందేహాలను పోగొట్టటానికి బలమైన జ్ఞానమే కావాలి. ఇలా బలమైన జ్ఞానం రావాలంటే నిదిధ్యాసనం లేదా ధ్యానం చేయాలి.

ఆత్మస్వరూపజ్ఞానధార అవిచ్ఛిన్నతైలధారలాగా ఉండాలి. ఇందులో ఆత్మస్వరూపం తప్ప మరేదీ విషయం అవ్వకూడదు. దీన్నే నిదిధ్యాసనం అని అంటారు. ఈ రకమైన ధ్యానం జ్ఞానానికి బలాన్ని ఇస్తుంది అనే విషయాన్ని యోగశాస్త్రంలో కూడా **"సః తు దీర్ఘకాల నైరంతర్య సత్కారాసేవితః దృఢభూమి"** అనే సూత్రంలో కూడా చెప్పారు.

ఆత్మసాక్షాత్కారానికి ఇలా శ్రవణ మనన నిదిధ్యాస నాలు అవసరం అవుతాయి అనే విషయాన్ని బృహదారణ్యకోప నిషత్తులో చతుర్థాధ్యాయంలో ప్రతిపాదించారు. ఇక్కడ ఆత్మ దర్శనానికి లేక ఆత్మతత్త్వసాక్షాత్కారానికి హేతువులుగా శ్రవణ–మనన–నిదిధ్యాసనాలని చెప్పటం మనం గమనించవచ్చు.

పాండిత్యం అంటే శ్రవణం. అది సిద్ధించిన తరువాత బాల్యం, అంటే జ్ఞానానికి బలాన్నిచ్చే మననాన్ని చేయాలి. ఆ తరువాత మౌనంగా నిది- ధ్యాసనం చేయాలి. ఇలా చేసినట్ల యితే ఆత్మసాక్షాత్కారం (బ్రహ్మసాక్షాత్కారం) కలుగుతుంది అని బృహదారణ్యకోపనిషత్ తృతీయాధ్యాయంలో కూడా ప్రతిపాదించారు. బ్రహ్మసాక్షాత్కారం కలిగినవాడు బ్రహ్మే అవుతాడు అని ముండకోపనిషత్తులో చెప్పారు.

కాబట్టి బ్రహ్మ (బ్రాహ్మణుడు) అని ఇలాంటి జ్ఞానిని అంటారు అని వాక్యార్థం. ఏతావతా శ్రవణ మనన నిదిధ్యాస నాలు అవసరం అని తేలింది. అయితే ఇవి ఎంతవరకూ చేయాలి? లేదా ఒక్కొక్కటి ఎంతవరకూ చేయాలి? అనేది చాలా ప్రధానమైన ప్రశ్న. దీనికి కూడా సమాధానం శ్రీశంకరాచార్యుల వారు –

**తావత్కాలం ప్రయత్నేన కర్తవ్యం శ్రవణం సదా।**
**ప్రమాణ సంశయః యావత్ స్వబుద్ధేః న నివర్తతే॥**

**ప్రమేయ సంశయః యావత్ తావత్ తు శ్రుతియుక్తిభిః।**
**ఆత్మయథార్థ్య నిశ్చిత్యై కర్తవ్యం మననం ముహుః॥**

**విపరీతాత్మ ధీః యావత్ న వినశ్యతి చేతసి।**
**తావత్ నిరంతరం ధ్యానం కర్తవ్యం మోక్షం ఇచ్ఛతా॥**

అనే శ్లోకాల్లో చెప్పారు.

ఉపనిషత్తులు అలాగే గురువాక్యాలు ఆత్మతత్త్వసాక్షాత్కారాన్ని కలగజేస్తాయా? లేదా? వాటికి తాత్పర్యం ఏంటి? అనే సందేహం పోయేంతవరకూ శ్రవణం చేయాలి. అలాగే ఈ ఉపనిషత్తులు ఆత్మతత్త్వాన్ని చెబుతున్నాయి సరే కానీ ఈ ఆత్మ తత్త్వం ఇలా ఉండటం కుదురుతుందా అనే సందేహం తొలగి పోయేంత వరకూ మననం చేయాలి. ఇలా మననం చేసుకునే ఆత్మతత్త్వాన్ని నిర్ణయించుకున్న తరువాత కూడా లోకంలో ఉండే విషయాల మీద మనస్సుపోయే ప్రమాదం ఉంది. ఆ ప్రమాదం తొలగిపోయేంత వరకూ అనాత్మవస్తువు మనస్సులోంచి ఎగిరి పోయేంతవరకూ నిదిధ్యాసనం చేయాలి. ఇలా ఫలితం కనిపించేంతవరకూ ఈ సాధనాలని మళ్లీ మళ్లీ సాధిస్తూ ఉండాలి.

క్లుప్తంగా చెప్పాలంటే బ్రహ్మసాక్షాత్కారం వచ్చేంత వరకూ ఈ శ్రవణాదులని అభ్యసిస్తూనే ఉండాలి.

అసలు ఏదైనా ఒక సాధనం ఉన్నప్పుడు ఆ ఉపాయాన్ని ఫలితం వచ్చేంతవరకూ చేయటమే పద్ధతి. ధాన్యానికి పైన ఉన్న ఊక పోయేంత వరకూ వడ్లు దంచుతూనే ఉండాలి కదా! అలాగే శ్రవణాదులు కూడా ఆత్మతత్త్వసాక్షాత్కారం కలిగేంతవరకూ మళ్లీ మళ్లీ చేస్తూనే ఉండాలి.

కాబట్టి ఆత్మతత్త్వజ్ఞానం కలిగేంత వరకూ ఈ సాధనాలను అనుసరించాల్సిందే! అప్పుడే వీటివల్ల ఫలితం కన్పిస్తుంది. ఈ విధంగా సద్గురువులను ఆశ్రయించి వారినుండి మార్గ నిర్దేశాన్ని పొందాలి అనుకునే వాళ్లు, వాళ్లకి శుశ్రూష చేసి వాళ్లని ప్రసన్నం చేసుకుని వాళ్లద్వారా శ్రవణ మనన నిదిధ్యాసనాలను సాధిస్తే దేహాది వ్యతిరిక్తమైన ఆత్మతత్త్వం యొక్క సాక్షాత్కారం కలుగుతుంది. అసలు ముందు సద్గురువుల ఉపదేశంతో ఆత్మస్వరూపం ఏంటో తెలుసుకుంటే ఆత్మతత్త్వ జ్ఞానానికి సాధనాలు ఏవో తెలుస్తాయి. సద్గురువులు కూడా వాటిని వివరిస్తారు. అందుకని గురువుల ముఖారవిందం నుండి ఆత్మస్వరూపం అంటే ఏంటో తెలుసుకోవాలి.

**16వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**



*గత సంచిక తరువాయి భాగం....*

విష్వక్సేనులజన్మనక్షత్రంరోజు ఉత్సవమూర్తి శ్రీవారు విష్వక్సేనులసన్నిధికి విజయం చేసేటప్పుడు తిరువిరుత్తం అను సంధేయం. శ్రీవేంకటాచలపతి పెద్ద అధ్యయనోత్సవం ముగింపు రోజున ప్రతిరోజు వలే విష్వక్సేనులతో, భగవద్రామానుజులతో, శ్రీమణిమండపంలో తిరువాయ్‌మొళి ఆలకించి, మొదట వేదాలకు సమాపనమంగళం జరిపి, తీర్థం, శ్రీశఠారి ప్రసాదాలు వినియోగమైన భగవద్రామానుజులవారు మూలవిరాట్టుకు మంగళాశాసనం చేయడంకోసం శ్రీమణిమండపం నుండి ప్రదక్షిణంగా విజయంచేసి, జియ్యరు, శ్రీవైష్ణవులు ప్రబంధ గాయకులు అందరూ కలసి స్తోత్రరాజానుసంధానం చేసి బయలుదేరి శ్రీకృష్ణమండపంలో మూలబేరం దగ్గర నిలిచి ఉంటారు. తర్వాత జియ్యరు మొదలైనవారు, భగవద్రా మానుజులు అనుసంధించేటట్లుగ తిరుప్పల్లాండులోని రెండు పాశురాలు, ఒళువిల్‌కాలమ్, ఉలగముండ, తాయేత్తన్దై, అఖిల భువనజన్మ (శ్లోకం), శరణాగతిగద్య పూర్వఖండం- వీటిని అనుసంధిస్తారు. అప్పుడు శ్రీవేంకటాచలపతి కూడా దివ్యమాల, పరివట్టం(శేషవస్త్రం), శ్రీశఠారి, ప్రసాదం ధరించి విడచిన పీత వస్త్రం, దివ్యచరణాలు మొదలైన బహుమానాలను అనుగ్రహిస్తాడు. అప్పుడు మళ్లీ భగవద్రామానుజులు అనుసంధించు నట్లుగ అగలకిల్లేన్, ఒళువిల్ కాలమ్, తాయేత్తన్దై అను మూడు పాశురాలను, అఖిలభువనజన్మ అనే శ్లోకాన్ని మనోవాక్కాయైః అనే చూర్ణికను అందరు కలసి అనుసంధిస్తారు. తర్వాత సన్నిధి పరిజనులు-

"శ్రీ రంగరాజ చరణాంబుజరాజహంసః
శ్రీవేంకటేశ కరుణాకలశార్ణవేందుః
శ్రీదేవరాజ జయడిండిమ వాఙ్మయశ్రీః
రామానుజో విజయతే యతిరాజరాజః."

"జయతి సకలవిద్యావాహినీజన్మశైలః"

"సర్వదేశదశాకాలే ష్వవ్యాహతపరాక్రమా,
రామానుజార్యదివ్యాజ్ఞా వర్ధతా మభివర్ధతామ్."

అనే శ్లోకాలను అనుసంధింపగ మన రామానుజాచార్య భగవంతునిచే అనుగ్రహింపబడుదురు గాక! అని వీడ్కోలు ఈయగ భగవద్రామానుజులు కృతార్థులై మళ్లీ ప్రదక్షిణ



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

క్రమంలో బయటకు వస్తారు. తర్వాత, భగవద్రామానుజ సంబంధులైన అధ్యాపకులు యతిరాజవింశతి మొదలైన వాటిని అనుసంధించగా, సమస్త నృత్తగీతవాద్యాలతో తమ సన్నిధికి విజయం చేసి నీరాజనం పొంది ఆత్మీయులకు తీర్థప్రసాదాలు 'ఆనందాళ్వాన్' (శఠారివంటిది) మొదలైన వాటిని ప్రసాదించి ఆశీర్వదిస్తారు. ఈవిధంగా పన్నెండవరోజు కూడా నూత్తందాది అనుసంధానమైన తరువాత భగవద్రామానుజుల మంగళాశాసనం క్రమప్రాప్తం. ఇది అప్పటి పెద్దల నియమం. ఇలా భగవద్రామానుజాచార్యుల ఇతర సన్నిధులకంటే భిన్నరూపమైన మంగళాశాసనమే తిరుమలలో మూలవిరాట్టుకే ప్రాధాన్యమన డానికి కారణంగా చెప్పుకోవచ్చు. *(ఇంకా ఉంది)*

మన మహర్షులు

# ఒక్క వ్యాసమహర్షికే సాధ్యం!

- శ్రీమతి పి.విజయలక్ష్మి

**వ్యాసుడు ఒక వ్యక్తిగాదు. అనేక గురువుల జ్ఞానవిజ్ఞాన సంప్రదూపుడు. వ్యాసునిచరిత్ర భారతచరిత్ర.** భారతీయులసుదీర్ఘ చరిత్రలో, మానవునిజీవితాదర్శాలకు భాష్యం చెప్పిన మహా మహులెందరో ఉన్నారు. మానవునిపరిపూర్ణతకు పరిభాషనిచ్చిన మాన్యులెందరో ఉన్నారు. అట్టి వారిలో పరాశరపుత్రుడైన బాద రాయణవ్యాసుడు ప్రధానుడు. ఒకవిధంగా ప్రథముడు కూడా! ఈయన భారతజాతికి సమకూర్చిపెట్టిన సాంస్కృతిక సాహితీ ఆధ్యాత్మికసంపద అపురూపమైంది. అద్వితీయమైంది. తరతరా లకూ చెక్కుచెదరంది.

వ్యాసుని అసలు పేరు **"అపాంతరతముడు".** వ్యాసుడు అనేది ఇతనికి నారాయణుడిచ్చినబిరుదు. అన్నిమన్వంతరాలలో, భగవంతుని ఆదేశానుసారం ఇతడు జన్మిస్తూ, వేదవిజ్ఞానాన్ని పరిరక్షించేభారం వహిస్తుంటాడు. ప్రస్తుతవ్యాసమహర్షి వశిష్ఠునికి మనుమడైన పరాశరునికి జన్మించాడు (వశిష్ఠునిపెద్దకొడుకు శక్తి. శక్తిభార్య అదృశ్యంతి. వీరి కుమారుడు పరాశరుడు. పరాశరునికి సత్యవతియందు జన్మించినవాడు వ్యాసుడు). ఇతడు సరస్వతీనదీతీరంలో, బదరికారణ్యంలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకొని, అపూర్వసాధనచేసినమహర్షి. ఈయనకు జన సామాన్యంలో ద్వైపాయనుడు, కృష్ణద్వైపాయనుడు, బాదరాయ ణుడు, పారాశర్యుడు, సాత్యవతేయుడు- అనే పేర్లున్నాయి.

వ్యాసుడు కాళిందీనదీపరిసరాల్లో సత్యవతికి పుత్రుడుగా జన్మించాడుగదా! యుక్తవయస్సునుండి ఆయన గోమతి, గంగా, యమునా, సరస్వతీనదీపరిసరాల్లో ఉండే మహర్షులకు శుశ్రూషలు చేశాడు. మహాతపస్సు చేశాడు. ముఖ్యంగా మహర్షి మయునివద్ద వేదశాస్త్రవిద్యల్ని అభ్యసించి, ఉద్దండ పండితు డయ్యాడు. అనేకపుణ్యక్షేత్రాలు దర్శించాడు. అపారమైన పార మార్థికజ్ఞానాన్ని సాధించాడు. ఆ తర్వాత నైమిశారణ్యంలో ఆశ్రమజీవితం గడపుతూ, స్థిరచిత్తుడై, సమగ్రజీవనతత్త్వ ప్రబోధకమైన మహాభారతగ్రంథాన్ని రచించాడు.

ఈయనపరిశోధనవల్లనే భారతీయులవేదం, ఋక్, యజుస్, సామ, అథర్వాలని నాల్గురూపాలుగా వెలుగొందింది. ఆ వేదాలను తనశిష్యులద్వారా లోకంలో వ్యాప్తికి తెచ్చాడు. **ఆ మహాకార్యంకూడా వ్యాసుని జన్మదినమైన ఆషాఢపూర్ణిమనాడే ప్రారంభమైంది. కనుకే దాన్ని 'గురుపూర్ణిమ'గా స్మరిస్తున్నాం.** పైలుడు, వైశంపాయనుడు, జైమిని, సుమంతుడు అనే తన శిష్యులద్వారా వరుసగా నాల్గువేదాలనూ లోకంలో ప్రచారం చేయించాడు. వ్యాసునికి మరొకశిష్యుడు సూతుడున్నాడు. ఇతడు వ్యాసుడు చెప్పిన పురాణేతిహాసాలనూ, సంహితలనూ నేర్చి, ప్రచారం చేసి, సూతపౌరాణికుడుగా పేరొందాడు. ఇలా **వేద విభాగం చేసి, ప్రచారం చేసినందున ఇతడు "వేదవ్యాసుడు" అయ్యాడు.**

వేదసంకలనమేకాక సుమారు 555 వాక్యాలు గల బ్రహ్మసూత్రాలు, 4 లక్షల శ్లోకాలుగల 18 మహాపురాణాలు, ఒక లక్షశ్లోకాలుగల 18 ఉపపురాణాలు, 18 పర్వాలతో లక్షా ఇరువదియైదువేల శ్లోకాలు గల మహాభారతం, ఇంకా ఎన్నో స్తోత్రాలూ మొదలగునవన్నీ వ్యాసరచనలే! ఎంత తక్కువగా అంచనా వేసినా మొత్తం **సుమారు $7^1/_2$ లక్షల శ్లోకాల వరకు వ్యాసునిప్రజ్ఞకు ప్రమాణంగా లోకంలో వెలుగొందుతున్నాయి. ఇంతరచన ఏయుగంలో- ఏ వ్యక్తీ నిర్వహించలేదు. ఇది ఒక్క వ్యాసమహర్షికే చెల్లింది.**

వ్యాసుడు భారతీయులకు ఆది గురువు. వేద విజ్ఞానసాహిత్యసర్వస్వాన్ని ఆమూలాగ్రంగా పరిశోధించి, అవగాహనచేసుకొన్నాడు, గనుక ఆత్మవిశ్వాసంతో దాన్ని బహు విధాలుగా ప్రసారితంచేయడానికి సంకల్పించాడు. అందుకు పవిత్రమైన ప్రణాళికను రూపొందించుకొన్నాడు. వేలకొలది వేదఋక్కులను సమీకరించి, సంస్కరించి, సంపాదితం చేసిన పిమ్మట, ఆ మహర్షి వేదాలలో నిక్షిప్తమై ఉండే విజ్ఞానాన్ని **"వేదాంతదర్శనం"** ద్వారా (ఉపనిషత్తుల ద్వారా) లోకానికి అందించాడు.

**జూలై 3 న గురుపూర్ణిమ సందర్భంగా...**

అసలు వ్యాసుడు భారత భాగవతాలద్వారా నివృత్తి ప్రధానమైన ప్రవృత్తినీ, కర్మప్రధానమైన జ్ఞానాన్నీ, త్యాగనిరతి గలభోగాన్ని, దేహాన్ని వదలని ఆత్మనూ ప్రబోధించేందుకే శ్రీకృష్ణునిపాత్రను సృజించినట్లు తెలుస్తోంది. వాసుదేవుడు వ్యాసదేవునిఆలోచనలకు, ఆదర్శాలకు ప్రతినిధి కదా! కనుకనే **"వ్యాసాయ విష్ణురూపాయ, వ్యాసరూపాయ విష్ణవే"** అన్నారు. **ఇరువురూ ఒక్కరే!**

భారతంలో ధర్మార్థకామమోక్షాల్ని సముచితస్థాయిలో మేళవించి, సమగ్రజీవనదర్శనాన్ని రూపొందించాడు. ఆ దర్శనంలో ఈనాటికీ మానవజాతి ఆచరించగల జీవన ఆదర్శాలు ఎన్నో రూపుదిద్దుకొని, రాణిస్తున్నాయి. కనుకనే వ్యాస మహర్షి ప్రపంచమానవజాతులమధ్య భారతజాతికి ఒక గొప్ప గురుస్థానాన్ని సంపాదించిపెట్టాడు. తానూ గురుస్థానంలో పూజలందుకొంటున్నాడు - నేటికీ! వ్యాసునిది యోగదృష్టి.



వ్యాసునంతటిసాహిత్యాన్ని సృష్టించిన 'వ్యక్తి న భూతో న భవిష్యతి'.

వ్యాసుని గీతాసందేశం మానవజీవితాన్ని కాచి, చల్లార్చి, వడబోసిన శీతలపానీయం అని చెప్పవచ్చు. మన మనస్సుల్ని ఆవరించి ఉండే చీకట్లను పోగొట్టే విద్యుద్దీపం గీత. దేశకాల జాతివర్ణమతమర్యాదలకు అతీతమైన, విశ్వజనీన మానవధర్మాన్ని వైజ్ఞానికదృక్పథంతో ప్రవచింపజేసే నిర్మల ప్రయత్నమే గీతారచన! **గీతకు ఏ మతంతోనూ విరోధం లేదు. అది మానవజాతికి శ్రీకృష్ణునిద్వారా అందించిన దివ్యసందేశం.**

**"నీకు కష్టమైంది, దుఃఖకరమైంది- ఇతరులకు చేయ వద్దు"** (ఆత్మనః ప్రతికూలాని, పరేషాం న సమాచరేత్) - **ఇదే వ్యాసుని ధర్మసర్వస్వం!**

**వ్యాసునిసిద్ధాంతంలో అన్నిటికీ మూలం ధర్మం. ఇదే అర్థకామమోక్షాలకు ఆధారం. ధర్మం వ్యక్తికి మోక్షాన్ని సమ కూర్చడానికి ముందు, ఐహికజీవితాన్ని వ్యవస్థితం చేయడంలో అధికంగా రాణిస్తుందని వ్యాసునిఅభిమతం! ఆత్మసాక్షాత్కారానికి గానీ, ఆత్మశుద్ధికి గానీ ధర్మాచరణ అవసరం. ధర్మానికి నిజంగా దగ్గరి చుట్టం దైవంకాదు. దైవత్వం గల మనిషి. ధార్మికవ్యవస్థకు శక్తి నిచ్చేది మానవుని పరలోక విశ్వాసం కాదు- లౌకిక జీవితంలో ఋజువర్తన.** ఇట్టి సామాజికస్పృహ గల్గి, కర్తవ్య నిష్ఠతో జీవించడమే ధర్మానికి అలంకారం. **ఉత్తమమానవ జీవితమే ధర్మం. ఇదే సామాజిక ఆదర్శం. మంచితనం అనేది ఏ ఒక్కని సొత్తూ కాకుండా- అది సంఘసంస్కారంగా రూపు దిద్దుకోవాలి- ఇది వ్యాసుని సిద్ధాంతం.**

ఇలా వ్యాసమహర్షి మానవజీవితాన్ని సన్మార్గంలో నడిపించడం కోసం తనసర్వశక్తుల్నీ ధారపోసిన మహాత్యాగి. ఉత్తమప్రబోధం చేసినగురువర్యుడు. నిస్స్వార్థ సంఘసేవా శీలి. మహాకవి. గొప్పతాత్త్వికుడు. ఋషీశ్వరుడు.

**"వ్యాసో నారాయణో హరిః"** కనుకనే ఆషాఢపూర్ణిమను గురుపూర్ణిమగా నిర్ణయించి, వ్యాసజయంతిని భక్తిశ్రద్ధల్తో నిర్వహించి, ఆయన మనకు చేసిన సేవలకు కృతజ్ఞతగా అతని మాహాత్మ్యాన్ని ఒక్కమారు ఈ పూర్ణిమనాడైనా మననం చేసుకొని- ధన్యులం, కృతార్థులం కావాలి.

# ఈశ్వరుడైనా తప్పించుకోలేడు..!!

- శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి

కర్మసిద్ధాంతం ప్రకారం మనిషి చేసే కర్మలకు ప్రతిఫలం అనుభవించి తీరాలి. మంచికర్మలకు మంచి ప్రతిఫలం, చెడుకర్మలకు చెడు ప్రతిఫలం అందించే బాధ్యత శనీశ్వరుడిది. అందుకే ఆయనను కర్మఫలదాత అంటారు. ఒడిదుడుకులు ఎదురైనప్పుడే జీవితం విలువ గురించి తెలుస్తుంది. మనిషికి అప్పుడప్పుడూ మొట్టికాయలు వేస్తూ లోపాలను సరిదిద్దేది శనిదేవుడు. ప్రాణాలతో ఉన్నప్పుడే వారి పాపాలకు తగిన ప్రాయశ్చిత్తాన్ని కలిగిస్తాడు. సూర్యభగవానుడు, ఛాయాదేవి సంతానమే శనిదేవుడు. నవగ్రహాల్లో కీలకమైన శని జాతక చక్రంలోని ఒక్కో రాశిలో దాదాపు రెండున్నర ఏళ్లు సంచరిస్తాడు. అంటే రాశిచక్రంలో ఒకసారి ప్రయాణానికి దాదాపు 30 ఏళ్లు పడుతుంది. నిదానంగా సంచరిస్తాడు కాబట్టి శనికి మందగమనుడు అనే పేరు ఏర్పడింది. అయితే, రాశిచక్రంలో ఆయన ఉండేస్థానాన్ని బట్టి ఫలితాలు కూడా ఉంటాయి. జాతకరీత్యా శనిప్రభావం అధికంగా ఉన్నప్పుడు తమకు తక్కువ శ్రమ కలిగించాలని శనీశ్వరుని వేడుకుంటారు. అందుకోసం నవగ్రహాలు ఉండే ఆలయాన్ని దర్శిస్తారు. ఇక త్రయోదశితిథి వచ్చే శనివారం నాడు ఆయనను పూజిస్తే మరింత త్వరగా ఉపశమనం కలిగిస్తాడని నమ్మకం.

త్రయోదశి శనివారం కలిసివచ్చిన రోజును శనిత్రయోదశి అంటారు. ఇది ఎంతో పర్వదినం. శని ఆరాధన చేసే భక్తులకు ఇదొక మహత్తరమైన అవకాశం. శనీశ్వరుడి జన్మతిథి త్రయోదశి. శనివారం శని భగవానునికీ, అటు విష్ణుమూర్తికీ ప్రీతికరమైన రోజు కాగా, త్రయోదశి శివునికి ఇష్టమైన తిథి.

జాతకరీత్యా శనీశ్వరుని ప్రభావం వల్ల కష్టాలుపడుతున్న వారు సూర్యోదయానికి పూర్వమే శనీశ్వరునికీ నువ్వుల నూనెతోను, నువ్వులతోను అభిషేకం చేసి, నీలిరంగుపూలతో భక్తి పూర్వకంగా అర్చించాలి. నివేదనగా బెల్లం సమర్పించాలి. నల్లని లేదా నీలం వస్త్రాన్ని సమర్పించాలి. నల్లనువ్వులను దానమివ్వడం వల్ల కూడా శని ప్రసన్నుడై తన ప్రభావాన్ని తగ్గిస్తాడు.

## ఎన్నోగాథలు....

ఒకసారి కైలాసానికి వెళ్లిన నారదమహర్షి శనీశ్వరుణ్ణి పొగడటం మొదలుపెట్టాడు. ఎంతటివారైనా శనిప్రభావం నుంచి తప్పించుకోలేరన్నాడు. ఈ మాటలకు ఆగ్రహించిన శివుడు... "శని ప్రభావం ఎవరి మీద ఉన్నా లేకున్నా, నా మీద మాత్రం పనిచేయదు" అని అన్నాడు. ఇదే మాటను నారదుడు యథాతథంగా శనిదేవుని వద్దకు మోసుకు వెళ్లాడు. "నా ప్రభావం నుంచి తప్పించుకోవడం ఎవరి తరమూ కాదు. ఇది సృష్టి



శ్లో॥ నీలాంజన సమాభాసం రవిపుత్రం యమాగ్రజం
ఛాయామార్తాండ సంభూతం తన్నమామి శనైశ్చరం.

ధర్మం," అని చెప్పిన శని.. పరమేశ్వరుణ్ణి ఫలానా సమయంలో పట్టిపీడించి తీరుతా" నని అన్నాడు. శని శపథం గురించి విన్న శివుడికి ఏం చేయాలో అర్థంకాక, శని చెప్పిన సమయానికి అతని కంటపడకుండా ఉండేందుకు భూలోకంలో ఒక చెట్టు తొర్రలో దాక్కొన్నాడు.

మర్నాడు కైలాసానికి వచ్చిన శని దేవుణ్ణి చూచి శివుడు "నన్ను పట్టి పీడిస్తా నన్న నీ శపథం ఏమైంది" అంటూ పరిహసించాడు. దీనికి శని "ప్రభూ! ఈ ముల్లోకాలకూ లయ కారుడవైన నువ్వు ఆ చెట్టుతొర్రలో దాక్కొన్నావే! అది నా ప్రభావం కాదా. దీన్ని శని పట్టడం అనరా?" అన్నాడు. శని దేవుని శక్తిని గ్రహించిన పరమేశ్వరుడు.. "ఈ రోజునుంచి శనిత్రయోదశినాడు ఎవరైతే నిన్ను పూజిస్తారో వారికి నీ అనుగ్రహంతో పాటు నా అభయం కూడా దక్కుతుంది. ఇక నుంచి నువ్వు శనీశ్వరుడు అన్న పేరుతో కూడా పేరు గాంచు తావు" అని ఆశీర్వదించాడు. అప్పటినుంచి త్రయోదశి తిథి వచ్చే శనివారం నువ్వుల నూనెతో శనీశ్వరుని అభిషేకించి, తమని చూచీచూడనట్లుగా సాగిపొమ్మని భక్తులు వేడుకుంటున్నారు.

మరో సందర్భంలో శని, ఆంజనేయ స్వామిని బాధించాలని ప్రయత్నం చేస్తాడు. కానీ, ఆంజనేయుడు శనిని తన తోకకు కట్టి అనేకవిధాలుగా బాధిస్తాడు. శరీర మంతా శిథిలమై పోయే పరిస్థితి శనికి ఏర్పడుతుంది. రక్తం ధారలుగా ప్రవహిస్తుంటుంది. ఎంత ప్రయత్నించినా, హనుమ పట్టు నుంచి విడిపించుకోవటం శనికి సాధ్యపడదు. చివరకు, శని హనుమంతుణ్ణి శరణు కోరాడు. తన అపరాధాన్ని మన్నించమని ప్రాధేయపడ్డాడు. తన భక్తులను బాధించటం మానుకుంటానని మాట ఇస్తేనే విడిచి పెడతానని మారుతి అంటాడు. సరేనంటూ అంగీకరిస్తాడు శని. అప్పటి నుంచి హనుమద్భక్తులకు శనిబాధ లేకుండా పోయింది.

| | |
|---|---|
| **వాహనం** | **: కాకి** |
| **అధిదేవత** | **: యముడు** |
| **ప్రత్యధిదేవత** | **: ప్రజాపతి** |
| **వర్ణం** | **: నలుపు** |
| **ధాన్యం** | **: నల్లనువ్వులు** |
| **పుష్పం** | **: నల్లని తామర** |
| **వస్త్రం** | **: నల్లని వస్త్రం** |
| **జాతిరత్నం** | **: నీలం** |
| **నైవేద్యం** | **: నల్లని నువ్వులు కలిపిన అన్నం** |

# శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొఱ

**చతుర్ముఖబ్రహ్మ మానసపుత్రుడు విఖనసుడు. ఈ మహర్షి వైఖానస కల్పసూత్రం మొదలైన శాస్త్రగ్రంథాలను రచించాడు. ఇతడు రచించిన సూత్రాలననుసరించి జాతకర్మ సంస్కారాలను పొంది గర్భవైష్ణవులుగా ఉన్న వారు వైఖానసులు. ఈ విఖనసమహర్షి దేవాలయాలలో అర్చామూర్తులను పూజించే విధానాన్ని, ఉత్సవాలను నిర్వహించే రీతులను, దేవాలయనిర్మాణ శాస్త్రాన్ని, ప్రతిష్ఠావిధానాన్ని తన సూత్రాలలో వివరించాడు. వీరు చెప్పిన సూత్రాల ననుసరించి దేవాలయ అర్చామూర్తులకు చేసే పూజ, ఉత్సవ విధానానికి వైఖానసాగమ పూజ అని పేరు. తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామికి పూజలు, ఉత్సవాలు వైఖానసాగమం ప్రకారం జరుగుతున్నాయి. వైఖానస ఆగమానికే భగవచ్ఛాస్త్రమని నామాంతరం.**

**శ్రావణమాసంలో పూర్ణిమరోజున శ్రీవిఖనసాచార్య స్వామివార్ల జయంతి జరుపుచుండగా తిరుపతిలో ఒక మాసం ముందుగ శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొఱ అనగా ఆషాఢమాసంలో శ్రవణనక్షత్రానికి మొఱగా నిర్ణయించి ఆరోజుతో కూడిన 10 రోజులు ముందుగా ఉత్సవాన్ని జరుపుతున్నారు.**




***(ఈ నెల 05వ తేది తిరుపతి శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొఱ)***

భగవద్గీత

# మనిషి మనీషిగా ఎదగాలంటే..

– సారస్వత కళానిధి డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, 93941 13848

ఎందరో మహాత్ములు తమతమ మతానుసారంగా భగవద్గీతను వ్యాఖ్యానించారు. ఆధునిక పండితులు చాలామంది దీన్ని అనేకభాషల్లోకి అనువదించారు. ఇంత బహుళప్రచారాన్ని పొందిన బ్రహ్మవిద్యాప్రబోధకమైన గ్రంథం ప్రపంచంలో మరొకటి లేదని చెప్పవచ్చు. మానవుడి సుఖజీవనానికి అవసరమైన సూచనలెన్నో దీనిలో చేయబడ్డాయి. వీటిని సావధానంగా పరిశీలించి నిత్యజీవితంలో ఆచరిస్తే మానవులు ఆయురారోగ్య బలాది సంపన్నులై తాము ప్రశాంతంగా జీవించటమేకాక సాటి మానవులకు సహితం సేవాసహకారాలను అందిస్తూ తమ జీవితాల్ని సార్థకం చేసుకోగలుగుతారు.

ప్రస్తుత పరిస్థితులలో మానవులకు శారీరక, మానసిక వ్యాధినివారణలో యోగప్రాధాన్యం గుర్తింపబడింది. నిరంతరం ఆత్మపరిశీలనతో మనోనిగ్రహాన్ని, ఆహార, విహారాదుల నియమాన్ని పాటించినట్లైతే అదే యోగం. ఈ అంశాన్నే భగవద్గీత ఈ విధంగా పేర్కొన్నది.

**నాత్యశ్న తస్తు యోగోఽస్తి నచై కాంత మనశ్నతః**
**న చాతి స్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున॥ (గీత.6-16)**

ఆహారం ఎక్కువగా భుజించేవారికి, అవసరమైన ఆహారాన్ని స్వీకరించనివారికి, ఎక్కువ నిద్రకలిగినవారికి, అతిమాత్రమైన మెలకువ కలిగినవారికి యోగం కలుగదు. ఈ ఆహారనియమాలు ఆధునిక వైద్యశాస్త్రంలో ప్రాధాన్యాన్ని సంతరించుకొన్నాయి.

**యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు।**
**యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా॥ (గీత.6-17)**

నియత పరిమాణం కలిగిన ఆహారవిహారాదులతో, నియతకర్మప్రవృత్తితో వర్తించేవారికి యోగఫలితం సంభవిస్తుంది.

ఈ విధంగా గీత నిత్యదైనందిన వ్యవహారశైలిని బోధించే పారాయణశాస్త్రం కూడ. కనుక ఇది వృద్ధులకు, అలసులకు, ఉద్దేశింపబడ్డ గ్రంథం కాదు. శ్రేయస్కాములైన ప్రజలంతా నిత్యపారాయణం చేసి తమ జీవనశైలిని సంస్కార పూరితమైన, క్రమశిక్షణాయుతమైన, ఆదర్శవంతమైన జీవన శైలిగా మలచుకోవటానికి ఇది ఉపకరించే వైశిష్ట్యం కలిగింది.

గీతాశాస్త్రం ఒక కల్పవృక్షం. దాన్ని నాటినవాడు శ్రీకృష్ణ భగవానుడు. దాన్ని బాగా పెంచినవాడు వేదవ్యాసమహర్షి. ఉపనిషత్తులే దాని బీజం. పరమార్థజ్ఞానమే ఆ బీజం నుండి పుట్టిన మొదటి మొలక. సర్వశాస్త్రరహస్యాలు ఆ కల్పవృక్ష శాఖలు. ఆ కల్పవృక్షం క్షమా, వైరాగ్యాలనే చిగురుటాకులచేత ప్రకాశిస్తుంది. శ్రీకృష్ణపరమాత్మ పాదారవిందాలపై భక్తి అనే పుష్పసౌరభాన్ని అది వెదజల్లుతుంది.



ఉపనిషత్తులలో చైతన్య పూరిత దృక్పథం కన్పిస్తుంది. జీవితాన్ని ఒక సాహసయాత్రగా ఇవి పరిగణిస్తాయి.

మనుష్యుడు రథికుడు. దేహం రథం. ఇంద్రియాలు అశ్వాలు. మనస్సు పగ్గం. బుద్ధిసారథి. అలాంటి రథాన్ని నడిపి గమ్యం చేర్చాలి. జీవితం ఒక సృజనశీలమైన యాత్ర. సుదీర్ఘమైన, ప్రయాసలతో కూడిన ప్రయాణం జయప్రదం కావాలంటే మంచిశిక్షణ అవసరం. దృఢవిశ్వాసం, స్పష్టమైన లక్ష్యం, ప్రశాంతచిత్తం కలిగి ఉండాలి. ఆ ఉత్తమలక్షణాలను బోధించిన మార్గదర్శక గ్రంథం భగవద్గీత.




### వేదిక్ మాథమెటిక్స్ విశేషాలతో కొన్ని....

- మౌఖికంగా వేగంగాను గణన చేసి ఒకే వాక్యంలో సమాధానం.
- ప్రస్తుత గణనపద్ధతుల కన్నా వేగం, సులభం.
- పద్ధతిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ.
- మానవమెదడు సంపూర్ణ, సమగ్రవికాసం.
- పోటీపరీక్షలకు భయపడకుండా సిద్ధం.
- పాఠశాల, కళాశాల పాఠ్యప్రణాళికలలోని అనేకగణిత భావాలకు అనువర్తనం.
- స్థానవిలువలు, నిజవిలువలకు సంబంధించి వాస్తవ అవగాహన.
- మ్యాథమెటిక్స్ వితవుట్ టియర్స్
- ఇందులోని 'ఎడమనుండి కుడికి గణనపద్ధతి' కంప్యూటర్ సాధనలు

సరియైనదో కాదో పరీక్షించుటకు ఉపయోగపడుతుంది. (ఆంధ్రూనికలస్) వేదిక్ మాథమెటిక్స్ రీసెర్చ్ గ్రూప్ (ఇంగ్లండ్), బిజినెస్ స్కూల్ ఆఫ్ ది పాలిటెక్నిక్ (నార్త్ లండన్), ఆస్ట్రేలియా స్కూల్ ఆఫ్ ఫిలాసఫీ; యు.ఎస్., యు.కె., హాలెండ్ లోని కొన్ని పాఠశాలలు 1988 సంవత్సర ప్రారంభానికే వేదిక మాథమెటిక్స్ బోధన, పరిశోధనలు చేస్తున్నారు. మనదేశంలో చాలా ఆలస్యంగా మొదలుపెట్టారు. దేశవ్యాప్తంగా పాఠశాలలు నిర్వహిస్తున్న 'విద్యాభారతి' కృషి గుర్తించదగింది. భారత ప్రభుత్వం ఈ అంశపు ప్రాముఖ్యత గుర్తించి సముచిత ప్రోత్సాహం ఇవ్వడం ఒక శుభపరిమాణం. వేదిక్ మాథమెటిక్స్ ప్రయోజనాలను గుర్తించి ప్రస్తుతం చాలామంది నేర్చుకునేందుకు, నేర్పేందుకు సిద్ధంగా ఉన్నారు. వేదగణితంది బహుముఖ ప్రయోజనం.

**ఉదాహరణ:** **97 × 94**

**ప్రస్తుత పద్ధతి**

```
      97
    × 94
----------------
    388.....(97×4)
   873.......(97×9)
----------------
   9118
----------------
```

**వేదిక్ మాథ్స్ పద్ధతి**
**ఆధారం 100**

$97 \to \overline{3}$, $94 \to \overline{6}$

| | |
|---|---|
| (97−6) లేదా (97−3) | $\overline{3}\times\overline{6}$ |
| 91 | 18 |

**ఉదాహరణ:** **114 × 106**

```
      114
    × 106
----------------
      684
     114
----------------
    12084
----------------
```

$114 \to \overline{14}$, $106 \to 0\overline{6}$

| | |
|---|---|
| (114+06) లేదా (106+14) | $1\overline{4}\times\overline{0}6$ |
| 120 | 84 |

ప్రస్తుతపద్ధతిలో మొదటిలెక్కలో 388 క్రింద 873 వేయడంలో ఒకస్థానం ఎందుకు ముందుకు జరపాలి? రెండవ లెక్కలో 684 క్రింద 114 వేయడంలో రెండుస్థానాలు ఎందుకు ముందుకు జరపాలి? అనే ప్రశ్నలకు బాధ్యత తీసుకుని జవాబులు చెప్పడంకంటే 'అలాగే చేయాలి' అని ఏవో గుర్తులతో అలా చేయడం అలవాటు చేయడమే ఎక్కువగా జరుగుతుంది. గుణకారం ఎన్ని స్థానాలున్న సంఖ్యల మధ్య జరుగుతుందో దాన్ని బట్టి సోపానాల సంఖ్య, పట్టే సమయం మొదలైనవి పెరుగుతాయి. వేదిక్‌మాథ్స్ పద్ధతిలో ఇచ్చిన సంఖ్యలు, స్వభావం, తీసుకునే ఆధారం, స్థానవిలువలు భూమికగా వేగంగాను, మౌఖికంగా ఒకే సోపానంగా, ఒకే సమయంతో జవాబు చెప్పవచ్చు. వేదగణితం గణనను ఆనందం కల్గించే ఒక ఆటగా మార్చగలదు.

**108 దివ్యదేశాలు**

# తిరుక్కణ్ణమంగై

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్

జీవులందరూ క్షేమంగా ఉండాలనే సత్సంకల్పంతో శ్రీమన్నారాయణుడు శ్రీమహాలక్ష్మితో, ముక్కోటి దేవతలతో, మహర్షులతో వెలసిన దివ్యదేశం 'తిరుక్కణ్ణమంగై'.

కుంభకోణానికి సమీపంలో ఈ దివ్యదేశం ఉంది. తిరుచ్చేఱై నుండి 24 కి.మీ., కుంభకోణం-తిరువారూరు మార్గంలో 10కి.మీ.దూరంలో కావేరినదికి దక్షిణదిశలో వదెకరాల విస్తీర్ణమైన భూభాగంలో, 3 ప్రాకారాలతో, 5 అంతస్థుల రాజగోపురంతో, ఈ దివ్యదేశం అలరారుతోంది. ఈ క్షేత్రాన్ని కృష్ణారణ్యమని, కృష్ణమంగళ క్షేత్రమని, సప్తామృత క్షేత్రమని, లక్ష్మీవనమని కూడా పిలుస్తారు.

| | | |
|---|---|---|
| మూలమూర్తి | - | భక్తవత్సల పెరుమాళ్ |
| అమ్మవారు | - | అభిషేకవల్లి, తిరుక్కణ్ణమంగైనాయకి |
| తీర్థం | - | దర్శనపుష్కరిణి, కావేరి |
| విమానం | - | ఉత్పల విమానం |
| స్థలవృక్షం | - | మహీచెట్టు, |
| ప్రత్యక్షం | - | వరుణుడు ప్రచేతన, రోమశమహర్షులకు |
| ముఖం / స్థితి | - | తూర్పు/ నిలుచున్న సేవ |
| మంగళాశాసనం | - | తిరుమంగై ఆళ్వార్లు |
| ఆగమం | - | వైఖానసం |
| ఇతర సన్నిధులు | - | లక్ష్మీనరసింహుడు, వామనుడు, భూవరాహస్వామి, ఆండాళ్, హయగ్రీవుడు తదితరులకు ప్రత్యేక సన్నిధులున్నాయి. |
| ప్రత్యేకతలు | - | అవివాహితులు ఈ దివ్యదేశాన్ని సందర్శిస్తే వారికి వెంటనే వివాహం జరుగుతుందని భక్తుల విశ్వాసం. |



## పురాణగాథ

బ్రహ్మ తాను పోగొట్టుకున్న వేదాలను తిరిగి పొందడానికి ఈ దివ్యదేశానికి వచ్చాడు. ఇక్కడి దర్శనపుష్కరిణిలో స్నానం చేసి, తపస్సు చేశాడు. శ్రీమహావిష్ణువు దయతో బ్రహ్మకు ఆ వేదాలు తిరిగి అనుగ్రహించాడు. బ్రహ్మదేవుడు, శ్రీమహావిష్ణువును ఈ క్షేత్రంలోనే ఉండిపొమ్మని ప్రార్థించాడు. ఆయన కోరికమేరకు స్వామి ఈ దివ్యదేశంలోనే వెలిసి భక్తులను అనుగ్రహిస్తున్నారు. నాలుగువేదాలు, నాలుగు స్తంభాలవలె ఉన్న అద్భుతమండపాన్ని ఈ దివ్యదేశంలో మనం చూడవచ్చు. ఈ మండపంలోనే దేవదేవునికి, అభిషేకవల్లి తాయారుకు బ్రహ్మదేవుడు, ముక్కోటిదేవతల సమక్షంలో వివాహం జరిగినట్లు ఒక కథనం.

## మరొకగాథ

పాలకడలిని చిలికినప్పుడు అందులో నుండి పుట్టిన శ్రీమహాలక్ష్మి భగవంతుని సౌందర్యానికి ముగ్ధురాలై ఆయనను పొందడానికి ఈ దివ్యదేశానికి వచ్చి దర్శనపుష్కరిణిలో తపస్సు చేసింది. భగవంతుడు కూడా ఆమెను వివాహం చేసుకోవడానికి ఒక తాళపత్రాన్ని తన సేనాధిపతికి ఇచ్చి పంపాడు. ఆయన అమ్మవారికి ఆ పత్రాన్ని ఇవ్వగా, ఆమె చాలా సంతోషించింది. ముక్కోటి దేవతలతో స్వామివారి క్షేత్రానికి వచ్చి దర్శనపుష్కరిణీ తీర్థంతో అమ్మవారికి అభిషేకం చేసి, ఆ తర్వాత ఆమెను వివాహం చేసుకున్నాడు.

## ఊహకందని విశేషం

ఈ ఆలయంలో ముక్కోటిదేవతలూ తుమ్మెదల్లా తిరుగుతుంటారని భక్తుల విశ్వాసం. ఇందుకు నిదర్శనంగా ఆలయంలో రెండు తేనెపట్టులున్నాయి. ఈ తేనెపట్టులోను, దక్షిణాయనంలో దక్షిణంలో ఉన్న తేనెపట్టులోనూ ఉంటాయి. ఇవి ఇంతవరకూ భక్తులనెవరినీ కుట్టినట్లు దాఖలాలు లేవు. ఈ తేనెపట్టులున్న గూటికి నిత్యారాధన, నైవేద్యం జరుగుతాయి.



Artist-K.Viswanathan, New Delhi

కటకమాసం
శుక్లపక్షద్వాదశి
(30-07-2023)
రోజున
తులసీమాహాత్మ్యం
ఆస్థానం
జరుగుతుంది.

ఈ రోజు
తిరుపతి
శ్రీగోవిందరాజస్వామివారు
ప్రాతఃకాలారాధనం
కాగానే
గరుడవాహనారూఢుడై
తిరువీథుల
ఉత్సవానికి
వేంచేస్తారు.

తిరిగి ఆలయానికి
రాగానే
జయవిజయుల
ద్వారం ముందు
స్వామివారికి ఆస్థానం
జరుగుతుంది.

ఆస్థానంలో
తులసీమాహాత్మ్యం
పురాణాన్ని పఠిస్తారు.

తర్వాత,
ఆస్థానం
పూర్తయి సన్నిధికి
వేంచేస్తారు.

యథావిధిగా
నిత్యకైంకర్యాలు
జరుగుతాయి.

ఈ సందర్భాన్ని
పురస్కరించుకుని
**'సప్తగిరి'**
పాఠకుల కోసం
**తులసీమాత
అష్టోత్తర
శతనామావళి** ని
అందిస్తున్నాం.

# శ్రీ తులసీమాత అష్టోత్తర శతనామావళి

ఓం శ్రీ తులస్యై నమః
ఓం పావన్యై నమః
ఓం పూజ్యాయై నమః
ఓం బృందావననివాసిన్యై నమః
ఓం జ్ఞానదాత్ర్యై నమః
ఓం నిర్మలాయై నమః
ఓం సర్వపూజితాయై నమః
ఓం సత్యై నమః
ఓం పతివ్రతాయై నమః
ఓం బృందాయై నమః 10
ఓం క్షీరాబ్ధిమథనోద్భవాయై నమః
ఓం కృష్ణవర్ణాయై నమః
ఓం రోగహంత్ర్యై నమః
ఓం త్రివర్ణాయై నమః
ఓం సర్వకామదాయై నమః
ఓం లక్ష్మీసఖ్యై నమః
ఓం సత్యశుద్ధాయై నమః
ఓం సుదత్యై నమః



ఓం భూమిపావన్యై నమః
ఓం హరిధ్యానైకనిరతాయై నమః 20
ఓం హరిపాదకృతాలయాయై నమః
ఓం పవిత్రాయై నమః
ఓం శ్రీరూపిణ్యై నమః
ఓం ధన్యాయై నమః
ఓం సుగంధిన్యై నమః
ఓం అమృతోద్భవాయై నమః
ఓం సురూపాయై నమః
ఓం ఆరోగ్యదాత్ర్యై నమః
ఓం తుష్ట్యై నమః
ఓం శక్తిత్రయరూపిణ్యై నమః 30
ఓం దేవ్యై నమః
ఓం దేవర్షిసంస్తుతాయై నమః
ఓం కాంతాయై నమః
ఓం విష్ణుమనఃప్రియాయై నమః
ఓం భూతభేతాళభీతిఘ్నాయై నమః
ఓం మహాపాతకనాశిన్యై నమః
ఓం మనోరథప్రదాయై నమః
ఓం మేధాయై నమః
ఓం కాంత్యై నమః
ఓం విజయదాయిన్యై నమః 40
ఓం శంఖచక్రగదాపద్మధారిణ్యై నమః
ఓం కామరూపిణ్యై నమః
ఓం అపవర్గప్రదాయై నమః
ఓం శ్యామాయై నమః
ఓం కృశమధ్యాయై నమః
ఓం సుకేశిన్యై నమః
ఓం వైకుంఠవాసిన్యై నమః
ఓం నందాయై నమః
ఓం బింబోష్ఠ్యై నమః
ఓం కోకిలస్వరాయై నమః 50
ఓం కపిలానిమగ్నగాసంభవాయై నమః
ఓం ఆయుష్యదాయిన్యై నమః
ఓం వరరూపాయై నమః
ఓం దుఃఖనాశిన్యై నమః
ఓం అవికారాయై నమః

ఓం చతుర్భుజాయై నమః
ఓం గరుత్మద్వాహనాయై నమః
ఓం శాంతాయై నమః
ఓం దాంతాయై నమః
ఓం విఘ్ననివారిణ్యై నమః 60
ఓం శ్రియై నమః
ఓం విష్ణుమాలికాయై నమః
ఓం తుష్ట్యై నమః
ఓం త్రివర్గఫలదాయిన్యై నమః
ఓం మహాశక్త్యై నమః
ఓం మహామాయాయై నమః
ఓం లక్ష్మీవాణీసుపూజితాయై నమః
ఓం సుమంగళాయై నమః
ఓం అర్చనప్రీతాయై నమః
ఓం సౌమంగల్యవివర్ధనాయై నమః 70
ఓం చాతుర్మాసోత్సవారాధ్యాయై నమః
ఓం విష్ణుసాన్నిధ్యదాయిన్యై నమః
ఓం ఉత్థానద్వాదశీపూజ్యాయై నమః
ఓం సర్వదేవప్రపూజితాయై నమః
ఓం గోప్యై నమః
ఓం రతిప్రదాయై నమః
ఓం నిర్గుణాయై నమః
ఓం పార్వతీప్రియాయై నమః
ఓం అపమృత్యుహరాయై నమః
ఓం రాధాప్రియాయై నమః 80
ఓం మృగవిలోచనాయై నమః
ఓం అమ్లానాయై నమః
ఓం హంసగమనాయై నమః
ఓం కమలాసనవందితాయై నమః
ఓం భూలోకవాసిన్యై నమః
ఓం శుద్ధాయై నమః
ఓం రామకృష్ణాదిపూజితాయై నమః
ఓం సీతాపూజ్యాయై నమః
ఓం రామమనఃప్రియనందన సంస్థితాయై నమః
ఓం సర్వతీర్థమయాయై నమః 90
ఓం ముక్తాయై నమః
ఓం లోకసృష్టివిధాయిన్యై నమః
ఓం ప్రాతర్దృశ్యాయై నమః
ఓం వైష్ణవ్యై నమః
ఓం సర్వసిద్ధిదాయై నమః
ఓం నారాయణ్యై నమః
ఓం సంతతిదాయై నమః
ఓం మూలమృదే నమః
ఓం పావన్యై నమః
ఓం అశోకవనికాసంస్థాసీతాధ్యాతాయై నమః 100
ఓం నిరాశ్రయాయై నమః
ఓం గోమతీసరయూతీరసంస్థాయై నమః
ఓం కుటిలాలకాయై నమః
ఓం అపాత్రభక్షపాపఘ్న్యై నమః
ఓం దానతోయాయై నమః
ఓం విశుద్ధిదాయై నమః
ఓం శ్రుతిధారణసువ్రతాయై నమః
ఓం శుభాయై నమః
ఓం సర్వేష్టదాయిన్యై నమః 108
శ్రీతులసీదేవ్యై నమః

అష్టోత్తర శతనామావళి
పూజాం సమర్పయామి



2023, మే 21 నుండి 25వ తేదీ వరకు జరిగిన **శ్రీగోవిందరాజస్వామివారి ఆలయమహాసంప్రోక్షణ** దృశ్యాలు.

ఈ కార్యక్రమంలో తి.తి.దే. పాలకమండలిసభ్యులు శ్రీ పోకల అశోక్‌కుమార్, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. ఎఫ్.ఏ.సి.ఏ.ఓ. శ్రీ బాలాజీ మరియు ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

















అల్లూరిసీతారామరాజు జిల్లా, రంపచోడవరంలో తి.తి.దే. నూతనంగా నిర్మించిన **శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయమహాసంప్రోక్షణ** దృశ్యాలు. ఈ వేడుకలు 2023, మే 17 నుండి 22వ తేదీ వరకు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు శ్రీ మార్గాని భరత్‌రామ్, తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, తి.తి.దే.సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., తదితరులు పాల్గొన్నారు.

# విశ్వచైతన్యం పెరగాలంటే...

- డా॥ ముంజులూరి నరసింహారావు

అథ యోగానుశాసనమ్ ।

అథ, యోగ-అను-శాసనమ్ ॥

'అథ' అనే మాటను ఏ శాస్త్రాన్ని మొదలుపెట్టదలుచుకున్నా మంగళవాచకంగా వాడతారని చెబుతారు. 'అథ' అంటే, మంగళమనే కాకుండా, 'ఆమీద', 'తరవాత', 'మొదలు', 'ప్రశ్నించటం', 'మొత్తం' అనే అర్థాలుకూడా ఉన్నాయి. అధ్యయనం చేయడమన్నది జిజ్ఞాసతో ప్రశ్నిస్తూ జరిగే ఒక తెంపులేని మంగళప్రదమైన కార్యక్రమం.

మనస్సులో పుట్టే ప్రశ్నలకు పూర్తి సమాధానాలను సంపాయిస్తూ అధ్యయనాన్ని కొనసాగిస్తూ ఉండడమనేది మంగళప్రదం కనుకా, అది 'ఆమీద' అనే అర్థ మున్న 'అథ'లో ఇమిడి ఉండడంవల్లనూ దీన్ని మంగళవాచకంగా చెబుతారు. మొదట్లోనే, ఏమీ చెప్పకుండానే వాడిన, ఈ 'ఆమీద'కున్న ఉద్దేశమేమిటి? ఈ మాటను వాడడమంటే, దానికి ముందస్తుగా ఏదో జరిగి ఉండాలనే అర్థం సూచితమౌతూనే ఉందిగదా మరి!

ఇక్కడ చెప్పబోతూన్న యోగశాస్త్రాన్ని అధ్యయనం చేయాలంటే, దాన్ని చేరుకోడానికి కావాల్సిన వనరులూ, అభిలాషలూ ఉండి తీరాలి. ఆ వనరులూ, వాంఛలూ ఏమిటో తెలుసుకోవాలంటే, ముందుగా అసలు యోగమంటే ఏమిటో మనం తెలుసుకోవాలి.

యోగమంటే, పరిమితమనుకునే శరీరగృహంలో చిక్కిన ఆత్మను అపరిమితమూ, సర్వోపగతమూ అయిన పరమాత్మతో, సంయమం (అదుపు)ద్వారా, (యుజ-సంయమే) సమాధి (అవధానాన్ని ఏకాగ్రం చేయటం) ద్వారాను (యుజ-సమాధౌ) సంయోగింపజేయడం (యుజిర్- యోగే) అని ఒక ముఖ్యమైన అర్థం. 'యో-గ' అని విడదీస్తే, ఆత్మకు నప్పని ధర్మాలనుంచి వేరు చేసి, దాని సహజధర్మాలను కలుపుకొంటూ (యు-మిశ్రణే అమిశ్రణే చ), ఆత్మను సత్పదార్థం దిశగా నడిపించేదే యోగమనే అర్థం సిద్ధిస్తుంది. 'యో-గ' అని రెండక్షరాలుగా విడదీసి అర్థం చెప్పడాన్ని యోగవిభాగం చేయడమని అంటారు.



ఈ యోగవిభాగమనే పలుకుబడిని పతంజలే తన వ్యాకరణ మహాభాష్యంలో ఉపయోగించాడు. యోగమంటే, కలిసి ఉండడం కనుక, యోగవిభాగం చేయడమంటే, దాన్ని విడబరిచి, వివేచన చేయడమని అర్థమన్నమాట. ఈవిధంగా మాటల్ని యోగవిభాగం చేసి అర్థాన్ని చెప్పడం నిరుక్తకారుల్లో ఎక్కువగా కన్పిస్తుంది.

యోగమంటే మరో రూఢి అయిన అర్థం ఉపాయం. పరిమితత్వాన్ని వదిలి అనంతత్వంలో కలవాలన్నా, దుఃఖాన్ని విడిచి శాశ్వతసుఖంలో లీనం కావాలన్నా, వేరుతనాన్ని విడిచిపెట్టి సమత్వాన్నీ, ఏకత్వాన్నీ పొందాలన్నా, కర్మలేపాన్ని అంటించుకునే మూర్ఖత్వాన్ని వదిలి, అది అంటుకోకుండా చేయగలిగే నేర్పుతో తామరాకు రూపాన్ని అందుకోవాలన్నా మహాఉపాయం అవసరం. అలభ్యలాభాన్ని, అంటే, పొందని దాన్ని పొందడాన్నే యోగమని అంటారు కూడాను.

పరిమితమైన తొడుగులాంటి శరీరంలో చిక్కుకొన్న ఆత్మను, సీమలూ, హద్దులూ లేని సర్వోపగతమైన పరమాత్మలో కలవడానికి కావలసిన ఉపాయాల యోజనను ఇక్కడ ప్రతిపాదించడానికి ఇప్పుడు, అనుకూలమైన పాఠాన్ని నిర్దేశిస్తున్నాడు సూత్రకర్త అయిన పతంజలి.

(ముగింపు వచ్చే సంచికలో...)



గృహలక్ష్మి

# గౌరీకరుణకు మార్గం

– శ్రీ గరిమెళ్ల శరవణ దీక్షితులు

ఆషాఢమాసంలోని అమావాస్యను చుక్కల అమావాస్య అని అంటారు. కొన్ని ప్రాంతాల్లో కొత్తగా పెళ్లైన కోడళ్లు 'చుక్కల అమావాస్య' పేరుతో ఒక నోముని నోచుకుంటారు. ఈ వ్రతానికి ప్రధానదైవం గౌరీదేవి.

ముత్తయిదువలు సంతానాన్ని, సౌభాగ్యాన్ని కోరుతూ 'చుక్కల అమావాస్య' నోము నోచుకొంటారు. ఈ వ్రతకథలో 'దేవశర్మ అనే బ్రాహ్మణునికి సౌందర్యవతి, గుణవతి అయిన భార్య ఉన్నా, వారు సంతానానికి నోచుకోరు. వాళ్లు పరమేశ్వరుని ప్రార్థించగా, 'బుద్ధిహీనుడైన దీర్ఘాయుష్యుడా, బుద్ధిమంతుడైన అల్పాయుష్యుడా ఎవరు కావాలి?' అని అడిగాడు.

ఆ దంపతులిద్దరూ వారు బుద్ధిమంతుడినే కోరుకున్నారు. అలా వరప్రసాదంగా జన్మించిన ఆ బాలుడు పెద్దయ్యాక, అల్పాయుష్యుడవడంతో ఎవ్వరూ తమ కూతురును ఇవ్వడానికి ముందుకు రారు. చివరకు ఒక పేదింటి పిల్లతో వివాహమౌతుంది. భర్త జన్మరహస్యం తెలిసిన ఆ అమ్మాయి ప్రతిదినం భక్తితో గౌరీపూజ చేస్తూ ఉంటుంది. విధి నిర్ణయం ప్రకారం కొన్నాళ్లకు చనిపోయిన తన భర్తను పార్వతీదేవి అనుగ్రహంతో ఆమె తిరిగి బతికించుకోవడం విశేషం. గత జన్మలో తాను దీపస్తంభ వ్రతమాచరించి ఉద్యాపన చేయనందున ఇలా వైధవ్యం ప్రాప్తించిందని తెలుసుకొంటుంది. 'ఏ వ్రతం చేసినా ఆసాంతం నిష్ఠగా చేయాలని' అమ్మవారిద్వారా గ్రహించి, ఆమె దానిని తిరిగి నిర్వర్తించడం ద్వారా స్త్రీలందరకీ ఆదర్శంగా నిలుస్తుంది.

## నోము ఎలా చేస్తారంటే...

ఒక పీటపై సున్నంతో మొదటిసంవత్సరం వంద చుక్కలు పెట్టి వాటి మీద వంద దారపు పోగులను ఉంచుతారు. బియ్యంపిండితో చేసిన వందచుక్కలను నివేదిస్తారు. ఈ సంఖ్య సంవత్సరానికో వందచొప్పున పెరిగి ఐదో సంవత్సరం ఐదు వందలకు చేరుతుంది. ఆ దారపు పోగులను ఒక దండగా అల్లుకుని మర్నాటివరకూ ధరిస్తారు. కొంతమంది నక్షత్ర దర్శనం అయ్యాకే భోజనం చేస్తారు.

ఐదుసంవత్సరాల వరకు ఆచరించే ఈ వ్రతంలో చివరి సంవత్సరం ఉద్యాపనగా స్తోమత ఉన్నవారు బంగారపు చుక్కలను కూడా దానం చేస్తారు. తమ మాంగల్యం కలకాలం నిలచి ఉండాలని గౌరమ్మను వేడుతారు.



మనం సరైన మార్గంలో వెళ్లాలంటే ఒక గురువు ఉండి తీరాలి

ఆషాఢఅమావాస్యరోజున గౌరీపూజ చేయడం కూడా మంచిది. ఆషాఢఅమావాస్య మరుసటిరోజునుండి శ్రావణమాసం మొదలౌతుంది. శ్రావణమాసం అంటే పెళ్లిళ్లు, అనేక శుభకార్యా ముహూర్తాలు మొదలయ్యే కాలం.

కాబట్టి ఈ శ్రావణంలో అవివాహితులు మంచి పెళ్లిసంబంధం కుదరాలని కోరుకుంటూ మాసానికి ముందు రోజున కన్నెపిల్లలు గౌరీ దేవిని పూజిస్తారు. పసుపుముద్దని గౌరీ దేవిగా భావించి కొలుచుకుంటారు. బియ్యపు పిండితో చేసిన కుడుములను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఈరోజు గౌరీ పూజ చేసుకుని అమ్మవారి రక్షాకంకణాన్ని ధరించిన అవివాహితలకు తమకు త్వరలోనే వివాహం జరుగుతుందని విశ్వాసం.



ఈనాడు దీపపూజ చేయడం కూడా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. అషాఢమాసంతో సూర్యుడు దక్షిణాయనానికి మరలుతాడు. రాత్రివేళలు పెరుగుతాయి, చలి మొదలవుతుంది. చలి, చీకటి అనేవి అజ్ఞానానికి, బద్ధకానికీ, అనారోగ్యానికీ చిహ్నాలు. వాటిని పారద్రోలి వెలుగుని, వేడిని ఇచ్చేవి దీపాలు. అందుకు సూచనగా దీపపూజని చేస్తారు. ఇందుకోసం పీటలు లేదా చెక్కపలకలని శుభ్రంగా అలికి, వాటి మీద ముగ్గులు వేస్తారు. ఆ పలకల మీద ఇంట్లో ఉన్న దీపస్తంభాలు లేదా కుందులను ఉంచుతారు. ఆ దీపాలకు పసుపుకుంకుమలతో అలంకరించి వెలిగిస్తారు. దీనిని దీపస్తంభవ్రతమని అంటారు.

'అమ' అనే అవ్యయానికి 'కలిసి (కూడి) ఉండటం' అని అర్థం. అదే అమావాస్య. 'ఎవరి కలయిక' అంటే సూర్యుడు – చంద్రుడు ఎదురెదురుగా కాసేపు రావడం. దక్షణాయణంలోని ఈ 'తొలి అమావాస్య' వారికి ఆహ్వానం పలుకుతుంది. ఆరోజు వారికి తర్పణాలు సమర్పిస్తారు. ఇది మొదలు వారికి చేసే జప తపాలకు, పూజలకు విశేషఫలితాలు కలుగుతాయి.

కొందరు 'అమావాస్య' అంటేనే ఏదో అపవిత్రమని భయపడిపోతారు. కానీ, ఇది అత్యంత శక్తివంతమైన తిథి. ముఖ్యంగా చుక్కల అమావాస్య రోజు దానధర్మాలు చేయడం వల్ల పితృదేవతల ఆత్మలు శాంతించి, అనుగ్రహిస్తారన్న నమ్మకం బలంగా ఉంది.

## శ్రీకృష్ణామృతం..



నారాయణా నిన్నె నమ్మి నేనుంటిరా
నీ కీర్తనము సేయ అనుమతి నీయరా

నీ దివ్యనామము గానము సేతురా
నా వాణివై నీవు నాయందుండరా

నీ దివ్యచరణములందు సతతము ఉండగనీర
నీ నామ మాలలు కూర్చగ కాంక్షను మెండుగనీరా

ఉల్లమందు నిన్నె నిలుపగా స్థిరమతి నెల్లపుడీరా
ఆ కోర్కె నిండుగ తీరగ మార్గము నీవె చూపర

పలుకులో పంచదారై పాటవై కొలువైపోరా
పాడిన మనసున ప్రీతిగా నర్తనమాడుకోరా

నిరతము నిన్నె తలువగా నిలకడౌ మనసును ఈయరా
నీడవై ఎల్లకాలం అనంతను పాలింపరా

–'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు,
99103 45794



మన దేవాలయాలు

# పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, గోవా

– శ్రీమతి రమా శాండిల్య, 96187 66600

ఈ దేవాలయం గోవా విమానాశ్రయం, పనాజీకి ఇరవైఐదు కిలోమీటర్ల దూరంలో, పొండా తాలూకాలోని, కుండే అనే ఊరిలో ఉంది. చాలా అందమైన పరిసరాల్లో కట్టారు. ఈ దేవాలయాన్ని అరవై సంవత్సరాల క్రితం కంచిపీఠం వారు, వారి పరిధిలోని ట్రస్ట్ కార్యక్రమాలలో భాగంగా ఇక్కడ నిర్మించారు. చుట్టూ కొండలతో, పచ్చనివృక్షాలతో, అందమైన పరిసరాలతో, మనసుకు శాంతిని, ఆహ్లాదాన్నిస్తాయి. ఈ ఆలయం, చక్కటి ఆధ్యాత్మికవాతావరణం, ఇక్కడ నెలవై ఉంటుంది.

ఇక ఇక్కడ మూడు ఆలయాలున్నాయి. మొదట వినాయకుడి ఆలయం ఉంటుంది. పవిత్రవాతావరణంలో, చాలా చక్కని అలంకరణలో పెద్ద విగ్రహం ఉంది. ఆ మూర్తిని అలాగే చూస్తూ కూర్చోవాలనిపిస్తుంటుంది.

ఆ తరువాత రెండవ ఆలయంలో ఆరు అడుగుల నిలువెత్తు శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహం ఉంది. స్వామి, అందమైన అలంకరణలో, పట్టు పీతాంబరాలతో దర్శనం ఇస్తాడు. ఇక్కడి ఈ గుడిలో శ్రీపద్మావతి, బాలాజీ విగ్రహమూర్తులను తిరుమల తిరుపతి దేవస్థానమే ఇచ్చింది. ఆ విగ్రహాలను తిరుపతిలోనే తయారు చేశారు.



మూడవ ఆలయంలో పద్మావతీ అమ్మవారు, కల్యాణం బొట్టుతో పెండ్లికుమార్తె అలంకరణతో చాలా అందమైన మూర్తిగా ఉంటుంది. పవిత్రంగా, శాంతిగా ఉన్న మండపంతో, చాలా బావుంటుంది ఈ ఆలయం.

గోవాలో ఉన్న ప్రాంతీయులే కాక బయటి రాష్ట్రాల నుంచి కూడా, హిందువులు, ఇక్కడకొచ్చి వివాహం చేసుకుంటారు. పెళ్లిళ్లు చేసుకోవటానికి అనువుగా ఒక కల్యాణ మండపం కూడా కట్టారు. వచ్చిన వారు ఉండటానికి అనువుగా గదులు కూడా కట్టారు.

యజ్ఞయాగాలు నిర్వహించటానికి యాగశాలలు, వంటచెయ్యటానికి వంటశాలలు, గోశాల మొదలైనవన్నీ ఉన్నాయి.



ఇంకొంచెం ముందుకు వెడితే, ఒక పెద్ద భవనం పైన శంకరాచార్యులవారి పెద్దవిగ్రహం ఉంది. ఆ మూర్తి నజీవంగా ఉన్నట్లు జీవకళ ఉట్టిపడుతుంటుంది.

ఉదయం ఎనిమిది నుంచీ రాత్రి ఎనిమిది వరకూ దేవాలయం, తెరిచే ఉంటుంది. శనివారం, ఆదివారం మాత్రం ఉదయం ఆరునుంచి, రాత్రి ఎనిమిది వరకూ తెరచి ఉంటుంది. గోవా వెళ్లిన ప్రతీవారు ఒకసారి దర్శించి రావాల్సిన దేవాలయ మిది.

తిరుమలకు వెళ్లలేని గోవాలోని పెద్దవారు ఈ ఆలయంలోని బాలాజీని దర్శించుకుని తృప్తిపడుతూ ఉంటారు!

# ఆషాఢంలో... అందాల గోరింట!!

- శ్రీమతి నీరజ

ఆషాఢమాసం రాగానే అతివలంతా చేతులకు ఎర్రగాపండే గోరింటాకు పెట్టుకుంటారు. అప్పటిదాకా తీవ్రమైన ఎండలతో మండి పోయిన శరీరాలకు చలువ చేస్తుంది కనుకా, చేతులకు పెట్టుకోవడంవల్ల శరీరతాపం తగ్గించుకోవచ్చు కనుకా అలా చేస్తారు. తర్వాత వచ్చే శ్రావణమాసంలోని పండుగలకు ఇలా స్వాగతం చెబుతారు కూడా. అసలీ గోరింటాకు పెట్టుకోవడం కూడా ఓ కళే. ఆ మధ్యలో కొంతకాలం “అబ్బే, పేడ ముద్దల్లా ఏమిటిదీ చేతులనిండా?” అని చీదరించుకున్నవారు సైతం గోరింట సుగుణాలు చూసి, గ్రహించి తాము కూడా అదే దోవన నడుస్తున్నారు. ప్రస్తుతం గోరింటాకును చాలా ఇష్టపడేవారిలో అత్యంతాధునిక మహిళలూ ఉన్నారు. పెళ్లిళ్లూ, పుట్టినరోజులూ, వివాహ వార్షికోత్సవాలూ, ఇంకా తదితర వేడుకలకు గోరింటాకుతో పండిన చేతులతో జనాన్ని మురిపించడం చేస్తున్నారు. వడ్డనలూ వగైరా సందర్భాల్లో ఎర్రగా పండిన గోరింటాకు రంగులతో ఆనందహేల సృష్టిస్తారు. గోరింటాకు నారీమణుల సౌందర్యానికే కాక ఆరోగ్యానికీ మేలైందని ప్రాచీనకాలం నుంచీ పెద్దలు చెబుతూనే ఉన్నారు. మనవారి ఈ గోరింటాకు ముచ్చట చూసి మోజుపడ్డ విదేశీయులు కూడా కొండొకచో తమచేతులను కూడా గోరింటాకు రంగుతో పండించుకుంటున్నారు.

మొదట్లో గోరింటాకును చేత్తోటే పెట్టుకునేవారు. మారినకాలంతోపాటుగా దీని పద్ధతి కూడా మారిపోయి త్రిభుజాకారమైన కోన్లతో పెట్టుకోవడం ప్రారంభమైంది. గోరింటాకు పెట్టడానికి కొన్నిచోట్ల శిక్షణకూడా ఇస్తారు. రాజస్థాన్‌లో ప్రతి ఏడాదీ గోరింటాకును రకరకాల డిజైనుల్లో అందంగా, ఆకర్షణీయంగా పెట్టడం నేర్పిస్తారు. వానాకాలం కోసం అక్కడి యువతులందరూ చాలా ఆత్రుతగా ఎదురు చూస్తారు. వానాకాలంలోనే అక్కడ గోరింటాకు శిక్షణ! ఎనిమిదేళ్ల రాజస్థాన్‌లో లభించే గోరింటాకు కూడా ప్రత్యేకమైంది. రాజస్థానీ శైలిలో గోరింటాకుతో పెట్టే డిజైనుల్లో చెట్లు, ఏనుగులు, చేపలు, విఘ్నేశుడు, రాజులు, నర్తకీమణులు, డోలు వాయించే పురుషులు ఉంటాయి. లతలూ, పువ్వులూ మామూలే!

జైపూర్‌శైలిలో నైతే పువ్వులతో పాటు పత్రాల డిజైనులూ ఉంటాయి. జోథ్‌పురిశైలి వీటికంటే భిన్నంగా ఉంటుంది. ఏదో ఆకృతిని గీచి దాంట్లో రాజస్థానీ ప్రింట్లలోని డిజైనులను నింపుతారు. వీటిని ‘చుందరీ, లెహరియా’ అంటారు. ముంబై శైలిలో చిలుకలూ, మయూరాలూ చాలా అందంగా చిత్రిస్తారు. ఉత్తరదేశంలో పెళ్లిళ్లకు చాలా విశేషంగా మెహందీ పెడతారు. వాళ్లు మనలాగా ఎప్పుడు పడితే అప్పుడు, పండుగలకూ, పబ్బాలకూ పెట్టుకోరు. కేవలం విశేషసందర్భాల్లోనే పెట్టుకుంటారు. ‘హాథ్ పీలా కర్‌నా’ అంటే వారిలో పెళ్లికి మాత్రమే పెట్టే ప్రత్యేకమైన గోరింటాకు అన్నమాట. కనుక పెళ్లికి ముందు ‘మెహందీ కీ రాత్’ అని చాలా వైభవంగా, గొప్పగా చేస్తుంటారు. చలువ చేస్తుందని అందరూ నమ్మే ఈ గోరింటాకును జుట్టుకు కూడా వాడతారు. కనుక ఇన్ని లాభాలు కలిగించే గోరింటాకును అందరూ ఆనందంగా ధరించడం ఎంతో బాగుంటుంది.



# శ్రీవిష్ణుస్వరూపం-అధికమాసం

- డా॥ కప్పగంతు రామకృష్ణ,
8897 547 548

అధికమాసం అనగానే ఎన్నో సందేహాలు పుట్టుకు వస్తాయి. అసలు మాసం అధికంగా రావటం ఏమిటి? ఏడాదికి 365 రోజులే కదా? మరి నెల ఎందుకు ఎక్కువ వచ్చింది? ఏటా అధికమాసం ఎందుకు రాదు? అధికమాసం వస్తే ఎలాంటి పూజలు చెయ్యాలి? ఏయే పనులు చెయ్యకూడదు? ఇలా వంద లాది సందేహాలు ఎంతోమందిని వేధిస్తుంటాయి.

ఖగోళపరంగా అనంతవిశ్వంలో అనేకమార్పులు జరుగు తాయి. గ్రహాల గమనాలు, పరిభ్రమణాలు... ఇలా ఎన్నో కాలగణనలు ఇందులో ఉంటాయి. ప్రత్యేకించి ప్రకృతిపై సూర్య, చంద్రగ్రహ గమనాలు మరింత ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయి. వీటన్నిటి ఆధారంగా మన ప్రాచీన వైజ్ఞానికవేత్తలు చేసిన కాల విభజనలో ఒక భాగమే 'అధికమాసం'.

## ఎలా ఏర్పడుతుందంటే...

పంచాంగ గణనల ప్రకారం సౌరమాన సంవత్సరానికీ, చాంద్రమాన సంవత్సరానికీ 11 $^{1}/_{4}$ రోజుల తేడా ఉంటుంది. చాంద్రమాన సంవత్సర వ్యవధి సౌరమాన సంవత్సర వ్యవధి కన్నా చిన్నది. అదేవిధంగా చాంద్రమానం ప్రకారం వచ్చే మాసం (నెలరోజుల వ్యవధి) సౌరమానమాసంకన్నా తక్కువ ఉంటుంది. ఇందువల్ల ఒక్కొక్కప్పుడు ఒక చాంద్రమానమాసంలో సౌర మాసం ఆరంభం కావడం జరగకుండాపోతుంది. అటువంట ప్పుడు సూర్యసంక్రాంతి (సంక్రమణం) జరగని చాంద్రమాసానికి అధికమాసం అని పేరుపెట్టారు మన ఖగోళ శాస్త్రవేత్తలు.

సూర్యుని చుట్టూ భూమి చుట్టివచ్చే కాలాన్ని సౌర సంవత్సరం అంటారు. ఈ భ్రమణం వల్ల నెలలు ఏర్పడవు. నెలల్ని కొలవటానికి చంద్రభ్రమణమే మూలం. భూమి చుట్టూ చంద్రుడు ప్రదక్షిణ చేసే కాలాన్ని నెల అంటారు. దాన్నే చాంద్ర మాసమని అంటారు. కానీ, ఆవిధంగా ఏర్పడ్డ 12 చాంద్ర మాసాలను కలిపి ఒక సంవత్సరం అని అనలేం. సూర్యుడు మేషం, వృషభం తదితర 12 రాశుల్లో ఒక్కోరాశిలో ఒక్క నెల సంచరించడాన్ని సౌరమాసం అని అంటారు. సూర్యుడు ఒక రాశి నుండి మరో రాశిలోనికి ప్రవేశించటాన్ని రాశి సంక్రమణం అంటారు. ఈ సంక్రమణం ప్రతినెలలోను జరుగుతుంది. (కానీ, ప్రస్తుత ఆచరణలో మనం మకరరాశి సంక్రమణాన్ని మాత్రమే మకరసంక్రాంతిగా గుర్తిస్తున్నాం) ఒక్కోరాశిలో ఒక నెలపాటు తిరగాల్సిన సూర్యుడు రెండునెలలపాటు ఒకే రాశిలో ఉండటం వల్ల ఏర్పడేదే అధికమాసం. ఇందులో మొదటినెలలో రవి సంక్రాంతి (సంక్రమణం) ఉండదు. దాన్నే అధికమాసం అంటారు.

## చంద్రగమనమే కీలకం

అధికమాసం చాంద్రమానం ద్వారానే వస్తుంది. చాంద్ర మానం అంటే చంద్రకళల (తిథులు) ఆధారంగా ఒక నెల రోజులను లెక్కించటమని అర్థం. సూర్యుడు ఏడాదిలో 12 రాశులచక్రాన్ని పూర్తి చేస్తే చంద్రుడు రోజుకు ఒక నక్షత్రం చొప్పున నెలకు 27నక్షత్రాల దగ్గరే ఉంటాడు. అనగా 12×27=354 రోజులు. సూర్యుడి చుట్టు భూమి తిరగడానికి 365 రోజుల 6గంటల 11నిముషాల 31సెకెండ్లు పడుతుంది. చంద్రునికైతే 354 రోజులే పడుతుంది. వీరిద్దరి గమనాల మధ్య సుమారు 11రోజులు తేడా ఉంది. ఈ వ్యత్యాసం వల్ల భూమి సూర్యుని చుట్టు 19సార్లు తిరిగితే చంద్రుడు 235 సార్లు తిరుగుతున్నాడు. దాని వల్ల 19సంవత్సరాలకు... ఏడాదికి 12 మాసాల చొప్పున 238మాసాలు రావాల్సి ఉండగా 235 మాత్రమే వస్తున్నాయి. అనగా చంద్రుడు 7నెలలు అధికంగా తిరుగుతున్నాడని అర్థం. ఆ లెక్కన ప్రతి ముప్పై రెండున్నర సౌరమాసాలకు ఒక చంద్రమాసం అధికంగా వస్తుంది.

అధికమాసం ఎప్పుడూ చైత్రమాసం నుండి ఆశ్వయుజ మాసం మధ్యలోనే వస్తుంది. ఒకసారి అధికమాసం వచ్చాక తిరిగి 28 నెలలకు మరోసారి వస్తుంది. ఆ తర్వాత 34, 34, 35, 28 నెలలకు వస్తుంది. అధికమాసం ముందు వచ్చి ఆ తర్వాత నిజమాసం వస్తుంది. అధికమాసాన్ని 'మైలమాసం' అనే పేరుతో వ్యవహరించే సంప్రదాయం కూడా ఉంది. అధిక మాసంలో ఎలాంటి శుభకార్యాలు, ముఖ్యమైన దైవకార్యాలు చేయకూడదు కాబట్టి ఈ పేరు ఏర్పడింది.

## విష్ణుమూర్తి వరం పొందిన నెల

అధికమాసానికి పురుషోత్తమ మాసం అనే పేరు ఉంది. ఈ పేరు రావటానికి వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. అదే

మిటంటే... ఏవిధమైన పుణ్యకార్యాలు చేయకూడదనే ఆచారం రావటంతో తనను అందరూ చిన్నచూపు చూస్తున్నారని, తన పేరు వినటానికే ఇబ్బందిపడుతున్నారని అధికమాస అధిష్ఠాన దేవత విష్ణుమూర్తితో మొరపెట్టుకుంటాడు. దయామయుడైన విష్ణువు ఆ దేవతను ఓదార్చి "నీకు అధిదేవత, ప్రత్యధి దేవత ఎవరూ లేరు. నీ బాధ విడిచిపెట్టు. నేనే నీ మాసానికి అధిష్ఠాన దేవతగా ఉంటాను. నా పేరు మీద ఇకమీదట నీ మాసానికి పురుషోత్తమ మాసం అనే పేరు ఏర్పడుతుంద"ని వరమిచ్చారు. ఈ నెలలో తనను అర్చించినవారు, దానధర్మాలు చేసినవారు, అధికమాసవ్రతం చేసినవారు ఉత్తమలోకాలు పొందుతారని కూడా వరమిచ్చాడు. అప్పటినుంచి అధికమాసానికి పురుషోత్తమ మాసం అనే పేరు వ్యాప్తిలోకి వచ్చింది.

ధర్మసింధువు ప్రకారం జాతకర్మలు, పుత్రకామేష్ఠి వంటి కామ్యకర్మలు అధికమాసంలో చెయ్యకూడదు. అధికమాసం ప్రారంభం కావటానికి ముందుగానే ప్రారంభించిన పనిని అధికమాసంలో కొనసాగించవచ్చు. కానీ, ఏ పనినీ నూతనంగా అధికమాసంలో ప్రారంభించకూడదు. జ్వరం మొదలైన వ్యాధుల నుంచి ఉపశమనం కోసం చేసే శాంతికర్మలు, అలభ్యయోగ నిమిత్తంగా చేసే శ్రాద్ధవ్రతాలు, ప్రాయశ్చిత్తకర్మలు కూడా అధికమాసంలో చెయ్యవచ్చు. పూజాదోషాల కారణంగా దేవతామూర్తిని పునఃప్రతిష్ఠ చెయ్యాల్సిన అవసరం వచ్చినప్పుడు తప్పనిసరిగా పునఃప్రతిష్ఠకు సంబంధించిన కార్యక్రమం చెయ్యాలి. నూతనంగా మాత్రం ప్రతిష్ఠాకార్యక్రమం నిర్వహించకూడదు.

ఉపనయనం, వివాహం, తీర్థయాత్రలు, వాస్తుకర్మ, గృహప్రవేశం, నూతనవస్త్రధారణ, సన్యాసం తీసుకోవటం, రాజదర్శనం, అన్నప్రాశన, వ్రతాలు, నామకర్మాదిసంస్కారాలు, ప్రమాణ స్వీకారం మొదలైనవి అధికమాసంలో చెయ్యకూడదు.

## అధికమాస వ్రతం

భవిష్యోత్తరపురాణం అధికమాసంలో నిర్వహించాల్సిన వ్రతం గురించి చెబుతుంది. దీన్ని అధికమాసవ్రతమనే పిలుస్తారు. ఈ వ్రతం చెయ్యాలని సంకల్పించినవారు దేవతా మందిరంలో లక్ష్మీనారాయణుల పటాన్ని ఉంచి, దానికి ముందు కలశాన్ని స్థాపించి పూజచెయ్యాలి. ఆ తర్వాత షోడశోపచారాలతో అర్చనలు చెయ్యాలి. ఇతర నైవేద్యాలతో పాటు ప్రత్యేకంగా నెయ్యి, గోధుమపిండి, బెల్లంతో తయారుచేసిన లడ్డూలు నివేదన చెయ్యాలి. పూజ పూర్తయిన తర్వాత ప్రదక్షిణ నమస్కారం చేసి, అర్ఘ్యం విడిచిపెట్టాలి.

ఈ వ్రతం ఆచరించే 30 రోజుల కాలంలో ఒంటిపూట భోజనం చెయ్యాలి. బ్రహ్మచర్యం పాటించాలి. వీలయినవారు నక్తభోజనం (పగలంతా ఉపవాసం ఉండి రాత్రి భోజనం) చెయ్యాలి. శక్తికొద్దీ దానధర్మాలు చెయ్యాలి.

మొత్తంగా అధికమాసం అద్భుతమైన ఖగోళ విజ్ఞానానికి నిదర్శనంగా నిలవటంతోపాటు ధర్మ కార్యాచరణపట్ల మనల్ని చైతన్యవంతులను చేస్తుంది.



# పరమ పవిత్ర గురువు

- శ్రీ కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య,
94914 11090

ఆయన ఆదిగురువు. జ్ఞానార్థులకు కల్పతరువు. దక్షిణ దిక్కు ఆయనకు నెలవు. ఆయనే భవరోగవైద్యుడు. సకల కల్మష హరుడు. చిన్ముద్రాధరుడు. బాలబ్రహ్మచారి, యోగపట్టాన్ని ధరించి యోగమార్గాన్ని భక్తులకు ప్రబోధించిన పరమేశ్వరుని లీలావతారమే శ్రీదక్షిణామూర్తి.

పరమేశ్వరుడి విశిష్టరూపాలలో దక్షిణామూర్తి స్వరూపం ఒకటి. పరమేశ్వరుడు మూడుభంగిమలలో మనకు దర్శన మిస్తాడు. భంగిమ అంటే రూపాన్ని తెలిపే స్థితి. 1)భోగరూపం, 2)యోగరూపం, 3)వేగరూపం.

భోగరూపంలో ప్రజలకు సుఖ సంతోషాలను అనుగ్రహిస్తాడు. సుఖాసన మూర్తి, ఉమాసహితమూర్తి భోగ మూర్తులు. మూడోదైన వేగరూపంలో దుష్ట సంహారం చేస్తాడు. అంటే మనలోని దుర్గు ణాలను నశింపజేస్తాడు. కాలాంతక, త్రిపు రాంతకమూర్తులు వేగమూర్తులు.

రెండోదైన యోగరూపంలో మానవులను ముక్తి మార్గం వైపు నడిపి స్తాడు. దక్షిణామూర్తి యోగమూర్తి. ఈ లీలామూర్తి అవతరించడానికి ఆసక్తికర మైన కథ ఒకటుంది.

పూర్వం సోమకాసురుడు వేదాల్ని అపహరించి సముద్రంలో దాక్కున్నాడు. వేదోద్ధారకుడైన శ్రీమహావిష్ణువు మత్స్యా వతారం ధరించి నాలుగువేదాలను నలుగురు బాలకులుగా మార్చి సోమకాసురుని చెరనుండి విడిపించుకుని వస్తున్నాడు.

**ఒక మర్రిచెట్టు క్రింద అద్భుతం జరుగుతోంది. అదేమంటే గురు శిష్యులు సమావేశమయ్యారు. గురువు వయస్సు 8సంవత్సరాలు, శిష్యుల వయస్సు 80సంవత్సరాలు. ఇది ఒక చిత్రం! గురువు మౌనంగా చిన్ముద్రను ధరించి కూర్చున్నాడు. చుట్టూ ఉన్న శిష్యులు ఆయన్నేమీ సందేహాలు అడగడం లేదు. ఆయనా వారికేమీ వాచికంగా బోధించడం లేదు. శిష్యుల మనసులో పుట్టిన సందే హాలన్నీ గురువు మౌనంతోనే తీరిపో తున్నాయి. సందేహాలన్నింటికీ సమా ధానం వారి మనసుల్లో స్ఫురిస్తోంది. ఇది మహావిచిత్రం.**

సోమకాసురుడు ఆ బాలురను నీటిలోకి లాగుతున్నాడు. హరికి పరిస్థితి చాలా కష్టంగా తోచింది. శివునితో మొరపెట్టుకున్నాడు.

**శివుడు జ్ఞానానికి మారుపేరైన దక్షిణామూర్తి అవతారం ధరించి ఆ రాక్షసుని కాళ్లక్రింద త్రొక్కిపట్టి కూర్చున్నాడు. నాలుగువేదాలు సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతు లనే నలుగురుశిష్యులుగా మారి దక్షిణామూర్తికి శిష్యులయ్యారు. శివుడువారికి వేదార్థాన్ని వివరించాడు. అందుకే ఆయనకు ఆదిగురువు అని పేరు వచ్చింది.**

సాధారణంగా శివాలయం గర్భగుడి దక్షిణంవైపున దక్షిణామూర్తి స్వరూపం మనకు దర్శనమిస్తుంది. ఒకవేళ అక్కడ విగ్రహం లేకపోయినా అది దక్షిణామూర్తిస్థానమే. పరమపవిత్ర గురుస్థానంగా భావించి నమస్కరించాలి.

ఇక పరమేశ్వరుడి రూపాల్లో కొన్ని అనుగ్రహరూపాలు కాగా మరికొన్ని సంహారమూర్తులు. అయితే అనుగ్రహం, సంహారం రెండూ కలగలిసిన విశిష్టరూపం దక్షిణామూర్తి. చిన్ముద్ర అనుగ్రహరూపం. చక్కని విద్యను అనుగ్రహిస్తుంది. ఆయన ఎడమచేతిలో ఉన్న అగ్నిసంహార రూపం అజ్ఞానాన్ని పటాపంచలు చేస్తుంది. ఆయన పాదాల క్రింద అపస్మారుడు ఉంటాడు. అతడిని నిగ్రహించడం కూడా ఈ అవతారం ధరిం చడానికి ఒక కారణం. ఇలా అనుగ్రహ సంహారభావాలు కలగలసిన రూపమే దక్షిణామూర్తి.

శైవాగమాలలో ఒకటైన కామికా గమం ఎనిమిది దక్షిణామూర్తి రూపాలను తెలిపింది.

### 1) యోగ దక్షిణామూర్తి

చంద్రునివంటి తెల్లనిశరీరచ్ఛాయతో వీరాసనంలో కూర్చుని, త్రినేత్రుడై సకల మునీశ్వరపరివేష్టితుడై ఉంటాడు. ఆయన నడుముకు సర్పం చుట్టుకుని ఉంటుంది. ఈయన బ్రహ్మకు జ్ఞానోపదేశం చేశాడు. అందువల్లనే ఈయనకు బ్రహ్మదక్షిణామూర్తి అని మరోపేరు కూడా ఉంది.



మనకు మొదటి గురువు తల్లి

**2) వీణాధర దక్షిణామూర్తి**

కైలాసపర్వతంపై కొలువుదీరి ముత్యపురంగులో మెరిసిపోతుంటాడు. సర్పాన్ని జంధ్యంగా ధరించిన ఈ స్వామి, అగ్నిమాలలను ధరించి ఉంటాడు. చేతితో బంగారువీణను మీటుతుంటాడు. ఈయనకు గేయ దక్షిణామూర్తి అనే పేరు కూడా ఉంది.

**3) మేధా దక్షిణామూర్తి**

స్ఫటికంవంటి స్వచ్ఛమైన తెలుపువర్ణంతో ఉండే మేధా దక్షిణామూర్తి నాలుగుచేతులలో జ్ఞానముద్ర, తాళపత్రగ్రంథం, అగ్ని, సర్పాలను ధరించి ఉంటాడు. ముత్యాలదండను ధరించి మర్రిచెట్టునీడలో కూర్చుని జ్ఞానబోధ చేస్తుంటాడు.

**4) ఆసీన దక్షిణామూర్తి**

ఈ స్వామి త్రినేత్రుడు. చేతులలో పరశు, జింక, విల్లు పట్టుకుని దర్శనమిస్తాడు.

**5) వరదక్షిణామూర్తి**

మర్రిచెట్టు క్రింద అపస్మారుని మర్దిస్తూ కనిపిస్తాడు. శివాలయాల్లో దర్శనమిచ్చేది ఈయనే.

**6) యోగపట్టాభిరామ దక్షిణామూర్తి**

ఈయన ఆసీనమూర్తిగా ఉన్నపుడు ఒక పట్టం ధరించి ఉంటాడు. పట్టం అంటే ఉదరబంధం వంటి ఒక ఆభరణం.

**7) జ్ఞానదక్షిణామూర్తి**

ఈయన జ్ఞానప్రదాయకుడు. త్రిశూలం, కపాలం, వీణలతో సనకాదిమునులకు జ్ఞానబోధ చేశాడు.

**8) శక్తి దక్షిణామూర్తి**

ఈ స్వామి ముత్యాల అక్షమాల, అమృతకలశం ధరించి ఉంటాడు.

మరికొన్ని గ్రంథాలలో అదనంగా మరో ఎనిమిది దక్షిణామూర్తి రూపాలను తెలిపారు. అవి 1)మేధా దక్షిణామూర్తి, 2)కీర్తిదక్షిణామూర్తి, 3)లక్ష్మీదక్షిణామూర్తి 4)జ్ఞానదక్షిణామూర్తి, 5)శాంభవీదక్షిణామూర్తి, 6) వీరదక్షిణామూర్తి, 7)సంహార దక్షిణామూర్తి, 8) గురుదక్షిణామూర్తి.

ఇలా అనేకరూపాలలో దర్శనమిచ్చే ఈ స్వామి మర్రిచెట్టునీడలో కొలువై ఉంటాడు. మర్రిచెట్టు బుద్ధి చైతన్యానికి ప్రతీక. విస్తరించి ఉండటమే జ్ఞానానికి నైజం అని వటవృక్షం తెలుపుతుంది. బొటనవేలు, చూపుడువేలు కలిపితే ఏర్పడే చిన్ముద్ర పరమాత్మ, జీవాత్మల సంయోగానికి ప్రతీక. దక్షిణా మూర్తి చేతిలో ఉన్న తాళపత్రగ్రంథం జ్ఞాన భాండారానికి ప్రతీక. డమరుకం శబ్దానికి, అగ్ని కాంతికి, పులిచర్మం దుష్టనిగ్రహానికి సంకేతాలు.



**ధ్యానం**

స్ఫటిక రజత వర్ణం మౌక్తికీమక్షమాలామ్
అమృతకలశ విద్యాం జ్ఞానముద్రాం కరాబ్జైః
దధత మురగకక్షం చంద్రచూడం త్రినేత్రమ్
విధృత వివిధభూషం దక్షిణామూర్తి మీడే (శ్రీతత్త్వనిధి)

**స్ఫటికం వంటి ప్రకాశించే శరీరచ్ఛాయ గలవాడు, ముత్యాలహారాన్ని ధరించినవాడు, అమృతత్త్వమనే అనుభవ జ్ఞానవిద్య ప్రసాదించేవాడు, జ్ఞానముద్ర ధరించినవాడు, సర్పం మొలత్రాడుగా కలవాడు, తలపై చంద్రవంకను ధరించి మూడు నేత్రాలతో, అనేక అలంకారాలతో శోభించే దక్షిణామూర్తిని ధ్యానిస్తున్నాను.**




# ఏడుకొండలవాడా! వేంకటరమణా!!

- శ్రీ ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
93939 81918.

మా రెండో అబ్బాయికి తిరుపతిలో పుట్టువెంట్రుకలు తీయిద్దామని  మూడురోజులు సెలవు పెట్టాను. నేను సెలవులో వెళ్లేలోగా, పని పూర్తి చేసిన ఒక వెండర్ బిల్‌క్లియర్ చెయ్యాలనుకుని, ఆ వెండర్‌ను బిల్స్ తీసుకుని ఇంటివద్దకు రమ్మన్నాను. అతడు చెప్పినట్లే ఇంటికి వచ్చాడు.

"ఎక్కడికి సార్? తిరుపతా?" అడిగాడు గబుక్కున.

"నాకు చెప్పడం ఇష్టం లేకపోయినా, ముక్తసరిగా 'ఊ' అన్నాను.

అతను బైక్ మీద వేగంగా వెళ్లిపోయి మళ్లీ పావు గంటలో వెనక్కి వచ్చి "సార్! మీ ఆఫీసులోనే మరో బ్రాంచ్‌లో రామారావుగారు పనిచేస్తాడు కదా, వాళ్ల మామగారు తిరుమల పూర్వకార్యనిర్వహణాధికారి, ఆయన చేత ఈ లెటర్ రాయించుకొచ్చాను. తీసుకోండి. ఉపయోగపడుతుంది" అన్నాడు.

చెప్పొద్దూ చెడ్డ చిరాకు వచ్చింది. ఇది గమనించి "ఎందుకైనా మంచిది ఉంచండి సార్"అని నా చేతిలో ఉత్తరం పెట్టి రివ్వున వెళ్లిపోయాడు.

నేను విసుగ్గా మా ఆవిడకిచ్చి "అక్కడెక్కడన్నా పెట్టు" అన్నాను.

మా కుటుంబసభ్యులమందరం హిమాయత్‌నగర్‌లోని తి.తి.దే. కార్యాలయానికి వెళ్లి బయోమెట్రిక్‌లో దర్శనం బుక్ చేసుకున్నాం.

సరిగ్గా తిరుపతికి వెళ్లడానికి నాలుగురోజులుందనగా మా పెద్దబ్బాయికి జ్వరం వచ్చింది. చిన్నప్పటినుంచి వాడికి అనారోగ్యం వస్తే అడ్మిట్ అవ్వాల్సిందే, అంత తీవ్రంగా ఉంటుంది పరిస్థితి. మా ఆవిడ ఆందోళనగా "తిరుపతి వెళ్లడానికి ఇంక నాల్రోజులే ఉంది. ఎలా?" అంది.

"అంతా ఆయన చూచుకుంటాడు. తగ్గిపోతుంది. బాధపడకు" అన్నాను.

శనివారం రాత్రి మా అమ్మ కూడా "అంత దూరం వెళ్లడం నాకెందుకో మనసు ఒప్పుకోవడం లేదు. ప్రయాణం వాయిదా వేసుకోరా" అంది బాధగా.

నా కెందుకో మనసంతా చిరాగ్గా ఉంది. "అది అంత సులభంకాదు, రైలు రిజర్వేషన్ అయిపోయింది. దర్శనానికి టోకెన్ తీసుకున్నాం. ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసుకున్నాం. ఇప్పుడు ఏం చేయలేం. అంతా ఏడుకొండలవాడు చూసుకుంటాడు" అన్నాను గట్టిగా.

ఆ రాత్రి మాకెవరికీ నిద్ర పట్టలేదు.

మరుసటిరోజు బీ.టెక్ ఎంట్రన్స్ టెస్ట్‌కి బయల్దేరబోతూ మా ఆవిణ్ణి పిలిచి "నేను పరీక్ష హాల్లో నుంచి బయటకు రాగానే నీకు ఫోన్ చేస్తాను (అప్పట్లో సెల్‌ఫోన్లు లేవు. టెలిఫోన్ బూత్‌లోంచి లాండ్ లైన్లో మా ఇంటి పక్కనున్న షాపుకు చేస్తే, వాళ్లు మా ఆవిణ్ణి పిలిచి ఇస్తారు). డాక్టర్ ఏం చెప్పాడో చెప్పు. ఒకవేళ ఆయన ప్రయాణం వద్దంటే వస్తూ, వస్తూ సికింద్రాబాదు స్టేషనుకు వెళ్లి టిక్కెట్ రద్దు చేసుకుని వస్తాను" అన్నాను.

అనుకున్న ప్రకారం ఎగ్జామ్ హాల్లో నుంచి బయటకు రాగానే దగ్గర్లో ఉన్న షాపుకు పరిగెత్తుకెళ్లి మా ఆవిడకి ఫోన్ చేశాను. తను లైన్లో కొచ్చి "డాక్టర్ ప్రయాణం చెయ్యొచ్చు, ఏం ఫర్వాలేదన్నాడండీ. ట్రావెలింగ్‌లో వేయడానికి మందులు ఇచ్చాడు" అంది. నా మనసు కుదుటపడింది.

సికింద్రాబాదు రైల్వేస్టేషన్‌లో ట్రైన్ ఎక్కాం. మా ఎదురుగా నేపాలీదంపతులున్నారు. వాళ్లకు ఆరేడేళ్లున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. అతను టీషర్ట్‌లో, మెడలో రకరకాలరంగు రాళ్ల దండతో చాలా గమ్మత్తుగా ఉన్నాడు. నాకు ఎందుకో

అతని మీద సదభిప్రాయం కలగలేదు. వాళ్లావిడ మాత్రం పంజాబీ డ్రస్సులో సాదా సీదాగా ఉంది.

సరిగ్గా రాత్రి ఎనిమిదిన్నర. అప్పుడు మావాడు మోషన్‌కు వెళ్లాడు. వామిటింగ్ కూడా చేసుకున్నాట్ట. మా ఇద్దరికీ గుండె జారిపోయింది.

మా ఎదురుగా ఉన్న నేపాలీదంపతులు మా ఆందోళన గమనించినట్టున్నారు. "ఏమైంది? బాబుకు ఒంట్లో బాగాలేదా? జ్వరమా" అడిగారు.

"ఆఁ" ముక్తసరిగా అన్నాను.

"గాబరా పడకండి, ఏం కాదు. నా దగ్గర పేరాసెట్మాల్ ఉంది. మోషన్ తగ్గడానికి కూడా ట్యాబ్ లెట్ ఉంది ఇవ్వనా?" అన్నాడతను.

"అవసరం లేదు. వాడు ఆల్రెడీ మెడికేషన్లో ఉన్నాడు. మా డాక్టర్ ఇచ్చాడు"అన్నాను. మా వాడు పడుకున్నాడు.

అతడు వాళ్లావిడకి ఏదో చెప్పాడు. ఆవిడ రెండు ప్లేట్లలో రెండు పూరీల చొప్పున, కూరతో వేసి అతనికి పట్టు కొచ్చిచ్చింది. అవి మాముందు పెట్టి "ఇదిగో తినండి" అన్నాడు. నా మనసులో రకరకాల ఆలోచనలు. వాళ్లు అపరిచితులు. అసలే మనసంతా చికాగ్గా ఉంది. ఇప్పుడు వాళ్లిచ్చింది తిన్నాక ఏవన్నా సమస్య వస్తే? "ప్లీజ్, వద్దు" గట్టిగానే తిరస్కరించాను. వాళ్లావిడ వంక తిరిగి అవి లోపల పెట్టేయమన్నాడు. మేము తినకపోతే వాళ్లూ తినరట. వాళ్ల పిల్లల్ని చూస్తే జాలేసింది. "సరే, ఇవ్వండి"అన్నాను ఏం చెయ్యాలో తెలీక.

మాకు పెట్టి, వాళ్లూ తిన్నారు. రాత్రంతా మా అబ్బాయికి మోషన్స్, వామిటింగ్స్ అవుతూనే ఉన్నాయి. రాత్రంతా మాతో పాటూ మేల్కొని వాళ్లు మాకు ధైర్యం చెబుతూనే ఉన్నారు.

వాళ్లకి రేణిగుంటలో షాప్ ఉందట. మాటల సందర్భంలో చెప్పాడు.

రేణిగుంటలో రైలు ఆగినప్పుడు తమతో పాటు దిగిపోయి, తమ ఇంట్లో ఉండి, తమ ఫ్యామిలీడాక్టరుకు చూపించుకుని ఆ తర్వాత తిరుపతి వెళ్లమని వాళ్లిద్దరూ ఎంతో బతిమాలారు. మొదట్లో వాళ్లను తప్పుగా అర్థం చేసుకున్నందుకు మనసులో సిగ్గుపడుతూ వాళ్లచేతులు పట్టుకుని వాళ్లు మాకిచ్చిన ధైర్యానికి కృతజ్ఞతలు చెప్పి అక్కడ దిగలేమని సున్నితంగా తిరస్కరించాను. అతని ఆహార్యం చూసి అతణ్ణి తప్పుగా అర్థం చేసుకున్నాను. నా చదువంతా ఏమైపోయిందో?

తిరుపతిలో దిగాక మా బాబును ఎత్తుకున్నాను. వాడు తల నా భుజం మీద పెట్టి పడుకున్నాడు. అక్కడ డాక్టర్‌కి చూపించి తిరుమల వెళదాం అనుకుని అదే మా ఆవిడతో అన్నాను. తను సమాధానం చెప్పేలోగా మావాడు 'కొండపైకి వెళదాం' అన్నాడు. రెండుమూడుసార్లు అలాగే అన్నాడు ఎందుకో, నాకూ అదే సరైనదనిపించింది. బస్‌లో కొండపైకి వెళ్లాం. వెళుతున్నంత సేపూ, మనసులో ఆందోళనగానే ఉంది.

తిరుమల చేరుకోగానే శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్స వాలని తెలిసింది. ఇసుక వేస్తే రాలనంత మంది జనం. నా మెదడు మొద్దుబారిపోయింది. బాబును మా ఆవిడకిచ్చి వాళ్లిద్దరినీ నీడలో కూచోబెట్టి, గదుల కోసం వెళ్లాను. ఎక్కడా గదులు దొరకలేదు. ఏం చేయాలో తోచలేదు.

అంతలో తెల్లబట్టల్లో ఉన్న ఒకాయన బయట కొచ్చాడు. నా మనసులో ఒక ఆలోచన వచ్చింది. వెంటనే మా ఆవిణ్ణి "మా వెండర్ ఇచ్చిన కాగితం ఏం చేశావు?" అడిగాను ఆత్రుతగా. పెట్టెలో పెట్టానంది.

"త్వరగా తీయ్" అన్నాను. తను తీసిచ్చింది.

తనకు ఆ ఉత్తరం ఇచ్చి, బాబును నేను చూస్తాను, ఆ తెల్లబట్టలేసుకున్న వ్యక్తి దగ్గరకు వెళ్లి, ఆయనకు బాబును చూపించి, పరిస్థితి వివరించి, ఉత్తరం ఇవ్వమన్నాను.

తను అలాగే చేసింది. ఆయన బాబు వంక చూశాడు. నా ఒళ్లో నీరసంగా పడుకుని ఉన్న వాడిని చూసి ఏమను కున్నాడో, ఆ ఉత్తరం లోపలికి తీసుకెళ్లి, గది ఇచ్చినట్టుగా రశీదు పట్టుకొచ్చి ఇచ్చాడు. ఆయనకు, మా వెండర్‌కు మనసులో ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పుకున్నానో తెలీదు.

గదిలో సామాను పడేసి, బండీలో కాఫీ తయారు చేస్తున్న వ్యక్తి దగ్గరకు వెళ్లి "బాబూ ఇక్కడ ఉన్న మంచి ప్రైవేట్ హాస్పిటల్ చెప్పు, బాబుని చూపించాలి" అన్నాను ఆత్రుతగా.

"ఎందుకు సార్, గవర్నమెంట్ హాస్పిటల్ కొద్ది దూరంలో ఉంది." అని ఎలా వెళ్లాలో గుర్తులు చెప్పి "వెళ్లి చూపించండి" అన్నాడు తల తిప్పకుండానే.

నేను బాబును ఎత్తుకుని డాక్టర్ గారున్న గది తలుపు దగ్గర నుంచున్నాను. లోపల ఎర్రగా కమలాపండులా ఉన్న డాక్టరు గారు తన ఎదురుగా ఉన్న పేషేంటును చూస్తూ కనిపిస్తున్నాడు. ఆ పేషెంటును చూడడం పూర్తవగానే ఏమనుకున్నాడో నన్ను లోపలికి రమ్మన్నాడు. నేను వెళ్లి ఆయనముందు కూచుని జరిగింది చెప్పాను.

ఆయన బాబును పరీక్షించి "వైరల్ ఫివర్ అనుకుంటా, రేపు మీరు ఇక్కడే బ్లడ్ టెస్ట్ చేయించండి, ఇదిగో ఈ ఇంజక్షన్ చేయించండి, రూమ్‌కి వెళ్లాక ఏదన్నా లైట్‌గా తినిపించి మాత్రలు వేయండి" అన్నాడు.

నేను మా రెండోవాడి పుట్టువెంట్రుకలు తీయించడానికి వచ్చిన విషయం చెప్పి, నేనూ మా పెద్దబ్బాయికూడా జుట్టిద్దా మనుకున్నామని చెప్పాను. ఆయన నా వంక సూటిగా చూసి "ఈ బాబుది వద్దులేండి" అన్నాడు.

నేను బయటకొచ్చి మా ఆవిడతో 'తిరుమల వచ్చి డాక్టర్‌కు చూపించుకోవడమేంటో, రక్తపరీక్షలు చేయించు కోవడమేంటో, వీడు జుట్టు ఇవ్వలేకపోవడమేంటో' అన్నాను బాధగా, నిరాశగా.

మావాడికి ఇంజక్షన్ చేయించి గదికి వస్తుంటే మధ్య దారిలో కల్యాణకట్ట ఉంది. అక్కడికి రాగానే మా పెద్దాడు "డాడీ నేను జుట్టిస్తా" అన్నాడు. నాకు ఒళ్లు జలదరించింది. వాడి ఒళ్లు అప్పటికీ జ్వరంతో వేడిగానే ఉంది.

మా ఆవిడ "డాక్టర్ వద్దన్నారు కదండీ" అంది ఆందోళనగా. "ఆ వేంకటేశ్వరుడే మనవాడి చేత అలా అనిపించాడేమో, అలాగే జుట్టిప్పిద్దాం" అన్నాను. "జుట్టిచ్చాక స్నానం చెయ్యాలిగా, ఇలా ఒళ్లు పెనంలా కాలిపోతూంటే ఎలాగండి" అంది దాదాపు ఏడుపు గొంతుతో. "చెప్పాను కదా ఆయనే చూసుకుంటాడని" అన్నాను మొండి ధైర్యంతో.



వాడిని అక్కడ క్షురకుడి ముందు కూచోబెట్టి, మావాడి చేత స్వామికి దణ్ణం పెట్టించి, జుత్తు ఇప్పించాను. మేమూ జుట్టు ఇచ్చేశాం. అప్పుడు రూ. 5/–కు బకెట్ వేడినీళ్లు ఇచ్చేవాళ్లు. అవి తెప్పించి వాడికి స్నానం చేయించాం.

అది పూర్తయ్యాక, అంతకు ముందు దాకా నా భుజం మీద పడుకునే ఉండేవాడు, నడవడం మొదలెట్టాడు. హోటల్లో ఇడ్లీలు తిని అందరం స్వామి దర్శనానికి వెళ్లాం. మేమందరం కళ్లారా ఆ దివ్యమంగళస్వరూపాన్ని చూశాం.

అది మొదలు మాతో పాటూ కొత్త ఉత్సాహంతో, సంతోషంగా తిరుమల అంతా తిరిగాడు. ఆ శ్రీనివాసుడి లీలలు అనంతం.

*గోవిందా.. గోవిందా!*



బాలనీతి

# క్షమించే... మనస్సుండాలి!

– శ్రీమతి నల్లాని రాజేశ్వరి, 99086 02443

వ్యాసుడు శివధర్మసూక్ష్మాలు బాగా తెలిసినవాడు. అవన్నీ శిష్యులకు చెప్తూ ఉండేవాడు. ముప్రొద్దులా గంగలో మునిగి తేలుతూ, నియమనిష్ఠలతో విశ్వేశ్వరుణ్ణి అర్చిస్తూ ఉండే వాడు. మాధూకరవృత్తితో శిష్యులూ, తానూ ఆకలి తీర్చుకుంటూ, ముక్తిమండపంమీద కూర్చుని శివపురాణకథలు చెప్తూ, శివపంచాక్షరి చిత్తశుద్ధితో చేస్తూ ఉండేవాడు.

అలా చాలాకాలం గడిచింది. ఒకనాడు విశ్వేశ్వరుడు విశాలాక్షీదేవిని చూచి–“వ్యాసుని మనస్తత్త్వం తెలుసుకోవాలి. దేవీ! అతడూ, శిష్యులూ భిక్షకు వెళ్లినపుడు ఏ ఇంటా భిక్షపెట్టని పద్ధతి కలిగించు” అన్నాడు. ఆ మాటకు ఆ తల్లి ‘సరే’ అనింది. అన్నిజీవులకూ అంతర్యామిని కనుక కాశిలోని గృహిణీగృహస్థుల హృదయాలలో ‘భిక్షపెట్టకూడదు’ అనే భావం కలిగించింది.

ఆనాడు ప్రొద్దుపొడవకముందే వ్యాసుడు శిష్యులతో కూడా లేచి, ప్రాతఃకాలకృత్యాలు తీర్చుకున్నాడు. గంగలో స్నానం చేసి, సూర్యునికి అర్ఘ్యప్రదానం చేసి, సంధ్యవార్చి నిలుచుండి, అష్టోత్తరశతం గాయత్రిని జపించాడు. అగ్నికార్యం తీర్చి, విశ్వేశ్వరుణ్ణి దర్శించి, శిష్యులకు శివపురాణం మధ్యాహ్నంవరకు చెప్పాడు. “ఇక భిక్షాటనకు లేవండయ్యా!” అన్నాడు. శిష్యులులేచారు.

శిష్యులు పైల, సుమంతాదులు ఆకుదొన్నెలు పట్టుకుని నలుగురూ నాలుగువైపులకు భిక్షకు వెళ్లారు. తానొక వైపు వెళ్లాడు. ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం. ఏమి చిత్రమో! ఏ ఇంటా ఒట్టుపెట్టినట్టు ఏ ఇల్లాలూ పట్టెడన్నం పెట్టలేదు. ఇంకా వంట కాలేదని ఒక ఇల్లాలు, తిరిగి రా! అని మరో గృహిణి, ఈనాడు మా ఇంట దేవకార్యం అని ఒక గృహస్థురాలు– ఒక ఇంట ఇల్లాలు అసలు తలుపు తెరువనే లేదు. ఇలా నిర్భాగ్యుడికి ధనం అబ్బనట్టు ఏ ఇంటా పిడికెడు అన్నం దొరకక, వ్యాసుడు మఠానికి మరలిపోయాడు. కడుపుచిచ్చు భరించలేక, కళ్లప్పగించి చూస్తున్నాడు. అంతలో అదే వరుసలో శిష్యులు వచ్చారు.

ఎంత ఆశ్చర్యం! మనం ఈ పట్టణంలో ఎంతోకాలం నుంచి ఉన్నాం. ఏనాడూ భిక్ష దొరకని గడియలేదు. నిజం చెప్పాల్సివస్తే ఈ నగరంలోని ఇల్లాండ్రు అన్నపూర్ణాదేవికి అనుగు చెల్లెండ్రే. ఎల్లవేళలా ఆదరించి, అన్నం పెట్టే సుమంగళులులు ఈనాడు, మూతులు బిగించుకు కూర్చున్నారే! నాలుగు పురుషార్థాలకూ ఆటపట్టైన కాశీక్షేత్రంలో ఈనాడు ఇలా జరగడం అనూహ్యంగా ఉంది. నలుగురూ నాలుగువైపులా వెళ్లి, కారణం తెలుసుకురండి!” అని శిష్యులను ఆజ్ఞాపించాడు– వ్యాసుడు.

కాలే కడుపులతో, వాడుమొగాలతో, ఈడుపుకాళ్లతో శిష్యులు వెళ్లి, కాశీపురవీథులన్నీ తిరిగివచ్చారు. ఎక్కడా ఏ వైపరీత్యం కనిపించలేదని గురువుతో చెప్పారు. గురుదేవా! కోరి కైలాసం విడిచి, శంకరుడు విశ్వేశ్వరుడై ఇక్కడ నివసిస్తున్నాడు. ఆకలితో నకనకలాడేవారికి తృప్తిగా గౌరీదేవి అమృతాన్నభిక్ష స్వయంగా పెట్టుతుంది. పరమపావని గంగానది ఇక్కడ ప్రవహిస్తోంది.

ఎందరో పుణ్యాత్ములు, బ్రహ్మణ్యులు, మునులు నివసిస్తున్నారు. అపరనారాయణమూర్తి అయిన మీరు ఉంటున్నది ఈ క్షేత్రమందే! ఇలాంటి పుణ్యక్షేత్రంలో ఈనాడు భిక్ష దొరకలేదంటే అనడానికీ, వినడానికీ అబ్బురంగా ఉంది.

వ్యాసుడు శిష్యులు చెప్పింది విన్నాడు. ఔనన్నట్టు తల ఊపాడు. వేడినిట్టూర్పు విడిచాడు. “సరే! కానీయండి. అదుగో, సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఇక చేసేదేమీ లేదు. ఈనాటికి పస్తుపడుకోవడమే! రేపటిసంగతి చూద్దాము” అని తల తడవుకున్నాడు.

ఆ రాత్రి గడిచింది. మర్నాడూ ఇదే పరిస్థితి. దాంతో చీకాకు పడ్డాడు. చిటపట లాడాడు. పటపట పళ్లు కొరికాడు. భిక్షాపాత్ర నట్టనడివీథిని చట్రాయిమీద వేసి పగులగొట్టాడు. కాశి నలువైపులా తేరిపార చూశాడు. “ధనమదం, వేదవిద్యామదం, మోక్షలక్ష్మీమదం ముదిరి, కాశీప్రజలు నన్నిలా అవమానించారు. కాశిలో ఇక మూడుతరాలు కాగానే ధనమూ, విద్యా, ముక్తీ కాశీవాసులకు కలుగకపోవుగాక!” అని ఆకలి దప్పులకు నలిగి, అలిగి శపించాడు. ఆ సమయంలో ఎదురుగా ఉన్న ఒక ఇంటినుంచి ఒక వృద్ధ సుమంగళి ఇంకొక స్త్రీ చేయూతగా నిలిచి, గొంతెత్తి “ఓ మునీశ్వరా! ఇలా రా!” అని మధురకంఠంతో పిల్చి, చేయి ఊపింది. ఆమె వేదశాస్త్ర



పురాణాలలో వినవచ్చే పెద్ద ముత్తైదువ అనీ, కాశీనగరమహా రాజ్ఞి అయిన ఆదిశక్తి అనీ వ్యాసుని కేమి తెలుసు? ఆ ఇంటి ఇల్లాలే అనుకున్నాడు. కాళ్లీడ్చుకుంటూ దగ్గరకు వెళ్లాడు. దరిచేరిన వ్యాసుణ్ణి ఆమె పరకాయించి చూచి, తల ఊపి, "ఏమయ్యా! ఆకలికి పట్టెడుకూడు దొరకలేదని అంగలార్చుతున్నావా? సన్న్యాసిలా ఉన్నావు, ఉత్తవేషమా ఇది? సన్న్యాసికి ఉండాల్సిన ప్రధానగుణం శాంతం. అది నీలో ఏమైనట్టు? ఈ పురంలో ఎందరు సన్న్యాసులు లేరు? వారు నీకన్న మతిహీనులా?

ఉన్నఊరు, కన్నతల్లి ఒకటే అనేమాట వినలేదూ? అందునా కాశీ– విశేషించి, విశ్వేశ్వరుని అర్ధాంగలక్ష్మి. అలాంటి కాశిమీద కోపం చూపుతున్నావా? వేదభూమి అయిన కాశీని పట్టెడన్నంకోసం, మొగంవాచి, నీ యంతటి వాడు శపించడానికి సిద్ధపడడమా? సరే పాపం! ఆకలితో బాధపడుతున్నావు. ఇప్పుడు నిన్ను ఏమీ అనరాదు. అందునా గృహిణిని. రా! మా ఇంటికి భోజనానికి రా! అంతా అయ్యాక, విశ్రాంతిగా కూర్చున్నాక, నీతో మాట్లాడాల్సిన మాటలు కొన్ని ఉన్నాయి. వెళ్లి గంగలో స్నానం, సంధ్య ముగించుకుని త్వరగా రా! నా భర్త వైదికక్రియలన్నీ నిర్వర్తించుకొని, అతిథిరాకకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. బాగా వయసుమళ్లినవాడు. ఆకలికి ఓర్వలేడు. ఏలాంటి సంకట సమయమందైనా అతిథిసత్కారం చెయ్యక, చెయ్యితడి చేసుకోని నిష్ఠాపరుడు. కనుక త్వరగా దయచేయి– అపరాహ్ణం అయిపోయింది.........."

ఆ ముత్తైదువ మాటలు విన్నాడు. వ్యాసుడు– "కల్యాణీ! నేటివరకు కాశీలో నిన్నెన్నడూ చూడలేదు. ఎవరమ్మా నువ్వు? నిన్ను చూడగానే నా సర్వేంద్రియాలకూ ఏదో సంతృప్తి కలిగింది. స్త్రీరూపం ధరించిన కాశీపురివా? కాక నిత్యమూ ఆకలి కాక తీరేట్టు ఈ క్షేత్రంలో అమృతాన్నభిక్ష పెట్టుతూన్న విశాలాక్షివా? చెప్పవమ్మా! వీనులవిందుగా నీ పేరు చెప్పు తల్లీ!"



వ్యాసునిమాటలు విని ఆమె "అయ్యా! ఇప్పుడదంతా అనావశ్యకం. నువ్వు ఆకలితో ఉన్నావు. అటు ప్రొద్దుపోతూంది. భోజనం అయిన తరువాత చెప్పాల్సిందంతా చెప్తాను. త్వరగా వెళ్లు, నీ శిష్యులను అందరినీ పిల్చుకురా! నా భర్త అనుగ్రహం వల్ల అందరికీ సంతృప్తికలిగేట్టు ఆహారం పెట్టగలను" అనింది. "మంచిది, వస్తాం" అని, వ్యాసుడు త్వరగా వెళ్లి, శిష్యులను వెంట నుంచుకుని, గంగకు పోయి స్నానంచేసి, వచ్చాడు. ఆ ముత్తైదువ బంగారు అరటాకులు వేసింది. బంతులు దీరి, వ్యాసుడూ, శిష్యులూ కూర్చున్నారు. మొట్టమొదటి ఆకు ఇంటి యజమానికి. గృహిణి ఆకులపై జలం చల్లింది. అంతే! ఇంద్రజాలంలాగా ఆకులన్నీ వివిధఆహారపదార్థాలతో నిండి పోయాయి. ఆకులలో అప్పటికప్పుడు మొలిచినట్టున్న పదార్థాలను చూచి, వ్యాసునితో కూడా అందరూ ఇదేదో కనికట్టులా ఉంది. ఎవరూ వడ్డించింది కాదు. అన్నమూ, వ్యంజనాలూ, భక్ష్యాలూ, భోజ్యాలూ, చోష్యాలూ, లేహ్యాలూ, పానీయాలూ, ఫలాలూ, ఫలరసాలూ, వరుగులూ, బజ్జులూ, గొజ్జులూ, ఇడ్డెనలూ, దోసెలూ, అప్పడాలూ, వడియాలూ, పచ్చళ్లూ, ఊరుగాయలూ ఎలా వచ్చాయో? ఈ పెరుగుదొన్నెలు

మొదటలేవే! ఇదంతా నిజమేనా? అని ఎవరి విస్తరి వారు తాకి చూశారు. పదార్థాలన్నీ ఉన్నాయి. అంతలో ఆమె వచ్చి, శుద్ధిచేసిన పసిడి గరిటెతో నెయ్యి క్షణంలో అన్నిపాత్రలపై అభిఘరించింది. ఆమె వెంట గృహస్థు కూడా వచ్చాడు.

నిశ్శబ్దంగా భోజనాలు సాగాయి. అందరూ హస్త ప్రక్షాళన, ఆచమనం, చేసి, విశ్రాంతిగా విశాలమందిరంలో కూర్చున్నారు. అందరికీ ఎదురుగా ఒకపీఠం ఉంది. యజమాని మెల్లమెల్లగా గృహిణి చేయూతతో నడిచి వచ్చి, ఆ పీఠంమీద కూర్చున్నాడు. ఎదురుగా ఉన్న ఆసనంమీద వ్యాసుడు కూర్చు న్నాడు. గృహస్థు గేస్తురాలిని చూచి, కనుసన్న చేశాడు.

అది గ్రహించి ఆమె కాస్త ముందుకు వచ్చి– "మునీంద్రా! కడుపునిండా ఆరగించావా? మీ శిష్యులందరూ వచ్చినట్టేనా? దారితెలియక ఏ సందుగొందులోనో, ఏ మూరు మూలనో ఏ ఒక్కరూ ఉండలేదుకదా! ఏదో మాకు తోచిన ఆతిథ్యం ఇచ్చాం. శుచీ, రుచీ ఎలా ఉన్నాయో?" అనింది.

వ్యాసుడు నమస్కరించి "అమ్మా! ఎంతమాట! ఎంత మాట! మా జన్మలో ఇంతవరకు ఇలాంటి విందు కలలోనైనా ఎరుగం. మా శిష్యులందరూ వచ్చారు. తృప్తిగా ఆరగించారు. ఏమి పదార్థాలు! ఏమి పిండివంటలు! ఏమి శుచీ! ఏమి రుచీ! అమ్మా! నా బుద్ధికి తోచినమాట! ఇది మానవకల్పితం కాదు. దైవీవిభూతి సందేహం లేదు. తల్లీ! నీవు భక్తకల్పవల్లివి. శ్రీవిశాలాక్షివి. ఈ మహానుభావుడు ఆశ్రితశుభంకరుడు శ్రీవిశ్వే శ్వరుడు. నా భావన నిజమేనా? సెలవీయవమ్మా!" అన్నాడు.

"మా ఆతిథ్యం మీకందరికీ తృప్తికరమైంది కదా! మాకు కావలసింది అదే! ఇక మేము ఎవరైతే నీకెందుకు? భోజనం అయ్యాక అనవలసినవి అంటానన్నాను. ఇప్పుడు అంటున్నాను విను– సన్యాసీ!

నువ్వు వేదాలను చిక్కు తప్పించి, చక్క చేసిన వ్యాసుడవు కదూ! నిన్ను ఒకమాట అడుగుతున్నాను, సరైన సమాధానం చెప్పు. తీర్థవాసుల ముఖ్యధర్మం ఏమి?"

ఆ ఇల్లాలి ప్రశ్నకు సమాధానంగా వ్యాసుడు అన్నాడు– "ఉద్వేగం కలిగించే మాట ఆడకూడదు. పరుల ఉత్కర్షకు, మెచ్చు కోవాలిగాని నొచ్చుకోకూడదు. ఏ పని చేసినా లెస్సగా ఆలోచించి చెయ్యాలి. తనగృహక్షేమం చూచుకోవాలి (తానున్న స్థానపు మేలు కోరాలి)."

ఆ సమాధానం విని, ఆ ముత్తైదువ– "వేదవ్యాసా! పద్దెమిదిపురాణాలు పలికిన వాగ్మివి. నీకు తెలియని నీతీ, నియమం లేదు. ఇప్పుడు నువ్వు చెప్పిన సమాధానం నీకు వర్తిస్తుందా? ఆలోచించు. ఒక్కపూట నీ పొట్టకు పట్టెడన్నం లభించలేదని నలిగి, అలిగి, పుణ్యరాశిని కాశిని శపిస్తావా? ఋషి లక్షణమా ఇది? కోపం పాపానికి ధూపం అని నువ్వు చెప్పిందే! తీర్థవాసికి కోపం తగదని తెలిసికూడా కాశిని శపించడం కాశీప్రియుడైన శ్రీవిశ్వేశ్వరుణ్ణి తిట్టినట్టు కాదా? దానికి సర్వశక్తిసంపన్నుడైన ఆ మహాదేవుడు అలిగితే నీ గతి ఏమి కాను? ముక్తికి మూలకందమైన కాశిని తూలనాడేవాడు రుద్రపిశాచం అవుతాడు తెలుసునా?" అని ఆమె భర్తమొగం చూచింది.

ఆ యజమాని అప్పటికే కోపంతో చరమరలాడు తున్నాడు. "ఓ మూర్ఖుడా! కూటికీ, నీటికీ పాటి తప్పిన కోపిష్ఠీ! నీ మర్యాద ఈపాటిదని నిరూపించుకున్నావు. ఇది నాకు పరమప్రేమాస్పదమైన నివాసక్షేత్రం, సకలసురనరమునిస్తుతి పాత్రం. ఈలాంటిక్షేత్రంలో నీవంటి కోపశీలుడు ఉండడానికి తగడు. ఈ క్షణమే కాశిని విడిచిపో! ఇదే నా ఆజ్ఞ!" అని దిగ్గున లేచాడు. వ్యాసుడు మేనంతా ముచ్చెమటలుపట్టి గడగడ వడకుతూ, ఆ పుణ్యదంపతుల పాదాలకు సాష్టాంగనమస్కారం చేసి, బుద్ధి గడ్డి తిని కానిపని చేశాను" అని లేచి; "అపరాధిని. కృపతో క్షమించవలసిందని ప్రార్థిస్తున్నాను. దాసునితప్పు దండంతో సరికదా!" అని వేడుకున్నాడు.

"ఊఁ. మంచిది. నేనన్నమాట జరుగవలసిందే! ఈ అయిదుక్రోసుల మేర ఎక్కడా ఉండవద్దు. అవతల ఎక్కడైనా ఉండు. నా భవనానికి పైన ఉన్న పసిడికలశాలు కనిపించే చోట నీ శిష్యులతో నివసించు. పర్వసమయాల్లో ప్రతిమాసం కృష్ణపక్షచతుర్దశినాడు లోపలకు వచ్చి, మా దర్శనం చేసుకుని పోతూఉండు. ఇక ఏ తీర్థాలనూ నిందించక, బుద్ధిగా బ్రతు కుతూ ఉండు" అని ఫాలాక్షుడు శాసించి, పరమేశ్వరితోకూడా అంతర్ధానమయ్యాడు. వ్యాసుడు శిష్యులతో తత్క్షణం కాశిని విడిచి, గంగకు ఆవలి ఒడ్డున బస ఏర్పరచుకొని, శిష్యులతో కూడా నివసిస్తూ, శివకథాప్రసంగాలతో కాలక్షేపం చేయసాగాడు (అదే వ్యాసకాశి).

ఆయుర్వేదం

# చిరు చిరు జల్లులు-చిన్న చిన్న జాగ్రత్తలు

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

వర్షాకాలం ఆరంభం కావటంతో ఇన్నాళ్లు ఉక్కపోతను ఎదుర్కొన్న ప్రజలకు ఊరట లభించింది. ఈ వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ అనేకరకాలవ్యాధులు ప్రబలిపోయి మనల్ని అనారోగ్యానికి గురిచేసే అవకాశాలు కూడా చాలా ఎక్కువ. జలుబు, గొంతునొప్పి, దగ్గులాంటి సమస్యలు, మలేరియా, వివిధరకాల విషజ్వరాలు, డయేరియా, కలరా, కామెర్లులాంటి విభిన్న వ్యాధులు ఈ కాలంలో ఎక్కువగా విజృంభిస్తాయి. ఈ సమయంలో రోగాలు ప్రబలడానికి ప్రధాన కారణం వాతావరణ కాలుష్యంతో పాటు మనలో వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లటమే. చిన్నపిల్లల్లో ఈ వ్యాధి నిరోధకశక్తి మరీ బలహీనంగా ఉండటంతో వ్యాధులు మరీ ఎక్కువగా విజృంభించే అవకాశముంది.

### మే నెల క్విజ్-10 సమాధానాలు

| | |
|---|---|
| 01) శ్రుతులు | 11) కదళి |
| 02) సురభి | 12) భృగుమహర్షి |
| 03) శ్వాస | 13) చిటికసేవ |
| 04) హృషీకేశుడు | 14) మానవజన్మ |
| 05) ఆంజనేయుడు | 15) ఆగామికర్మలు |
| 06) ఓం నమో నారాయణాయ | 16) నారాపురం |
| 07) కల్మషరహితమనస్సు | 17) అర్జునుడు |
| 08) సరస్వతీదేవి | 18) ధ్రువుడు |
| 09) శ్రీకూర్మావతారం | 19) హనుమంతుడు |
| 10) అన్నమయ్య | 20) సామవై |

సరైన సమాధానాలు వ్రాసినవారు-

01) కె.విశ్వతేజ, కరీంనగర్.
02) పైడి లక్ష్మీశ్రీ అన్విత, విశాఖపట్నం.
03) పోతు శరణ్య, జగిత్యాల.
04) బి.ప్రియాన్షు, మథిర.
05) సుంకరి సాత్త్విక, మెదక్.
06) ఎం.అభిజ, హైదరాబాదు.

### చికిత్సలు

ఒక వారంపాటు రోజూ ఉదయం పరగడుపున 5 వేపాకులు, 5 మిరియాలు కలిపి నమిలి మింగితే సంవత్సరమంతా వివిధరకాల అంటువ్యాధులు, క్రిములవల్ల సంభవించే వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందవచ్చు.

తిప్పతీగె ఆకులను దంచి గచ్చకాయంత ఉండలు చేసి ఉదయం, సాయంత్రం సేవిస్తుంటే కామెర్లు త్వరగా తగ్గుతాయి. రోజూ రెండుసార్లు పూటకు 10-20 మి.లీ. తిప్పతీగె రసాన్ని అలాగే గాని లేదా కాస్త తేనె కలిపి గాని సేవించటం వల్ల వివిధరకాల విషజ్వరాలు తగ్గటమే కాక రోగులు త్వరగా కోలుకుంటారు.

చిన్న పిల్లలకు వారి వయసును బట్టి వైద్యుల సలహా మేరకు ప్రమాణాన్ని వాడుకోవాలి. ఆయుర్వేదవిక్రయశాలల్లో లభ్యమయ్యే అమృతారిష్ట, కిరాతారిష్ట, పంచతిక్తారిష్ట, భూనింబాదిక్వాథలాంటి ఔషధాలు వ్యాధి నిరోధకశక్తిని పెంచేందుకు, అంటుజ్వరాలను తగ్గించేందుకు, అవి రాకుండా ఉండేందుకూ ఉపయోగపడతాయి.

వీటిలో ఏదో ఒక ఔషధాన్ని కొన్నాళ్లపాటు రోజూ రెండుపూటలా ఆహారం తర్వాత పూటకు 10 మి.లీ. ఔషధాన్ని సమంగా నీరు చేర్చి సేవిస్తే చాలా ఉపయుక్తంగా ఉంటుంది. చిన్నపిల్లల్లో అంటే 2, 3 సంవత్సరాలు దాటిన పిల్లల్లో వారి వయసును బట్టి 2.5 మి.లీ. నుంచి 5 మి.లీ. ఔషధాన్ని సమంగా నీరు కలిపి వాడవచ్చు.

### జాగ్రత్తలు

❖ రోడ్ల ప్రక్కన విక్రయించే అపరిశుభ్ర ఆహారపదార్థాలు తినరాదు.

- ❖ చేతులు శుభ్రంగా కడుక్కుని ఆహారం తింటుండాలి.
- ❖ ఆకుకూరలు, కూరగాయలను శుభ్రంగా కడిగి వండాలి. లేదా ఉప్పునీళ్ళు లేదా పసుపునీళ్లలో 2, 3 నిమిషాలుంచి మరలా మామూలు నీళ్లతో కడిగి వండుకుంటే మంచిది.
- ❖ తాజాగా వండిన ఆహారం తింటుండాలి.
- ❖ కూలర్లు, పూలకుండీలలో నీరు మారుస్తుండాలి. వీటిని వారానికి ఒక రోజు పూర్తిగా ఎండిపోయేలా చేసే దోమ లార్వాలు చనిపోతాయి.
- ❖ పాత టైర్లు, కప్పులు, కొబ్బరిచిప్పలు, పాత్రలు వంటి వాటిల్లో నీరు లేకుండా చూచుకోవాలి. మరియు నివాస ప్రాంతాల్లో నీరు నిల్వలు లేకుండా చేసుకోవాలి.
- ❖ పాచైన ఆహారం, పళ్లు లాంటివి సేవించరాదు.
- ❖ కాచి చల్లార్చిన నీరు సేవించటం ఉత్తమం.
- ❖ మురికికాల్వలు, గుంటలపై ఫినాయిల్ లేదా కిరోసిన్ చల్లటం మంచిది.
- ❖ దోమలు కుట్టకుండా నిమ్మరసంలో కాసిని నీళ్లు కలిపి ఒంటికి పట్టించుకోవాలి.
- ❖ వేపనూనె గాని, యూకలిప్టస్ ఆయిల్ గాని, తులసిరసంగాని లేదా నువ్వులనూనెలో కాస్త వాంపువ్వు కలిపిన మిశ్రమం గాని ఒంటికి రాస్తే దోమలు కుట్టవు. ఈ మిశ్రమాన్ని కాగితానికి పట్టించి కిటికీలు, తలుపుల వద్ద వ్రేలాడదీస్తే దోమలు దరి చేరకుండా ఉంటాయి.

## గ్రంథసమీక్ష

**ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ విరచిత**

# యుగళ తారావళి

**(మధుర, మిత్ర వ్యాఖ్యానం)**

వ్యాఖ్యానం–డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, పుటలు–142; సైజు– 1/8 డెమ్మీ, వెల–రూ. 150/–; ప్రతులకు–93941 13848

కావ్యరసవేత్త, సంస్కృతీ, సంప్రదాయాలకు నిలువెత్తు సంతకంగా నిలిచిన ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణగారి లేఖిని నుండి వెలువడిన లఘుకావ్యద్వయి **'యుగళతారావళి'**. 'యుగళతారావళి'లో మొదటిది **'మహాదేవి మత్తేభతారావళి'**. వస్తు, రూప, శిల్పాది విశేషాలతో పరమేశ్వరితత్త్వాన్ని మత్తేభవృత్తాలలో వర్ణించిన కావ్యం. దీనికి ఆచార్య వెలువోలునాగరాజ్య లక్ష్మిగారు మధురమధురంగా సమకూర్చిన వ్యాఖ్య పరమేశ్వరిని దర్శింపచేసింది.




ఇందులో రెండవది 'దివాకరవృత్త తారావళి'. కర్మసాక్షి, ప్రత్యక్ష ఆరాధ్యదైవం అయిన దివాకరుని రూప గుణతత్త్వవైభవాలను, ప్రభావగరిమను 27 వృత్త పద్యాలతో ఆవిష్కరించిన కావ్యం. సూర్యసంబంధ అంశాలను, లోక బాంధవుని ఆరాధనా విశేషాలను అనుసంధానం కావిస్తూ రససమంచితమైన రీతిలో నిర్మింపబడిన తారావళి. నన్నయ మార్గరీతి, తిక్కన తెనుగునుడికారపు సొంపు, ప్రబంధకవులు పరబంధ విన్యాసాలు, విశ్వనాథ అభివ్యక్తి వైచిత్రిని తలపింప చేస్తూ మహాకావ్యత్వ గౌరవం ఆర్జించిన లఘుకావ్యం దివాకర వృత్త తారావళి. దీనికి ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మిగారు సమకూర్చిన 'మిత్ర' వ్యాఖ్యరసజ్ఞులహృదయాలకు ఆనందాను భూతినందించింది.

కాలాంతరంలో సహితం సాహిత్య లోకంలో సముచిత గౌరవస్థానాన్ని పొంది సజీవంగా నిలిచిపోవటం సాహిత్యసృజనకు ప్రామాణికత కలిగించే లక్షణం. ఆ లక్షణాన్ని రెండు తారావళులకు నాగరాజ్యలక్ష్మిగారి ప్రామాణికమైన వ్యాఖ్యపరిపూర్ణంగా సాధించింది. సంప్రదాయ సాహిత్య పఠనాభిరుచి కలిగిన వారంతా తప్పక చదవాల్సిన వ్యాఖ్య ఇది.

*– డా॥ కె. రాధారమణ*

చిత్ర కథ

# గురుదక్షిణ

కథ– డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు– శ్రీ తుంబలి శివాజీ




కాలక్రమంలో కురు పాండవుల విద్యాశిక్షణ ముగిసింది..
మమ్మల్ని ఇంతటి వీరులుగా తీర్చిన గురుదేవా! మీకేమి గురుదక్షిణ ఇచ్చుకోగలం?
ద్రుపదుణ్ణి బంధించి తెచ్చి గురుదక్షిణగా ఇవ్వాలి..!
అర్జునుడు, ద్రుపదుణ్ణి యుద్ధంలో జయించి, తన రథచక్రానికి కట్టి, ద్రోణాచార్యుని సన్నిధికి తెచ్చాడు.
గురుదక్షిణ స్వీకరించండి గురుదేవా!
ఎవరీయన? ఈ రత్నాభరణాలు, ఈ పట్టు వస్త్రాలు చూస్తుంటే ద్రుపదుడనిపిస్తున్నాదే!
మిత్రమా! ద్రోణా! నన్ను క్షమించు...
రాజ్యాధికార గర్వం ఇప్పటికైనా అణగిందా? అన్ని రోజులూ మనవి కాదు ద్రుపదా! గుర్తుపెట్టుకో!
అర్జునా! ఇతడి బంధనాలు తొలగించు!
నాయనా! అర్జునా! ఈ రోజుకోసం రాత్రింబవళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూశాను. ఈ నాటికి నా కోరిక నెరవేరింది...
విజయోస్తు చిరంజీవీ! స్నేహంలో తారతమ్యాలు ఉండకూడదని చరిత్ర చెప్పుకునే గురుదక్షిణ చెల్లించావు. నీకు సర్వదా జయమగుగాక!
శుభం
2

విశ్వదాభిరామం    వేమన పద్యసూక్తి



## నలుపు నలుపే

**ఎలుగుతోలు దెచ్చి యెందాక ఉతికిన,**
**నలుపు గాక ఏల తెలుపు గలుగు?**
**కొయ్యబొమ్మ తెచ్చి కొట్టితే గుణి యౌనె?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** ఎలుగుతోలు= ఎలుగుబంటి చర్మం; ఎందాక ఉతికిన= ఎంతసేపు ఉతికినప్పటికీ; గుణి= సద్గుణాలు కలిగింది.

**భావం:** ఎలుగుబంటితోలును తెచ్చి ఎంతకాలం ఉతికినా దాని నలుపుతెలుపుగా మారదు. కొయ్యబొమ్మను కొడితే (శిక్షణనిస్తే) అది సద్గుణాలు కలిగిందవుతుందా?.

**వివరణ:** ఇక్కడ 'ఎలుకతోలు తెచ్చి ఎన్నాళ్లు ఉతికినా, నలుపునలుపె కాని తెలుపు రాదు, కొయ్య బొమ్మ తెచ్చి కొట్టినా పలుకునా' అనేపాఠం వినిపిస్తుంది. ఎలుకతోలుకంటె ఎలుగుబంటి తోలు నల్లనివెంట్రుకలతో దట్టమైన నలుపు రంగుతో కన్పిస్తుంది. వేమన ఆఎలుగు తోలునే చెప్పిఉంటాడు. ఏదైనా, సహజమైన జీవలక్షణం ఎంత ప్రయత్నించినా మారదు. అనేది సారాంశం. దుర్మార్గుడిని మంచివాడుగా మారుద్దామని ఎంతగా ప్రయత్నించినా వాడికి మంచితనం రాదు. కేవలం శ్రమమాత్రమే తప్ప, మలినబుద్ధికి స్వచ్ఛమైన మనసు తీసుకు రాలేమని భావం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

## గొడవ మంచిది కాదు

చ. తగిలి మదంబుచే నెదిరిఁ దన్ను నెఱుంగక దొడ్డవానితోఁ
బగ గొని పోరుటెల్ల నతిపామరుఁడై చెడు టింతె కాక తా
నెగడి జయింపనేరఁ డది నిక్కము తప్పదు ధాత్రిలోపలన్
దెగి యొకకొండతోఁ దగరు దీకొని తాఁకిన నేమి భాస్కరా!

**తాత్పర్యం**

భాస్కరా! పొగరుతో తన బలాన్ని, ఎదుటి బలాన్ని తెలుసుకోకుండా బలవంతునితో గొడవపడడం వల్ల మూర్ఖుడై చెడిపోతాడేగాని, విజయం సాధించలేడు. పొట్టేలు కొండను ఢీ కొంటే తలపగిలి చస్తుంది కదా!

వ్యక్తి తన శక్తిసామర్థ్యాలు తెలుసుకోకుండా ఏ పనికీ పూనుకోకూడదు. పైగా అన్యులతో వ్యవహారం వచ్చినప్పుడు వారి శక్తి ఏమిటో అంచనా వేయగలగాలి. అలా కాకుండా అహంకారంతో బలవంతుడితో కలహం పెట్టుకుంటే అపజయమే కానీ, ఫలితం ఉండదు. మూర్ఖుడు ఇలాంటి పనికి పూనుకుంటాడు. వివేకం ఉన్నవాడు తన శక్తి ఏమిటో తెలుసుకుని అందుకు తగిన విధంగా నడుచుకుంటాడు.

పూర్వం పాండవులు వనవాసం చేస్తున్నప్పుడు ఒకరోజు ద్రౌపది కుటీరంలో ఒంటరిగా ఉంది. అటుగా వెళ్తున్న సైంధవుడు, ఆమెను చూచి, మోహించి తన వెంట రమ్మన్నాడు. ద్రౌపది అతనికి నీతి ఉపదేశించి, తన భర్తల పౌరుషప్రతాపాలను తెలియజెపుతుంది. మూర్ఖుడైన సైంధవుడు ఆ మాటలను లెక్కచేయకుండా ద్రౌపదిని బలవంతంగా రథంపై ఎక్కించి తీసుకుని పోతుంటాడు. ఈ విషయం తెలుసుకున్న పాండవులు అతని వెంటపడతారు. భీముడు వేగంగా వెళ్లి, అతణ్ణి కొట్టి, పట్టి ఈడ్చుకొని వచ్చి ధర్మరాజు కాళ్లమీద పడ వేస్తాడు. ధర్మరాజు ప్రాణభిక్షపెట్టడంతో ప్రాణాలు దక్కించుకొని ఘోరఅవమానంతో సైంధవుడు వెనుదిరుగుతాడు. మూర్ఖులు తమ స్వశక్తి తెలుసుకోకుండా, గొప్పవారితో తలపడితే అవమానం తప్పదని ఈపద్యం లోని నీతి.

– డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## అంకెలు కలపండి!!

పిల్లలూ!
అంకెలు
కలుపుతూ
వెళ్లితే
తులసికోట
సిద్ధం!!



## పిల్లలూ! దారి కనుక్కోండి!!







శిష్యుడు గురువును
కలుసుకునే దారి చూపండి!!

## కంఠస్థం చేయండి!!

శ్లో॥ యన్మూలే సర్వతీర్థాని,
యన్మధ్యే సర్వదేవతాః ।
యదగ్రే సర్వవేదా శ్చ,
తులసి త్వాం నమా మ్యహమ్ ॥

భావం

అమ్మా! తులసి! నీ చెట్టుమూలంలో సర్వపుణ్యతీర్థాలు, చెట్టుమధ్యలో సర్వదేవతలు, చెట్టుకొనలపై సర్వవేదాలూ ఉంటారు- (ఉన్నారు). అట్టి నిన్ను (నీకు) నేను నమస్కరిస్తున్నాను!

తులసిని దర్శించేటప్పుడు చెప్పాల్సిన శ్లోకం

## రంగుల ప్రపంచం

బాలచిత్రకారులు!
రంగులు ఉన్న
బొమ్మను చూసి,
ఆ రంగులనే..
రంగులు లేని
బొమ్మకు
వేయండి!!





# క్విజ్ 12

01) ఆత్మస్వరూపాన్ని వివరించేవి? జ)........................

02) శ్రవణాదులను అభ్యసిస్తే కలిగేది? జ)........................

03) వశిష్ఠుని పెద్దకొడుకు ? జ)........................

04) సూతపౌరాణికుడు ఎవరు? జ)........................

05) భగవంతుని దృష్టిలో ప్రధానమైనవి? జ)........................

06) దేవతలు తుమ్మెదల్లా తిరిగే క్షేత్రం? జ)........................

07) యోగవిభాగాన్ని వ్యాకరణ మహాభాష్యంలో ఎవరు ఉపయోగించారు? జ)........................

08) సూర్యుడు దక్షిణాయనానికి ఎప్పుడు మరలుతాడు? జ)........................

09) మనం సరైనమార్గంలో వెళ్లాలంటే ఎవరుండాలి? జ)........................

10) విషజ్వరాలు రాకుండా ఏ రసం సేవించాలి? జ)........................

11) ద్రుపదుడు ఏ దేశానికి రాజు? జ)........................

12) సాధకులకు కలిగే సందేహాలు తీర్చేవి? జ)........................

13) మామగారింట్లో ఏ వైపు తలపెట్టి పడుకోవాలి? జ)........................

14) జన్మనక్షత్రంలో వివాహం ఎవరికి పనికిరాదు? జ)........................

15) భారతీయులకు ఆదిగురువు? జ)........................

16) జ్ఞానానికి మారుపేరైన అవతారం? జ)........................

17) గేయ దక్షిణామూర్తి అని ఎవరికి పేరు? జ)........................

18) శంకరుడు విశ్వేశ్వరుడై ఎక్కడ ఉన్నాడు? జ)........................

19) వనవాసంలో ద్రౌపదిని మోహించినవాడు? జ)........................

20) కాశీలో వ్యాసుడికి దొరకనిది? జ)........................

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-07-2023.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. వెతికి రాయండి.

చందాసంఖ్య: ........................ వయస్సు: ................

పాఠశాల: ........................ తరగతి: ................

పేరు: ........................

చిరునామా: ........................

........................

........................

........................ పిన్‌కోడ్: ................

ఫోను నెంబరు: ........................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** దైవసంబంధకార్యాల్లో పాల్గొంటారు. వృత్తి, ఉద్యోగాలు అనుకూలం భూమి కొనుగోలు లేదా ఏదైనా ఉద్యోగంలో స్థిరపడుట ఉద్యోగంలో జీతం పెరుగుట. కుటుంబఆరోగ్యం బాగుంటుంది. దూర ప్రయాణాలు కలిసివస్తాయి.



**వృషభం–** కుటుంబనిర్వహణకు ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తారు. సోమరితనం వల్ల పనులన్నీ పేరుకుపోయి పని ఒత్తిడి, కార్యభారం ఎక్కువయ్యే అవకాశం ఉంది. సంతానం వృద్ధిలోకి వస్తారు.



**మిథునం–** ఆస్తి పెరుగుతుంది. ఆదాయం కూడా పెరుగుతుంది. వ్యాపారంలో ఆశించిన లాభాలు వచ్చి సామాజికస్థాయి పెరుగుతుంది. భౌతిక సౌకర్యాలు అనుభవిస్తారు.



**కర్కాటకం–** దుబరా ఖర్చులు తగ్గించుకుంటారు. పదోన్నతి లేదా వేతనాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. పెట్టుబడులు లాభదాయకంగా ఉంటాయి. ఆర్థికస్థితి మెరుగుపడుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. దూరప్రయాణాలు కలిసివస్తాయి.



**సింహం–** ఆరోగ్యవిషయాలు గతంకంటే అనుకూలం. ఈ సమయంలో పెట్టుబడులు అనుకూలం. ఆర్థికస్థితి బాగుంటుంది. ఆరోగ్యవిషయాలకు కూడా ఇది మంచికాలం. ప్రయాణాలు ఫలవంతమౌతాయి. మసాంతంలో అధికఖర్చులు.



**కన్య–** సోదరబలం ఉంటుంది. స్నేహితుల అండదండలు మీ సంకల్పశక్తిని పెంచుతాయి. అనేకమార్గాలనుండి ఆదాయాన్ని సంగ్రహిస్తారు.



**తుల–** సంపదను వృద్ధిచేస్తారు. కీర్తి పెరుగుతుంది. స్నేహితులనుండి మద్దతు, ప్రయత్నాలలో విజయం పొందుతారు. ఆర్థికసమస్యల నుండి బయటపడతారు. గృహవాతావరణం అనుకూలం.



**వృశ్చికం–** ఈ రాశివారి జీవనశైలి సంపన్నంగా ఉంటుంది. ప్రయత్నాలకు అనుగుణంగా ఆదాయం కూడా తగినంతగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.



**ధనుస్సు–** వ్యాపారలక్ష్యాలను నెరవేర్చుకోవడానికి మంచిసమయం. కళత్రఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. పిల్లలచదువుల్లో ముందంజ, వాహనం, సంపద మరియు విలాసాలతో తులతూగుతారు.



**మకరం–** గుండె, పొట్టకు సంబంధించిన ఆరోగ్య సమస్యల గురించి వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. మీరు మీ జీవితభాగస్వామి మరియు పిల్లలతో కూడా సమస్యలను ఎదుర్కోవచ్చు. వృత్తివ్యాపారాలలో అధికారుల వత్తిడి ఉంటుంది.



**కుంభం–** విద్యార్థులు చదువుల్లో రాణిస్తారు. ప్రతిభాపాటవాలు కలిగి పురోగమిస్తారు. ఇతర దేశాల్లో పైచదువులకు అవకాశం వస్తుంది. దూర ప్రయాణాలు కలిసివస్తాయి. గృహవాతావరణం అనుకూలం.



**మీనం–** విద్యార్థులు చదువుల్లో రాణిస్తారు. ప్రతిభాపాటవాలు ప్రదర్శించి పురోగమిస్తారు. తల్లిదండ్రులకు కలిసివస్తారు. కుటుంబంలో ఆనందం సంతృప్తి కలుగుతుంది. విదేశీప్రయాణాలు కలిసి వస్తాయి.

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________________

______________________________

______________________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) | | | | | | |

సెల్ నెం. | | | | | | | | | | | |

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

........................................ తేది : ..................

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 90




**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

## అడ్డం

2)పేలాలపిండిని ప్రసాదంగా తీసుకునే ఏకాదశి(2); 3)విష్ణువు శయనించే ఏకాదశి(6); 7)చంద్రుడు పిల్లలకు...(2); 8)కృష్ణుడికి పాలిచ్చిన రాక్షసి(3); 9)తీగ(2); 12)ఆషాఢమాసంలో స్త్రీలు చేతులకు పెట్టుకునేది(4) 13)సౌమిత్రి తల్లి(3); 15)తమిళంలో ఆషాఢ మాసం(2); 19)సీతారాములకు కలిగింది(3); 20)శనిదేవుడి వాహనం(3)

## నిలువు

1)కొత్తగా పెళ్లైనజంటకు ఎడబాటు కలిగించే మాసం(5); 2)తొలకరిని ఇలా కూడా అంటారు(3); 4)శనిదేవుని వాహనం(2); 5)ఒక నది(3); 6)ఆషాఢమాసంలో తప్పనిసరిగా తినాల్సింది(3); 10)చిలకకు తోడు(3); 11)ఆషాఢబహుళ ఏకాదశి(3); 14)యతులు, సన్యాసులు ఆషాఢమాసంలో తీసుకునేది(6); 15)తిరుమలలో ఆణివర ఆస్థానం జరిగే మాసం(3);16)ఇక్కడి నంది చాలా ప్రసిద్ధి(3); 17)గోదాదేవి పుట్టిన మాసం(3); 18)ఇతని నీతి ప్రసిద్ధం(4)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు




Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



తిరుమలక్షేత్రంలోని అంజనాద్రి, ఆకాశగంగతీర్థం,
జాపాలి, శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న
శ్రీబేడి ఆంజనేయస్వామివారి ఆలయం,
తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని
7వ మైలు దగ్గరున్న శ్రీప్రసన్న ఆంజనేయస్వామివద్ద
2023, మే 14 నుండి 18వ తేదీ వరకు
తి.తి.దే. నిర్వహించిన
**హనుమజ్జయంతి** ఉత్సవదృశ్యాలు.



ఈ ఉత్సవాలలో
శ్రీకంచికామకోటి పీఠాధిపతి
శ్రీశ్రీశ్రీ విజయేంద్రసరస్వతీస్వామివారు
అనుగ్రహభాషణం చేశారు.
ఇందులో
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.,
తి.తి.దే. సంయుక్త
కార్యనిర్వహణాధికారి
శ్రీ వి. వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,
తదితరులు పాల్గొన్నారు.









SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-06-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

